పృథ్వీపుత్రి

[The Exit of Seeta]

UD.4/ROP 2661/ROP

గ్రంథకర్త:
కవిభూషణ
శ్రీ గుండిమెడ వేంకట సుబ్బారావు
B. A., B. Ed.,
Author of
KHILJI RAJYA PATHANAM, Etc.,

అన్నిహక్కులు గ్రంథకర్తవి

1957

రు. 1-50

ద్వితీయ ముద్రణము : 1957

లిఖితపూర్వకమైన గ్రంథకర్త యనుమతి లేక
ఈ నాటకము నెవ్వరును ప్రదర్శింపరాదు.
— గ్రంథకర్త

PRINTED AT
NATIONAL PRINTING PRESS, TENALI.

పీ ఠి క

సారస్వత ప్రపంచమున విశేష ప్రచారముఁ గాంచిన పౌరాణికైతిహాసిక కథావస్తువులందు ఉత్తరరామచరిత్ర మొకటి. అనేక ముఖముల, అనేక రూపముల, అనేక వర్ణముల, నీ ప్రసిద్ధ చరిత్రము చిత్రింపఁబడి యున్నది. కేవలము కథాసౌందర్యమునందే కాక పాత్రౌచిత్యమునందును, స్వభావోన్మీలనమునందును సహితము ఆ యా రచయితల దృష్టి నిలచుటచేఁ గావలయు, ప్రధాన కథా శరీరమునకు ఘాతఁ గల్గింపక, యెవరికిఁ దోచినరీతిని వారు శక్తి కొలఁది వస్త్రభూషణశృంగార మొనర్చి, ఉత్తరరామ చరిత్రమును సారస్వతరంగమునఁ బ్రదర్శించియున్నారు. అట్టి ప్రదర్శనమునకే పూనుకొనిన యొకానొక కించిన్మాత్రుఁడను నేను. కథాపాత్రలైన మహావ్యక్తుల స్వభావ పరిపోషణమే నా ప్రధానాశయము. ఈ సంకల్పమునందు ఎట్టి సాహసమునకైనను నేను వెనుదీయలేదు. నా యంతరంగమును గ్రహించి విద్వత్ప్రపంచము నా సాహసమును మన్నించుఁగాక!

ఈ గ్రంథరచనమునందు అనేకములగు అన్యభాషా గ్రంథములు నాకుఁ దోడ్పడినవి. ఆ యా గ్రంథములందు నా స్వల్పబుద్ధికి మనోహరములని తోచిన విశేషాంశములనెల్ల నా శక్తికొలఁది యీ గ్రంథమునందుఁ జిత్రించితిని. ఈ ప్రయత్నమునందు నాకు సహాయ మొనర్చిన మిత్రవర్గమునకెల్ల నా కృతజ్ఞతాభివందనము లర్పించుచున్నాను.

అజ్ఞతా జనితములగు నిందలి దోషములకు ఆంధ్ర మహాజనులను క్షమాభిక్ష నర్థించుచున్నాను.

ఇట్లు
విద్వజ్జనవిధేయుఁడు,
గుండిమెడ వేంకట సుబ్బారావు
గ్రంథకర్త

ఛత్రపురము,
25—9—'45

ACC NO
5820

ద్వితీయముద్రణ

పీఠిక

ACC NO
5820

ఈ గ్రంథముపట్ల ఆంధ్ర విశ్వవిద్యాలయమును, ఆంధ్ర రంగస్థలమును, యావదాంధ్ర దేశమును జూపిన యభిమానమునకును కృతజ్ఞుఁడను.

నా ప్రార్థనమును మన్నించి దీనికి పునర్ముద్రణ భాగ్యము లభింప జేసి, సర్వాంగసుందరముగ దీనిని ముద్రింపించి యిచ్చిన శ్రీ కవిరాజ పబ్లిషర్స్, తెనాలి వారికి సర్వదా కృతజ్ఞుఁడను.

ఛత్రపురము,
25—9—1957

గుండిమెడ వేంకట సుబ్బారావు
గ్రంథకర్త

పాత్రలు

పురుషులు :		స్త్రీలు :
శ్రీరాముఁడు	అష్టావక్రుఁడు	సీత
భరతుఁడు	శంబుకుఁడు	ఊర్మిళ
లక్ష్మణుఁడు	కుశుఁడు	ఆత్రేయి (ఆశ్రమ వాసిని)
శత్రుఘ్నుఁడు	లవుఁడు	
వశిష్ఠుఁడు	భద్రుఁడు	తుంగభద్ర
వాల్మీకి		

ప్రధాని, సేవకుఁడు, పౌరులు మొదలగు చిల్లర పాత్రలు

Acc no

5820



శ్రీ గుండిమెడ వేంకట సుబ్బారావు, B. A., B. Ed.

గ్రంథకర్త

పృథ్వీపుత్రి

ప్రథమాంకము

దృశ్యము 1

[అయోధ్య - రాజమందిరము - నిద్రాగతయైన సీతచెంత శ్రీరాముఁ డాసీనుఁడై యుండును.]

శ్రీరా:— (స్వగ) ఆహా! యెంతలో నీ సుకుమారి గాఢనిద్రాగతయైనది!

గీ. దారుణారణ్య వాస విధ్వస్తమైన
పదియు నాల్గేండ్ల నిద్రానుభవమె కాక
భావి సకల నిద్రాసుఖావాప్తి సహిత
మిపుడె సరిపుచ్చునటుఁ దోఁచు నీ లతాంగి!

ఆహా! కుసుమకోమలమైన యీ సుకుమార తనూవల్లిక దుస్సహములైన యీ మహారణ్యవాస క్లేశముల నెట్లోర్చెనో కదా!

సీ. గమన మార్గములు కర్కశ శిలాకంటక
స్థగితంబులైన కాంతార తటులు!
విశ్రమ స్థలములు విష భుజంగ వికీర్ణ
పాషాణ గహ్వర ప్రాంగణములు!
భోజనంబు లపూర్వ భుక్త కాలాకాల
సంప్రాప్త ఫలమూల సంగ్రహములు!
సహచరంబులు పిశాచశ్రేణి వెఱపించు
స్వాచ్ఛంద వనజంతు సముదయములు!

గీ. సతి! చతుర్దశవర్ష విస్తరితమైన
ఆ భయంకర కాల మేఘాంధకార
బంధురంబగు ప్రళయ భీభత్స రాత్రి
కటకటా! యే విధంబునఁ గడపినావొ!

(కర్మచారి భద్రుఁడు ప్రవేశించి, సీతను జూచి మఱలిపోవ యత్నించును.)

శ్రీరా:— భద్రా!

భద్రు:— మహాప్రభూ, క్షమింపుఁడు, సమయముఁ జూచుకొని మరల శ్రీచరణ దర్శనముఁ గావించుకొనెదను.

శ్రీరా:— దేవి యిచ్చట నున్నదని సంకోచించుచుంటివా? అయోధ్యా రాజ్యలక్ష్మి యగు నీ పృథ్వీపుత్రి సమక్షమున గోప్యములు కాఁదగు రాజకీయ రహస్యము లేముండును? భద్రా! ఏమి విశేషము?

(ప్రవేశము - ప్రతీహారి)

ప్రతీ:— (అభివాదముఁ జేసి) మహాప్రభూ! అష్టావక్రమహర్షి వచ్చి ప్రభుదర్శన మపేక్షించుచున్నారు.

శ్రీరా:— మహానందము - భద్రా! ఇంచుక తాళుము. (లేచి ఋషి కెదు రేగును.)

(ప్రవేశము - అష్టావక్ర మహర్షి)

శ్రీరా:— (నమస్కరించి) ఋషిపుంగవా, శ్రీరాముని యభివాదము స్వీకరింపుడు.

అష్టా:— విజయీభవ! విజయీభవ! రఘువంశ భూషణా! ప్రజానురంజకుఁడవు కమ్ము. ప్రజాహృదయ సింహాసన మలంకరింపుము! (ఆసీనుఁ డగును)

శ్రీరా:— మునీంద్రా! ఏ ముహూర్తమున రఘువంశరాణ్మణులచేఁ జిరాలంకృతమై చిరపవిత్రమైయున్న యీ యయోధ్యా రాజ్య పీఠము నధిరోహించితినో యా క్షణమునుండియుఁ బ్రజానురంజనమేకదా నా జీవనాదర్శము!

శా. పాపధ్వాంత విభేదనోజ్జ్వల మణిప్రద్యోత సూర్యాన్వయ
శ్రీ పర్యంకము, సత్య విక్రమ యశస్తేజోభి రామంబు, సద్
భూపాలోత్తమ భద్రపాద విలసన్ ముద్రాంకితంబైన యీ
శ్రీపీఠంబు కళంకితం బగునె యీ శ్రీరామ రాజ్యంబునన్!

అష్టా:— వత్సా! మహానందమైనది! జగదీశ్వరుఁడు నీకుఁ దోడ్పడుఁ గాక!

శ్రీరా:— తాపసేంద్రా! శోకిక వ్యథా సంకులమైన యీ రాజ మందిరమును దమ పాదరజముచేఁ బవిత్రముఁ జేయఁ గారణ మేమై యుండును?

అష్టా:— తీర్థాటనము ముగించుకొని యాశ్రమాభి ముఖుఁడనై పోవుచు, నా యాత్రాఫలమునకు సంపూర్ణతఁ గలిగించుకొనుటకై యొక్కసారి సీతారాముల జూడ వచ్చితిని.

శ్రీరా:— ధన్యోస్మి! తాపసోత్తమా! అదే జానకి నిద్రాగతమై యున్నది. తాళుఁడు (లేపఁబోవును)

అష్టా:— (వారించుచు) వలదు, వలదు. ఆ తేజస్స్వరూప దర్శనమే నాకుఁ జాలును. ఆ నిష్కలుష దీప్తియే నాకు సర్వపంకిల నివారణము కాఁగలదు.

శ్రీరా:— మహాత్మా! తమ పాదస్పర్శచే నేఁడు మా మందిరము పవిత్రమైనది. ప్రపంచపు దుమారమునందుఁ జిక్కువడి తెన్నుఁ గానకఁ జలించెడు మా బోంట్లకుఁ దమయట్టి తపోధనుల దర్శనమేకదా తరణోపాయము! మునీంద్రా! రాక్షస భయ విదూరమై, తాపసలోక మంతయు నిప్పుడు స్వేచ్ఛావిలసితమై యున్నదికదా!

అష్టా:— రామచంద్రా! రామ కోదండ రక్షితమై మహీమండల మంతయు నిష్కంటకమైయుండ, తాపసలోకమునకు స్వేచ్ఛ కాక అన్య మెట్లగును? మహా యశోధనులగు రఘువరేణ్యుల నితాంత రక్షణమున ధర్మపాలనమును, ప్రజాను రంజనమును నిరాఘాటముగఁ బ్రవర్తిల్లుఁగాక యని యావత్ తపోధన లోకమును నిన్నాశీర్వదించుచున్నది.

శ్రీరా:— ధన్యోస్మి! మునివరేణ్యా! ప్రజానురంజనమునకై నా యైహిక సర్వస్వమును బరిత్యాగము చేయుటకు నేను సర్వదా సంసిద్ధుఁడను. ఈ మణిమయాభరణ సంపత్తియు, ఈ రత్నసింహాసనమును, ఈ మహీమండలాధిపత్యమును, జీవనమునందలి సమస్త లౌకిక పారలౌకిక కామ్యార్థములును, ఆవశ్యకమగుచో జీవనాధికయగు నా యర్ధాంగలక్ష్మిని సహితముఁ దృణప్రాయముగ విసర్జించుటకు నేను సంసిద్ధుఁడను. మునీంద్రా! అధికము నేనేమి వచింపఁ గలను!

అష్టా:— వత్సా! అఖండ విజయీభవ! నీ జీవన మీ విశాల జగతికి అప్రతిమానమగు నాదర్శ రత్నదీపమై ప్రకాశించుఁగాక!

(ఆశీర్వదించి నిష్క్రమించును)

శ్రీరా:— (భద్రునిఁ జూచి) భద్రా! ఇప్పుడు చెప్పుము. ఏమి వార్తఁ దెచ్చితివి?

భద్రు:— మహాప్రభూ! దేవర శ్రీచరణముల మ్రోలఁ దొలుత నభయదానము నర్థించుచున్నాను.

శ్రీరా:— (చిఱునగవుతో) ఏమి! అంతటి భీషణవార్తయా యది? నిర్భయముగఁ జెప్పుము.

భద్రు:— మహాప్రభూ! .... (శంకించును.)

శ్రీరా:— భద్రా! శంకించెదవేల? ఈ రాజగృహమున నీవు చిరకాల కర్మచారి వయ్యు రాజహృదయము నింకను గుర్తింపకుంటివా? సత్యవార్త లెట్టి యప్రియము లైనను నీ ప్రభువునకు శ్రవణయోగ్యములే యని నీ వెఱుఁగవా? నిర్భయముగఁ జెప్పుము.

భద్రు:— మహారాజా!........అయోధ్యాపురవాసులు.............. కొందఱు ప్రముఖులు .... పరస్పర సంభాషణముల .... శ్రీ జానకీదేవిని గూర్చి........నిందావాక్యము లాడుచున్నారు.

శ్రీరా:— ఏ మనుచున్నారు?

భద్రు:— ప్రభూ! (గద్గదికతో) కళంకభాగిని....

శ్రీరా:— (చకితుండై) కళంకభాగిని! ....ఏమంటివి? భద్రా, ఏమనుచుంటివి?

భద్రు:— మహాప్రభూ! .... సత్యము పల్కుచుంటిని.

శ్రీరా:— పురవాసులు.... పురప్రముఖులు.... ఏమనుచుండిరి?

భద్రు:— రాక్షస గృహవాసినియైన శ్రీ జానకీదేవి పరిగ్రహణీయ కాదనియు, అంతఃపురయోగ్య కాదనియు వదరుచుండిరి, ప్రభూ!

శ్రీరా:— (కొంతవఱకు నిస్తబ్ధుండై నిట్టూర్పు విడచి) భద్రా! రాజపీఠ మధిరోహించి నేను నీ మూలమున నిగూఢమగు ప్రజాహృదయమును గుర్తించుచున్నాను. సంతోషము.

భద్రు:— (నమస్కరించి, నిష్క్రమించును.)

శ్రీరా:— (పరిక్రమించుచు స్వగతము) లంకా యుద్ధ సమాప్తమునం జరాచర భూతకోటి సాక్షిగ, కుసుమ వర్ష మధ్యమునం గఠోర పరీక్ష యొనర్చి యగ్నిదేవుండు స్వహస్తముల నాకుం బ్రత్యర్పణ మొనర్చిన పతివ్రతాశిరోమణి యపవిత్ర యనియే యింకను నా ప్రజల యభిప్రాయమా? ఆహా! ప్రపంచ నియతి!........ ప్రజానురంజనమునకై నా సర్వస్వమును బరిత్యజింప నేను ప్రతిజ్ఞాధారణ మొనర్చితిని .... ప్రజానురంజనము! .... ప్రజానురంజనము! .... ప్రజాను రంజనమున సత్యమునకు స్థానము లేదా!........ కేవలము ప్రజానురంజనమునకై సాక్షాత్కృతమగు సత్యమును నిరాకరింపవలయునా?

సీ. బహు యుగ ప్రఖ్యాత మహిత సూర్యాన్వయ
ప్రాభవోన్నతిం జూపు భాగ్యరేఖ!
కలుష భంజన వియద్ గాంగ నిర్ఝర తుల్య
నవ నవోజ్జ్వల జీవన స్రవంతి!

అఖిల భూతాత్మకంబైన విశ్వంబెల్ల
హృదయమం దిడుకొన్న ప్రేమజలధి!
సకల యాతా యాత సాధ్వీ సతీ సృష్టి
కాదర్శ రత్న దీపాంకురంబు!
గీ. త్రిభువనారాధ్య చరిత! పృథ్వీకుమారి
అహాహా! మత్ ప్రజాసంఘు జిహ్వాగ్రములను
భగ్నశీలయై పతితయై పాడు వడెనె!
సత్య మడుగంటెనే ధరా చక్రమందు!!

సీత:— (నిద్రలోఁ బలువరించుచు) పతివ్రతను! .... పతివ్రతను! రాక్షసాధమా! .... న న్నంటితివేని .... నీ మూర్ధము .... సహస్ర ఖండములు కాఁగలదు!....

శ్రీరా:— (సీత చెంతకుఁ బోయి, స్వగతము) నిద్రలోఁ బలువరించుచున్నది! మాయా సన్యాసియైన రావణ హతకుని యత్యాచార ఘట్టము కావలయు నీమె యంతర్నేత్రమునకుఁ బొడఁగట్టుచున్నది!.... ఆహా! ప్రజానాయకులారా! ఈమెయేనా మీ దృక్పథమునఁ గళంకభాగిని!

[ప్రవేశము - వశిష్ఠుఁడు]

వశి:— వత్సా! రామచంద్రా!

శ్రీరా:— వశిష్ఠమునీంద్రా! ప్రణామము (నమస్కరించును.)

వశి:— మహాయశః ప్రాప్తిరస్తు! ....ఇదేమి! నిరంతర చిదానంద మోహనమగు నీ ముఖబింబమున సంతాపరేఖ దృశ్యమగుచున్న దేమి? నేత్రములు బాష్పావరుద్ధములై యున్న వేమి? రామచంద్రా! ఏమి సంభవించినది?

శ్రీరా:— గురుదేవా!

గీ. మలిన మయ్యె సూర్యాన్వయ మహిత కీర్తి!
పతిత మయ్యెను రఘువంశ భాగ్యలక్ష్మి!
దగ్ధ మయ్యెను శ్రీరామ ధర్మ దీక్ష!
అంధకారావృతం బయోధ్యా పురంబు!

వశి:— వత్సా! ఏమి జరిగినది?

శ్రీరా:— జనకరాజ తనయ కళంకిని, అపరిగ్రహణీయ ....

వశి:— ఆఁ! యేమనుచుంటివి రామచంద్రా?

శ్రీరా:— .... అని అయోధ్యాపురవాసుల యభిప్రాయము.

వశి:— ఏమీ! జనకరాజ తనయ కళంకిని యని పురవాసుల యభిప్రాయమా? ఈ యసత్యవార్త నీ కర్ణముల నెట్లు జొచ్చినది? పతివ్రతా శిరోరత్నము! సర్వసద్గుణ స్వరూపిణి! అయోధ్యా సౌభాగ్యలక్ష్మి! పృథ్వీపుత్రి కళంకభాగినియా? ఈ తుచ్ఛప్రలాపమును నీవెట్లు విశ్వసించితివి?

శ్రీరా:— గురుదేవా! నా యాంతరంగిక భృత్యుఁడు భద్రుఁ డీ వార్తను దెచ్చినాఁడు.

వశి:— (యోచించి) ఎన్నఁడును మిథ్యావాది కాని విశ్వసనీయ భృత్యుఁడే, భద్రుఁడు!

శ్రీరా:— రాజ్యమునందలి ప్రజాప్రముఖులు కొందఱు పరస్పరము సంభాషించుకొనుచుండిరఁట! రాక్షసాపహృతయై, రాక్షస గృహవాసినియైన కాంతను దమ ప్రభువు పరిగ్రహించి యంతః పురమం దుంచుట దోషమని వారి యభిప్రాయము.

వశి:— ఇది యావత్ ప్రజాభిప్రాయమై యుండునా?

శ్రీరా:— గురుదేవా! శ్రీరామ రాజ్యమున నిందావాక్యము ఏక మాత్రమైనను యావత్ ప్రజాభిప్రాయతుల్యముగనే భావింపఁ బడు నని తా మెఱుఁగరా?

వశి:— నిశ్చయము.... నిశ్చయము.... కర్తవ్యము నిరూపింపఁ జాల కున్నాను.

శ్రీరా:— మునీంద్రా! కర్తవ్యమున కేమున్నది! ప్రజానురంజనమే నా కవశ్య కర్తవ్యము! ప్రజానురంజనమునకై యాత్మ బలిదానముఁ జేయుదును.

వశి:— ఎట్లు?

శ్రీరా:— ప్రజాసంతుష్టికై నా జీవన తేజమగు జానకిని విసర్జించెదను. అయోధ్యనుండి బహిష్కరించెదను.

వశి:— హరి హరీ! ఎట్టి కఠోరవాక్యము నా కర్ణములఁ బడినది!

శ్రీరా:— గత్యంతరము లేదు గురుచంద్రమా! ఆశీర్వదింపుఁడు, రాజధర్మ నిర్వహణమునందు నా హృదయము దుర్బలము కాకుండునట్లు నన్నాశీర్వదింపుఁడు.

వశి:— కుమారా! యశస్వివి కమ్ము. వంశవర్ధనుఁడవు కమ్ము! ఈశ్వర సంకల్ప మనివార్యము. ఈ భయంకర పరీక్షా సమయమున సర్వేశ్వరుఁడు నీకుఁ దోడ్పడుఁగాక! (నిష్క్రమించును.)

శ్రీరా:— (మెల్లగ సీతవైపు నడచుచు) ఈశ్వర నియతి యమోఘము! అప్రతిహతము! .... ఆహా! .... ఆనాటి వాలి సంహార దృశ్యము .... నా కన్నులకుఁ గట్టుచున్నది! .... ఆ మహా వీరాగ్రగణ్యుని వక్షః కవాటమును .... ఛేదించితిని! ఆ రక్తధారాప్రవాహము .... నేఁడు, నా కన్నుల యెదుటఁ బాఱుచున్నది!........ క్షతగాత్రుఁడై .... ఆ వీరశిఖామణి నేలఁగూలి .... గిజగిజ గింజుకొనుచు .... భూమ్యాకాశములు ద్రవీభూతము లగునట్లు .... పల్కిన యా దీనాలాపములు .... ఇప్పుడు నా కర్ణములఁ బ్రతిధ్వనించుచున్నవి! .... మహా పతివ్రత .... తార! .... భర్తృకళేబరముపై వ్రాలి .... ఎంత ఘోషించినది! .... ఆ మహాసతి .... అమోఘ శాపాక్షర ములు .... ఇప్పుడు .... నా కర్ణపుటముల మాఱు మ్రోగు చున్నవి! .... ఆహా! ఆహా! రావణ ధర్మపత్ని! పతివ్రతా శిరోమణి .... మండోదరి! .... ధూళిధూసరిత! భర్తృ కంఠోద్గత రక్తధారాస్నాత! ఎట్టి భయంకర శాపము!....

ఆ మహాఘోషణము .... ఇప్పుడు నాకు శ్రవణగోచర మగుచున్నది ! .... ఓహో ! లంకా సంగ్రామ రంగము ! ఏమి యా యమాయక రాక్షస వధూ హాహాకారములు ! శాపోపహతుఁడను ! శాపోపహతుఁడను ! మహాపతివ్రతాశాపఫల మనుభవించెదను ! .... హా ! సీతా ! సీతా !

(తెర వ్రాలును)

దృశ్యము 2

[రాజమందిరము — శ్రీరాముఁడు, లక్ష్మణుఁడు]

శ్రీరా :— లక్ష్మణా ! అతికఠోరమైన రామకార్య మొక్కటి నీ విప్పుడు నిర్వర్తింపవలసి యున్నది ! నా యాజ్ఞాపాలనముఁ గావించెదనని ప్రతిజ్ఞఁ జేయుము.

లక్ష్మ :— ప్రభూ ! ఇదేమి నేఁ డిట్లనుచుంటిరి ?

గీ. 'రామ' యను సుధా మధురాక్షరములు రెండు
తొలుత నేనాఁడు నా జిహ్వ పలుక నేర్చె,
నాటి మొదలు లక్ష్మణ శిరోన్యస్తమై, య
నాదృతంబైన రామ వాక్యంబు కలదె ?

చం. నరవర ! దుర్గమోగ్ర విపినంబుల వాయుజలోప జీవినై
మఱచి ప్రపంచమెల్ల, క్షణమాత్ర విరామ మెఱుంగకన్ భవత్
చరణ సరోజ నిత్య పరిచర్యల నుంటిఁ జతుర్దశాబ్దముల్,
అరసితె యెన్నఁడైన నెదురాడుట శ్రీరఘురామవాక్యమున్ !

శ్రీరా :— నిశ్చయమే. అయినను నీ ప్రతిజ్ఞా వచనమును నేను కోరుచున్నాను. లక్ష్మణా ! నా ప్రస్తుతాదేశ మెంతటి భీషణమో నీ వెఱుఁగవు.

లక్ష్మ :— అది యెట్టి భీషణాదేశమైనను శ్రీరామాజ్ఞకుఁ బ్రతివచనము నానోట నెన్నఁడైన వెల్వడునా ? కానిండు. మీ యభి

మతానుసారముగ నే నిదే ప్రతిజ్ఞఁ జేయుచున్నాను. సెలవిండు.

శ్రీరా :— సౌమిత్రీ ! ఇప్పుడు నీవు స్వహస్తముల నా హృదయమును ఛేదింపవలసి యున్నది.

లక్ష్మ :— (విస్మితుఁడై) ప్రభూ ! మీ యభిప్రాయ మేమి ?

శ్రీరా :— నా హృదయమునకు హృదయము, ప్రాణమునకుఁ బ్రాణము, నా యిహపరసర్వస్వము నైన సీతను దోడ్కొని పోయి దూరారణ్య మధ్యమున విసర్జించి రావలయును.

లక్ష్మ :— (చకితుఁడై) ఏమనుచుంటిరి ప్రభూ ? నిర్మేఘమైన యాకసమునుండి యీ యకాలవజ్రపాత మేమి ? ఈ యాజ్ఞ యా, నేను పాలింపవలెను ?

శ్రీరా :— లక్ష్మణా ! సూర్యవంశ ప్రతిష్ఠ అయోధ్యారాజమార్గములపై ధూళిలోఁ గలియ నున్నది ! అన్యోపాయము లేదు. జానకీదేవి అయోధ్యనుండి బహిష్కరింపఁబడక తీఱదు.

లక్ష్మ :— నే నేమియు గ్రహింపఁ జాలకున్నాను. ప్రత్యక్ష రాజ్యలక్ష్మియగు శ్రీ జానకీదేవి యేల అయోధ్యనుండి బహిష్కరింపఁబడవలెను ?

శ్రీరా :— రాక్షసాపహృతయై శత్రునిర్బంధ వాసినియైన సీత నిష్కలుషత్వమును అయోధ్యాపురవాసులు శంకించుచున్నారు. ఆమె యపవిత్ర, అపరిగ్రహణీయ - అని పల్కుచున్నారు. ప్రజానురంజనమునకు బద్ధకంకణుఁడనై యున్న నేను రాజధర్మ నిర్వహణార్థము ప్రజాసంతృప్తికై జానకిని బహిష్కరించుచున్నాను.

లక్ష్మ :— (ఉత్తేజితుఁడై) ఏమీ ! మూర్ఖ ప్రజాకోటి మిథ్యాప్రవాద కారణమున ఆ పరమసాధ్విని మీరు బహిష్కరింపఁ బూనితిరా ? విచ్ఛిన్న దర్పమై, అవనత మస్తకమైన యశేష రాజమండలము సమక్షమున శివధనుర్భంగ మొనర్చి, యే

మహాసతిని సహధర్మచారిణిగఁ బాణిగ్రహణ మొనర్చితిరో, యే మహాపతివ్రతాలలామ సాహచర్య సంపత్తిచేఁ బదునాల్గేండ్ల మహారణ్యావాసము స్వర్గవాసముకన్న మహత్తరమైనదో, యే జీవనరత్నమును గోల్పడి సమగ్ర దండకారణ్యమును సీతానామసంక్షుభిత మొనర్చి నయనాశ్రుధారావిఘూర్ణిత మొనర్చియుంటిరో, యే సాధ్వీ పరిత్రాణమునకై సేతుబంధన లంకాసంగ్రామ ప్రముఖ మహాకార్యము లొనర్చి యుంటిరో, అనంత భూతకోటి సాక్షిగ నగ్నిపరీక్షా సముత్తీర్ణయై యే మహాదేవి కుసుమ వర్షాభిషిక్తయై తమ శ్రీచరణస్పర్శ యొనర్చినదో, అట్టి జగత్పావని, జగజ్జనని, జనకరాజపుత్రి యపవిత్రయా? బహిష్కరణ యోగ్యయా? ప్రభూ! ఈ భయంకరాదేశమును బాలించుటకు నేను కేవల మశక్తుఁడను! .... అశక్తుఁడను .... మహాప్రభూ........ఈ యాజ్ఞను ఉపసంహరింపుఁడు.

శ్రీరా:— అట్లు జరుగనేరదు లక్ష్మణా! ఇది యత్యంత కఠోర నియతి యని నాకుఁ దెలియును. విధి విధానము అనుల్లంఘనీయము! ప్రయాణసన్నాహముఁ గావింపుము....

(నిష్క్రమించును)

లక్ష్మ:— (స్వగ) హా! జగదీశ్వరా!

గీ. అపుడు మేఘనాథుని దుర్జయాస్త్ర నిహతి
కాల మృత్యు కరాళ దంష్ట్రాళిఁ జిక్కి
ప్రాణములు గోల్పడక యింక బ్రతికియుంట
అహహ! యీ ఘోర పాప నిర్వహణమునకె!

[ప్రవేశము — ఊర్మిళ]

ఊర్మి:— ప్రాణేశ్వరా! ఇదేమి! పూర్ణచంద్ర సంకాశమగు తమ వదనమండలమున విషాదమేఘచ్ఛాయ కన్పట్టుచున్నది! కారణ మేమి, ప్రభూ?

లక్ష్మ:— ఊర్మిళా!

గీ. పిడుగు పడె నిర్మలాకాశ వీథినుండి
రాజ మందిర గోపురాగ్రంబుమీద!
తగిలి సచరాచరముగ నంతఃపురంబు
కూలనున్నది పాతాళ కుహరమునకు!

ఊర్మి:— ఏమి? ఏమి సంభవించినది?

లక్ష్మ:— సీతాబహిష్కరణము! అరణ్య మధ్యమున ఆమెను నేను విసర్జించి రావలయును. ఇది శ్రీరామాజ్ఞ!

ఊర్మి:— (చకితయై) ఏమీ! ఏమీ! సీతాబహిష్కరణమా! స్వయముగ రఘుపతియే యీయాజ్ఞ నొసంగిరా? కారణ మేమి?

లక్ష్మ:— సతీమణీ! శ్రీరామాజ్ఞాపాలనమునందు నాకుఁ గారణ జిజ్ఞాస కేవల మనావశ్యకము. ఊర్మిళా! హృదయ విదారణ మగు ఈ భీషణవార్తను జానకీదేవికి నీవు తొలుతనివేదింపుము.

ఊర్మి:— ప్రభూ! అతి దుర్బలహృదయ నగు నాకది సాధ్యమగునా?

లక్ష్మ:— సతీ! అంతకు వేయిరెట్లధికమగు నిష్ఠుర కార్యమును నేను చేయనున్నాను.

చం. కటుకు కసాయినై యిపుడు కాఱడవిన్ విడువంగనుంటి దు
ర్మరణము పాలొనర్చి రఘురాణ్మహిషిన్ పరిపూర్ణ గర్భిణిన్
తరుణి! మదస్థిపంజరము దగ్ధ మొనర్చుచు నున్న యీహృదం
తర విలయాగ్నిహోత్ర దహనక్రమణోద్ధతి నీ వెఱుంగుదే!

దేవీ! నా మనఃక్లేశమున నీ వించుక భాగహారిణివి కావా? ఈ క్షణమే పోయి యీవార్తను దేవికి నివేదింపుము. నేను ప్రయాణసన్నాహముఁ గావించెదను. (నిష్క్రమించును.)

ఊర్మి:— (స్వగ) హా! జనకరాజతనయా! అయోధ్యా రాజ్యలక్ష్మీ! ఏ ముఖముతో నేను నీకీ భయంకర వార్తను నివేదింపఁ గలను? జగదీశ్వరా! నా హృదయమును బాషాణముఁ జేసివేయుము.

[ప్రవేశము — సీత]

సీత:—. ఊర్మిళా! ఆర్యపుత్రు లెందున్నారు? నిద్రాగతనైయుండిన నన్నువిడిచి వారెచ్చటి కేగిరి? (ఊర్మిళ ముఖమువైపు జూచుచు విస్మితయై) ఇదేమి? ఏడ్చుచుంటివేల? సౌమిత్రి యేమైనఁ దిరస్కారముఁ జేసియుండెనా?

గీ. వనములందునఁ బదునాల్గు వత్సరములు
వన్యమృగ సంఘముల సహవాస మంది
మానుషత్వంబు మొదలంట మఱచెనొక్కొ
లక్ష్మణుం డుత్తమోత్తమ లక్షణుండు!

ఊర్మిళా! నీ సమక్షమందే యాతనికి బుద్ధిఁగఱపెద నుండుము.
(కన్నీరు తుడుచును)

ఊర్మి:— దేవీ! .... (దుఃఖము నాపుకొన యత్నించును.)

సీత:— ఊర్మిళా! ఇంత స్వాభిమానము భర్తలపట్ల మనకుఁ దగునా?

ఊర్మి:— దేవీ! నన్ను క్షమింపుము. నా యపరాధ మెట్టిదైనను నీవు నన్ను క్షమింతునని వాగ్దానముఁ జేయుము.
(కన్నీరు తుడుచుకొనును.)

సీత:— ఊర్మిళా! నీ కేమి సంభవించినది? ఊరకుండుము. నీ వపరాధముఁ జేయుటయు, నేను క్షమించుటయునా? ....

ఊర్మి:— దేవీ! నేను నిర్భాగ్యను! నన్ను క్షమింపుము.
(దుఃఖాతిశయమునఁ గన్నీరు కార్చుచుండును.)

సీత:— నీ చిత్తవృత్తి యేకారణముననో చలించుచున్నది! ఇంచుక విశ్రమింపుము.

ఊర్మి:— దేవీ! నన్ను క్షమింపుము. నా భర్త యాదేశమున నేను నీకొక భయంకర వార్త నివేదించెదను ....

సీత:— ఏమది?

ఊర్మి:— అయోధ్యాపతి .... నీకు .... వనవాస దండనము విధింప నున్నారు....అయోధ్యా రాజ్యమునుండి....బహిష్కరణము!
(మహాదుఃఖమునఁ గన్నీరు తుడుచుకొనును.)

సీత:— (నవ్వి) ఏమనుచుంటివి? నాకు వనవాస దండనమా! అయోధ్యాపతి విధించెదరా? అదే హేతువుగ నీ వేడ్చుచుంటివా? (నవ్వి) అయ్యో, అమాయక బాలికా! ఆ మాత్రము నీవు గ్రహింపఁజాలక పోయితివా? లక్ష్మణుఁడు నీతోఁ బరిహాసము లాడుట కిదియే ప్రారంభమా? (నవ్వును.)

ఊర్మి:— ఏమీ! అంతియేనా? ఊరకఁ బరిహాసమునకే నా పతి యట్లంటిరా? .... దేవీ! ఇది కేవలము పరిహాసమేనా? .... నిశ్చయముగ పరిహాసమే యగునా?

సీత:— ఊర్మిళా! సీతాబహిష్కారము! అరణ్యావాస దండనము! సీతాపతి యాజ్ఞ!! నీవే యోచించుకొనుము.

సీ. తెగి రాలి పడలేదు దివినుండి మార్తాండ
చంద్రగోళము లింక సరసిజాక్షి!
ఆక్రమింపఁగలే దనంత బ్రహ్మాండంబుఁ
బ్రళయ మేఘము లింక పద్మవదన!
సంచలింపఁగలేదు చక్రవాళమును జం
ఝూ మారుతము లింక సదమలాంగి!
కుఱియంగలేదు విక్షుభితాంతరిక్షంబు
వజ్రవర్షం బింకఁ బ్రవిమలాత్మ!
గీ. మాటువడలేదు విలయ సమ్మార్జనమున
ప్రస్ఫుటం బగు శ్రీరామ రామ రామ
మధురశబ్ద మింకను వాయు మండలమున!
చేల! భయ మేల, పరిహాస లీలలకును?

ఊర్మి:— దేవీ! ఇంకను నా దక్షిణనేత్ర మేల యదరుచున్నది? నా పతి పరిహాసమునకైనను నాతో నెప్పుడు నసత్యముఁ బల్కరే!

సీత:— మంచిది. నే నిప్పుడే రఘురాముల దర్శించి యీ సందేహ నివృత్తి గావించెద నుండుము.

(నిష్క్రమించును.)

ఊర్మి:— (స్వగ) ఆహా! ఎట్టి యచంచల విశ్వాసము! ఎట్టి యాత్మార్పణము! ఓ జగత్ప్రభూ! నా ప్రాణపతి వాక్యము కేవలము పరిహాసమాత్రమే యగుఁగాక!

(నిష్క్రమించును.)

దృశ్యము 3

[ఉద్యానము - శ్రీరాముఁడు వేదికపై విశ్రమించియుండును.
ప్రవేశము - కౌసల్య.]

కౌసల్య:— కుమారా! అంతఃపురము అశాంతిసంకులమై యున్నది. నేను వినియుండిన వృత్తాంతము సత్యమే యగునా? లక్ష్మణ కుమారు నడిగితిని. దుఃఖాశ్రువిరసమైన ముఖమును వాల్చుకొని యాతఁడు నిరుత్తరుఁడై నా సమక్షమునుండి వెడలి పోయెను. భరతుఁడు కోపారుణితలోచనుఁడై యేమేమో గొణుగుకొనుచుఁ బ్రత్యుత్తర మీయకయే రాజగృహమును విడిచిపోయెను.

శ్రీరా:— అమ్మా! నీవు వినిన దంతయు సత్యమే. రాజధర్మమును పాలించునిమిత్తము సీత నయోధ్యనుండి నేను బహిష్కరింప నున్నాను.

కౌస:— సత్యమే? .... నాయనా! పురుషోత్తముఁడైన శ్రీరాముని గాంచిన భాగ్యరాశిని నే నని నిరంతరము గర్వించుచుంటిని! నేటివఱకును ఆ యానందగర్వమే నా యీ శుష్క శరీరమున కాధారమై యుండినది. తండ్రీ! ఇంత కాలమునకు నాకు గర్వభంగమైనది. నిష్కళంకమైన రామనామము ఇప్పుడు కళంకీభూతమైనది. ఇంక నా జీవనమువలనఁ బ్రయోజనము లేదు.

శ్రీరా:— అమ్మా! .... అమ్మా! ....

కౌస:— కుమారా! సర్వశాస్త్రవేత్తవు! విజ్ఞాన చక్రవర్తివి! న్యాయ నిష్ఠాగరిష్ఠుఁడవు! ఇదియా నీ న్యాయనిష్ఠ? ఇదియా నీ విజ్ఞాన పరిణామము! మహాపతివ్రత! నారీలోకైక మకుట మణి! అట్టి ధర్మపత్నిని బహిష్కరించుటయే నీ ధర్మరక్షణ మైన, ఇంకఁ బ్రపంచమున ధర్మమెక్కడ? క్షేమ మెక్కడ?

శ్రీరా:— అమ్మా! అమ్మా! నాపై నాగ్రహించుచుంటివా? నా సర్వస్వము నశించినను నీ ప్రేమబల మొక్కటి మాత్రము మిగిలియుండిన, నే నీ యావత్ ప్రపంచ దుఃఖభారమును అవలీల భరించఁగలను. నా యంతరంగమును బరిశీలింపక కేవలము నా బాహ్యప్రవృత్తినే గమనించెదవా? స్వహస్త ములతో నా చితిని నేను నిర్మించుకొని చిచ్చు రగిల్చి ఆ యగ్నిజ్వాలలందు నా సర్వశోకిక తాపోపశమనమునకై నే నాత్మోత్సర్గముఁ గావించుకొన నిశ్చయించి యున్నాను. తల్లీ! సీతాబహిష్కరణము! ధర్మపత్నీ విసర్జనము! శ్రీరాముని హస్తముల జరుగవలయును! ఇది ఈశ్వరసంకల్పము! యావద్ వృత్తాంతము నెరింగితివేని నీవు సహితము నా నిశ్చయమును బ్రతిఘటింపవు.

కౌస:— ఏమి సంభవించినది? అంతయును నాకుఁ జెప్పుము. అన్యోపాయ మేమైన నూహింపఁ గలనేమో చూచెదను.

శ్రీరా:— అమ్మా! అన్యోపాయము లేదు. ప్రతిజ్ఞాబద్ధుఁడను! సూర్యవంశోద్భవుఁడను! ప్రతిజ్ఞాపాలనము తప్ప నా కన్య మార్గము లేదు. నా సర్వాంగములు నిప్పుడు ప్రతిజ్ఞా శృంఖలా బద్ధములు! ఇంక నాకు గత్యంతరము లేదు.

కౌస:— ఆ ప్రతిజ్ఞ యేమి?

శ్రీరా:— ప్రజానురంజనమునకై యాత్మోత్సర్గము! ప్రజాసంఘము సీతా బహిష్కరణము నపేక్షించుచున్నది! అమ్మా! సూర్య

వంశ వధూమణివి! దశరథేశ్వరుని యర్ధాంగలక్ష్మివి! నీకుఁ దెలియునుకదా మన వంశ ప్రతిష్ఠ ?

కౌస:— ప్రజాసంఘ మేల సీతాబహిష్కరణ మపేక్షించుచున్నది? లోకోత్తరచరిత్ర! మహాపతివ్రత! మఱియు పూర్ణగర్భధారిణి! అట్టి జగదేకపూజ్యకు బహిష్కరణమా? దాని కిదియా సమయము ?

శ్రీరా:— అమ్మా! విధిప్రేరితమై యాకాశమునుండి వజ్రపాతము సంభవింపనుండ, సమయాసమయ విచక్షణమున కవకాశము కలదా ?

కౌస:— నిశ్చయముగ నిది వజ్రపాతమే నాయనా! సర్వత్ర అమంగళ చిహ్నములే పొడఁగట్టుచున్నవి! —అదే! కల్యాణి జానకి యిటు వచ్చుచున్నది. ఆ యమాయికబాలిక నిష్కలుష వదనాబ్జము నేను చూడఁజాలను. (నిష్క్రమించును.)

[ప్రవేశము - సీత]

సీత:— (మందహాసముతో) ఆర్యపుత్రా! తాము నన్నయోధ్య నుండి బహిష్కరింపఁ బోవుచుంటిరా? అరణ్యములందు విసర్జింప నుంటిరా? ఊర్మిళతో సౌమిత్రి చెప్పెనఁట! (నవ్వుచు) అమాయకురాలు! లక్ష్మణుని పరిహాసములను నమ్మికొనినది! కన్నీరు గార్చుచు నామె నా చెంతకువచ్చి యెంత విలపించినది! (శ్రీరాముని ముఖమువైపు నిదానించి) అదేమి ప్రాణేశ్వరా! వదనమండలము నిస్తేజమై యున్నదేమి? నేత్రము లశ్రుపూర్ణములై యున్నవేమి? ప్రభూ! ఏమి సంభవించినది ?

శ్రీరా:— (ముఖము వాల్చుకొని నిరుత్తరుఁడై కన్నీరు గార్చుచుండును.)

సీత:— తెలిసినది! .... తెలిసినది! .... ఊర్మిళ యశ్రుపాతము నిర్హేతుకము కాదు.... ప్రాణేశ్వరా! ఏమి జరిగినది ? నా యెడ గోపనముఁ జేయఁదగు విషయము తమ కేమి కలదు ?

శ్రీరా :— (మహా దుఃఖముతో) సీతా ! .... సతీమణి ! ....

సీత :— వచింపుఁడు, ప్రాణపతీ ! వచింపుఁడు "సీతా! నీముఖమును నేను చూడనొల్లను ; నీ వయోధ్యను విడచి తిరిగి యరణ్యములకుఁ బొమ్ము" అని నోరారఁ బల్కుఁడు. ఆ యాజ్ఞావాక్యమును శిరమునఁ దాల్చి మహానందముగఁ బోయెదను.

శ్రీరా :— దేవీ! క్షమాయోగ్యము కాని మహాపరాధమును జేయ నున్నాను. అయినను క్షమాభిక్ష నర్థించుచున్నాను. నీలకంఠ కంఠస్థమగు హాలాహలము నతిక్రమించు మహావిష మును నేను పాన మొనర్చితిని. ఆ భయంకర హాలాహల జ్వాలాజాలముచే నా సర్వాంగములును దగ్ధము లగుచున్నవి.

సీత :— (భయముతో) ప్రభూ ! ఏమి సంభవించినది ?

శ్రీరా :— భయంకరమైన పరీక్షా సమయ మాసన్నమైనది ?

సీత :— ప్రభూ ! ఆ పరీక్షా విధాన మెట్టిది ?

శ్రీరా :— "ప్రజానురంజనమునకై నా ఐహిక సర్వస్వమును బరిత్యజించెద"నని ప్రతిజ్ఞాధారణ మొనర్చితిని.

సీత :— ప్రాణేశ్వరా ! అంతియేనా ? దాని కింత చింతిల్లనేల ? సూర్యాన్వయ సంభూతుల కిది యొక నూతన ప్రతిజ్ఞయా ?

తే. గీ. క్షత్రియ ప్రాణులకుఁ బౌరుష క్రమంబు,
వజ్ర శకలంబులకుఁ గళావైభవంబు,
రవికులోద్భూతులకుఁ బ్రజా రంజనంబు,
సహజగుణసంపదలు కదా సార్వభౌమ !

శ్రీరా :— దేవీ ! ఆ ప్రజానురంజనమున కిప్పుడు నా బహిఃప్రాణము, నా జీవనజ్యోతి, జానకి, బలిదానము కావలసి యున్నది !

సీత :— అట్టి పవిత్ర బలిదానమునకు నేను సర్వసిద్ధముగ నుండు దాననే కదా ! కాని, ప్రజానురంజనమునకు నే నెట్లు అంత రాయముఁ గల్గించితిని ?

శ్రీరా :— దేవీ! రాక్షసహస్తంగతవై శత్రు నిర్బంధవాసినివై యుండిన హేతువుచే జానకీదేవి కళంకిత, బహిష్కరణీయ - అని ప్రజ లుద్దేశించుచున్నారు!

సీత :— (కొంచెము యోచించి) ప్రభూ! లంకా యుద్ధ సమాప్తిని నా పవిత్రతా నిరూపణార్థము జరిగియుండిన అగ్నిపరీక్షా విధానమును బ్రజలు స్వీకరించుట లేదా?

శ్రీరా :— వారి ప్రవాదవైఖరి యట్లే తోచుచున్నది.

సీత :— పోనిండు. ప్రభూ! తాము స్వీకరించితిరా? తమ యంత రంగము నా విషయమున నిశ్శంకమై యున్నదా?

శ్రీరా :— సతీమణీ! ఇదిగో నా యనాచ్ఛాదిత వక్షము. దీనిని ఛేదించి చూడుము. శ్రీరామహృదయము నీకు గోచరింపం గలదు. సర్వాంతర్యామి, అనంత భూత బహిరంతర్వేది, పరా త్పరుఁడు, నా నిష్కళంక హృదయమునకు ఏకైక సాక్షి.

సీత :— ప్రాణపతీ! ఇంక నాకు విచారము లేదు. నిరాఘాటమగు కాలచక్ర భ్రమణము నరికట్టుట యెవ్వరికి సాధ్యము? విధి విధానము జరిగి తీరవలయును. ప్రభూ! ఆజ్ఞాపింపుఁడు. మహా నందముగ నేను తమ యాజ్ఞాపాలనముఁ గావింతును. ఇంత కును, ప్రాణేశ్వరా! నేను తమ యర్ధాంగిని కానా?

చ. పరిణత సర్వకర్మ ఫలభాగ్య విభాగ ధురీణ నేను! త్వత్
చరణ పరాగ ధారిణిని! సాధ్విని, నేసహధర్మచారిణిన్!
భరమగు రాజధర్మ పరిపాలన భారమునన్ సగంబు నా
శిరమున లేదె! దీనికయి చింతిలనేల నరేంద్రచంద్రమా?

ప్రభూ! ఆజ్ఞాపింపుఁడు.

శ్రీరా :— (మహాదుఃఖముతో) సీతా! .... సీతా! .... జగదేక సాధ్వీ! నేను మహాపాతకుఁడను! .... అభాగ్యుఁడను! ....

(కన్నీరు గార్చును.)

సీత:— ప్రాణప్రియా! దుఃఖించెదరేల? పితృవాక్య పరిపాలనార్థము నాఁడు తా మరణ్యమునకుఁ బోయియుంటిరి. భర్తృధర్మ పరిపాలనార్థము నేఁడు నే నరణ్యమునకుఁ బోయెదను. ఇందు విశేష మేమున్నది?

(శ్రీరాముని కన్నీరు తుడుచును)

[ప్రవేశము — లక్ష్మణుఁడు]

సీత:— సౌమిత్రీ! ఈ క్షణమే రథమును సిద్ధముఁ జేయుము. నేను స్వేచ్ఛాపూర్వకముగ నరణ్యగామిని నగుచున్నాను. నీవే స్వయముగ నన్నరణ్యమున డించి రావలయును.

(లక్ష్మణుఁడు తల వంచుకొని కన్నీటితో నిష్క్రమించును)

సీత:— ప్రభూ! తమ పాదధూళిచే నా మూర్ధమును బవిత్రముఁ జేయుఁడు. (శ్రీరాముని పాదములపై శిరముంచి మ్రొక్కి) ప్రాణపతీ! ఇంక నా యవశిష్ట జీవనము.... శ్రీరామ నామోచ్చారణము! శ్రీరామ పదధ్యానము! ఈ పూర్ణ గర్భము సూర్యాన్వయ శాశ్వత ప్రతిష్ఠకు అంకురార్పణ మొనర్పఁ గాక! ప్రభూ! ఆశీర్వదింపుఁడు - ఆశీర్వదింపుఁడు.

(నమస్కరించును)

శ్రీరా:— (మహాదుఃఖమున) ఓ జగద్బాంధవా! నా హృదయమునకు నీవు సాక్షి! నిరపరాధిని యైన యర్ధాంగలక్ష్మిని విధి ప్రేరితముగ నరణ్యముల విసర్జించుచున్నాను. నా మహాపరాధమునకు.... యోగ్యదండనము .... జగత్ప్రభూ! జగద్రక్షకా! .... నీవే యోచింపుము. నేటితో నాజీవన తేజమస్తమించును! .... రామనామము....విద్రోహమయము.... పాపసంకులము .... అమంగళము! .... సీతా! సీతా!

(సీతను గౌఁగిలించుకొనును)

సీత:— మహాప్రభూ! దుఃఖింపకుఁడు! సర్వమంగళ విధాత, సర్వహృదయ సాక్షి, జగదీశ్వరుఁడే మనకుఁ దోడు! ఈశ్వరేచ్ఛ

నిరంతరాయముగ నెఱవేఱుఁగాక! ఇంక నాకు సెలవొసంగుఁడు రాజమాతృగణమును దర్శించి పోయెదను.

(శ్రీరాముని పాదములకు సాష్టాంగప్రణామముఁజేసి నిష్క్రమించును)

శ్రీరా:— (మహాదుఃఖమున)! సీతా! సీతా! .... (మూర్ఛిల్లును)

దృశ్యము 4

[తమసానదీతీరము-వాల్మీకి ఆశ్రమము-వాల్మీకి తపోదీక్షయం దుండును. శిష్యగణము నిశ్శబ్దముగ నాశ్రమ కార్యముల నిర్వర్తించుచుందురు.]

వాల్మీ:— (శ్రీరామకీర్తనముఁ జేయును. అనంతరము ధ్యాన సమాధియం దించుక యుండి, పిమ్మట పూర్వాభిముఖుఁడై తదేక దృష్టిని జూచుచు)

ఆహా! విధి విధానము! .... అదే!....అయోధ్యా రాజ్యలక్ష్మి!....శ్రీరామ ధర్మపత్ని!....అయోని సంభవ! పృథ్వీపుత్రి - జానకి!....పూర్ణ గర్భధారిణి! భర్తృ పరిత్యక్తయై తమసానదీ పరిసరారణ్యమున ఏకాకినియై సంచరించుచున్నది! ఆహా! ఏమి యీ మహాసతి మనస్థైర్యము! ఏమి యీ జగదేక పూజ్య ఆత్మవిశ్వాసము! భగవన్! అనంత జన్మాగతమైన నా కర్మానుభవము నేటితో నంతముకానున్నది. నా తపోదీక్ష నేఁడు ఫలింప నున్నది. పోయి యీ మహాదేవి నిచ్చటకుఁ దోడ్కొని వచ్చెదఁగాక. (లేచి) బాలకులారా, నేను వచ్చుసరికి ఆశ్రమప్రదేశ మంతయు నలంకరించి యుంచుఁడు. నేఁడు మన యాశ్రమమునకు మహాలక్ష్మి విజయము చేయును. ఆమె శుభాగమనమునకు సర్వమును సిద్ధముఁ జేయుఁడు.

సీ. పుష్పసుగంధ సమ్మోహనం బయి యాత్ర
మోహాంత వనమెల్ల నొప్పవలయు!
అవిరామముగఁ దోరణాలంకరణ కోటి
కుసుమవర్షంబులఁ గురిసియ వలయు!
శుక శారికా పిక ప్రకరముల్ మంగళా
హ్వాన గీతంబులన్ బాడవలయు!
వన మయూరములు నేర్చిన సర్వ సంపూర్ణ
నాట్య కౌశలముఁ గన్పఱుపవలయు!
ఆ. వె. ప్రతి లతాగృహంబు ప్రతి శిలాశకలంబు
రామ! రామ! రామ! రామ! యనుచు
ప్రస్ఫుటారవములఁ బ్రత్యేక నిమిషంబుఁ
బలుకవలయు నిచట బాలులార!

ఏదీ, నేను మీకు నేర్పిన సంధ్యాగీతమును బాడుఁడు.

బాలురు:— (ఐక కంఠ్యముగ శ్రీరామ కీర్తనముఁ జేయుదురు.)

వాల్మీకి:— మహానందమైనది. ఇంక నేను పోయివచ్చెదను.
(శ్రీరామకీర్తనముఁ జేయుచు నిష్క్రమించును.)

దృశ్యము 5

[తమసానదీ ప్రాంతారణ్యము - ఏకాకినియై సీత ప్రవేశించును.]

సీత:— (స్వగ) అంధకారమయమై, అగమ్యగోచరమై యున్న నా భావిజీవన మట్లు ఈ మహారణ్య మెంత భయంకరమై యున్నది! ఏకాకినినై యున్న నా దెసకొక్క వనమృగంబైనను రాకున్న దేమి? అయోధ్యా రాజ్యమునందుఁబలె నీ యరణ్య రాజ్యమునందు సహితము నే నస్పృశ్యనే నైతినా? అపరిగ్రహ యోగ్యనే నైతినా! బహిష్కరణమే యిచ్చట సహితము నా విధి విధానమా? హా! పరమేశ్వరా!

నేనేమి యపరాధముఁ జేసితిని? .... అదే, తేజోరాశి, జగజ్జీవనుఁడు, లోకబాంధవుఁ డస్తంగతుఁ డగుచున్నాఁడు! ఇంక నతి స్వల్పకాలమునందే యీ సంధ్యారాగము అంధకార గర్భమునందు లీనము కానున్నది! ఈ యంధకార జగతి యందు నే నింక నెచ్చటికిఁ బోయెదను? .... గమనాయాస మధిక మగుచున్నది! ఇంక నొక్క యడుగైనను నడువఁ జాలను. ఈ పాషాణవేదికపై నించుక విశ్రమించెద. (శిలపైఁ గూర్చుండి) ఓ గర్భస్థ రఘువంశమణీ! పాపాత్మురాలను, నిన్ను నే నెంత యలయించుచుంటిని! అయ్యో! ఏ భాగ్యశాలిని గర్భమునం దైనఁ బడక, ఈ యభాగిని గర్భవాసమునం దేలఁ జొచ్చితివి?

సీ. ఏ ముండ్ల తుప్పయో యే తిప్పయో కదా
    రఘువంశమణి! నీకుఁ బ్రథమశయ్య!
ఏ వ్యాఘ్రు కాంతయో యే భుజంగియొ కదా
    నరపాలసుత! నీకుఁ బురుడుపోత!
ఏ పాడుపంకమో యే కల్మషమొ కదా
    బాలార్క! నీకుఁ బ్రక్షాళనంబు!
ఏ లతాప్రతతియో యే గడ్డియో కదా
    చంద్రాస్య! నీకు నాచ్ఛాదనంబు!

గీ. సర్వ సర్వంసహా చక్ర చక్రవర్తి
రఘుకులేశ్వరు వంశవర్ధనుఁడ వీవు,
దిక్కుమాలిన పక్షివై చిక్కువడితె
అకట! ఈ భాగ్యహీన గర్భాంతరమున!

కాలనియతి యనుల్లంఘనీయము! కానిమ్ము. అన్నిటికిని సర్వాపన్నివారణమగు శ్రీరామచరణమే నాకు శరణ్యము! సత్యవ్రత రక్షణార్థమై శ్రీరామాజ్ఞా నిబద్ధనై నరకమునకు సహితముఁ బోవనున్న నాకీ యరణ్యవాస మొక లెక్కయా? .... కాని .... కాని .... ఆనాటి వనవాసమునకును, ఈ నాటి వనవాసమునకును ఎంత తారతమ్యము కలదు!

చం. పతిచరణాబ్జసేవ నిరవద్య సుఖంబున స్వర్గరాజ్య సం
స్థితిఁ బదునాలుగేండ్లు గడచెన్ బదునాలుగు వాసరంబులై;
ప్రతిహత సర్వభాగ్య నయి భర్తృ బహిష్కృతనై పరాభవ
క్షత నయి, యిప్పుడీ నరకగర్భ నివాసముఁ జేయ వచ్చితిన్.

(తెరలో వాల్మీకి రామకీర్తనము)

సీత:— (ఆలించి) ఏమది! ఈ ఘోరారణ్యమధ్యమునందు రామ నామామృత వర్షమును గుఱియుచున్న యా యదృశ్యమేఘ మెయ్యది?

[ప్రవేశము - కీర్తనముఁ జేయుచు వాల్మీకి]

సీత:— (లేచి, వాల్మీకిచెంత కేగి) ఓ మహాపురుషా! ఈ యభాగిని ప్రణామ మందుకొనుఁడు.

వాల్మీ:— సౌభాగ్యవతీ! కులదీపకులగు కుమారులఁ గాంచుము.
(ఆశీర్వదించును.)

సీత:— మహాత్మా! ఈ యరణ్యమును శ్రీరామనామ విఘూర్ణిత మొనర్చుచున్న తమ వృత్తాంతముఁ దెల్పి నన్ను ధన్యను జేయుఁడు.

వాల్మీ:— కుమారీ! నేను ఈ తమసానదీ ప్రాంతమునం దాశ్రమ వాసినై తపోదీక్షనున్న వాల్మీకి యనువాఁడను! శ్రీ రామాయణ కావ్య కర్తను! ఓ రామపత్నీ! జనకరాజపుత్రీ! నీ వృత్తాంత మంతయు దివ్యదృష్టిని గుర్తించి యున్నాను. అమ్మా! రమ్ము. నా యాశ్రమమునకు రమ్ము. నీ పవిత్ర పాదధూళిచే నా తపోవనమును బావనముఁ జేయుము. నా జీవనము ధన్యముఁ జేయుము.

సీత:— ధన్యాస్మి! ధన్యాస్మి! మహాపురుషా! ఈ యభాగిని కృతజ్ఞతాభివందన మందుకొనుఁడు. (నమస్కరించును).

వాల్మీ:— దేవీ! రమ్ము. నా యాశ్రమ మిచ్చటికిఁ జాల సమీపము నందే యున్నది. నా తపఃప్రభావముచే, ఇదిగో, నీ సర్వాంగము నుజ్జీవిత మొనర్చుచున్నాను. తల్లీ! నా వెనువెంటరమ్ము.

(శ్రీరామకీర్తన మొనర్చుచు సీతను దోడ్కొని నిష్క్రమించును).

పృథ్వీపుత్రి

ద్వితీయాంకము

దృశ్యము 1

[ఉద్యానము - శ్రీరాముఁ డొక పాషాణవేదికపైఁ గూర్చుండి యుండును.]

శ్రీరా:— ఆహా! అంతఃపురము నిస్తేజమై పర్వతగుహాప్రాయమై యున్నది! ఆ రామవనము నిర్జీవమై శ్మశానప్రాయమై యున్నది! ఇంక నా కెచ్చట శాంతి లభించును? .... ఈ శుష్క కళేబరమునకు శాంతి యెచ్చటిది? అభిశాపహతుఁడ నగు నాకు ఇది యెంతయుఁ దగియే యున్నది! క్షుద్ర మహీ రాజ్య ధర్మమునకై నిరుపమానమగు హృదయ సామ్రాజ్య ధర్మమును దగ్ధమొనర్చిన యాత్మవంచకుఁడను! దుర్బలుఁడను నేను! నా యపరాధమునకుఁ దగిన శిక్ష నే ననుభవింపకఁ దీఱునా? ఆ శిక్షావిధానము ప్రారంభమైనది! దీని కింక నంతము లేదు.

[ప్రవేశము - ప్రధాని]

ప్రధాని:— మహారాజా!

శ్రీరా:— ఏమి కావలెను?

ప్రధాని:— ప్రభూ! దక్షిణ దేశమునుండి ఘోరవార్తలు వచ్చు చున్నవి! దుర్భిక్షపీడితులై ప్రజలు విశేషముగ మరణించు చున్నారఁట!

శ్రీరా :— పాపము శాంతించుఁగాక! అమాత్యశేఖరా! ఈ క్షణమే సమర్థులగు నుద్యోగులఁ బంపి దక్షిణదేశమునం

దంతటను అన్నసత్రములను స్థాపింపఁ జేయుఁడు. మన భాండారమునందలి ఖాద్య పదార్థ సంగ్రహ మంతయు నచ్చటకుఁ బంపుఁడు. ఈ ప్రయత్నమున ధనకోశ మంతయు శూన్యమైనను నాకు విచారము లేదు.

ప్రధాని :— మహాప్రసాదము. (నిష్క్రమించును.)

శ్రీరా :— (మందహాసముఁ జేయుచు) శ్రీరామరాజ్యమునందు .... దుర్భిక్ష ! అంతయును యథాయోగ్యముగనే యున్నది ! ఇం దాశ్చర్య మేమి కలదు ?

తే. గీ. సర్వ సంపూర్ణ సౌభాగ్య సౌఖ్యలక్ష్మి
ఈ మహారాజ్యమున నాటనే తొలంగె,
పరిభవక్లాంతయైన యా పరమసాధ్వి
కాననంబుల కేనాఁడు కదలి చనెనొ !

[ప్రవేశము - ప్రతీహారి]

ప్రతీ :— (అభివాదముఁ జేసి) మహాప్రభూ ! ఎవ్వఁడో బ్రాహ్మణుఁ డొక్కఁడు వచ్చి ప్రభుదర్శన మపేక్షించుచున్నాఁడు.

శ్రీరా :— తత్క్షణమే యాతని నిచ్చటకుఁ బంపుము.

ప్రతీ :— మహాప్రసాదము. (నిష్క్రమించును.)

[ప్రవేశము - బ్రాహ్మణుఁడు]

శ్రీరా :— విప్రోత్తమా ! శ్రీరాముని యభివాద మందుకొనుఁడు. (నమస్కరించును)

బ్రా :— మహారాజా ! సప్తవర్ష ప్రాయుఁడగు నాపుత్రుఁడు మరణించినాఁడు. నీ రాజ్యమునం దీ యకాలమరణము సంభవించినది ! సూర్యాన్వయుల రాజత్వమున ముం దెన్నఁడు నిట్టి యకాలమరణములు లేకుండెను. రామచంద్రా ! నీ రాజ్యమునందు సంభవించినది ! దీని కుత్తరవాదివి నీవు కావా ?
(కోపము నభినయించును)

శ్రీరా :— భూసురోత్తమా! శాంతింపుము ....

బ్రా :— రాజ్యమునందకాలమృత్యుభయము నివారింప శక్తిలేకున్న సింహాసన మేల నధిరోహించితివి? ఇదియా నీ ప్రజానురంజనము? ఇదియా నీ ధర్మపరిపాలనము? కేవలము పత్నీత్యాగమాత్రమునఁ బ్రజానురంజనము సంపూర్ణమగు ననుకొంటివా? రాజా! నీవు మహాపాతకివి! కావుననే యీ రాజ్యమునందీ యకాలమరణములు! .... హా! పరమాత్మా! దీనబంధూ! ఈ నికృష్ట పాపరాజ్యమునందు నన్నేల నివసింపఁజేసితివి తండ్రీ! — (ఏడ్చును.)

శ్రీరా :— బ్రాహ్మణోత్తమా! నే నపరాధినైన నీవు నన్ను క్షమింపుము. తొలుత నా యాతిథ్యమును స్వీకరింపుము. పిమ్మట సంప్రాప్తమైన యీ యకాలమరణమును గూర్చి చర్చింతము.

బ్రా :— వలదు-వలదు. నీయట్టి పాపిష్ఠప్రభుని యాతిథ్యము నాకు వలదు. నీ పాపమే నిన్ను దహించుఁ గాక.

(నిష్క్రమించును.)

శ్రీరా :— విప్రోత్తమా! సత్యము పల్కితివి. నిశ్చయముగ నేనొక పాపిష్ఠ ప్రభువునే. నిరపరాధిని యగు ధర్మపత్నిని బహిష్కరించితిని. అరణ్యములందు విసర్జించితిని. ఉన్మత్తునివలె నాత్మీయ సర్వసౌఖ్య సంపత్తిని మట్టిలోఁ గలిపివైచితిని! ప్రజానురంజనమను ఆకాశకుసుమమునకై యాత్మోత్సర్గముఁ జేయుచుంటిని!

[ప్రవేశము - వశిష్ఠుఁడు]

వశి :— రఘురామా!

శ్రీరా:— గురుదేవా! నా పాపవశమున రాజ్యమునందమంగళము వాటిల్లినది! ఒకానొక బ్రాహ్మణ బాలకుఁడు అకాల మరణము నొందెను. దీనికిఁ బ్రాయశ్చిత్త మనుగ్రహింపుఁడు. రాజ్యమునందు అమంగళము శాంతించు నిమిత్తము నేను ప్రాణత్యాగమునకేని సిద్ధముగ నున్నాను.

వశి:— వత్సా! వృథామనస్తాపముచే నీవేలఁ దపించుచున్నావు? నీవు చేసిన పాప మేమి? నీవు కేవలము నీ కర్తవ్యమును నిర్వహించితివి. సత్యవ్రతుఁడవును, ధర్మమూర్తివియు నైన నీ కెన్నఁడైన బాపస్పర్శ యుండునా? గోదావరీతీరవాసులైన కొందఱు తపోధనులవలన నేను యథార్థమును గ్రహించితిని. రాజ్యమునందలి ఈ యకాలమరణ దుర్భిక్షాద్యమంగళములకుఁ గారణము నాకుఁ దెలిసినది. శంబుకుఁ డను నొక శూద్రుఁడు స్వధర్మత్యాగ మొనర్చి విప్రధర్మ మగు యజ్ఞదీక్షను గ్రహించినాఁడు. వర్ణాశ్రమ ధర్మద్రోహియై, సమాజ శృంఖలముల ఛేదించి ఆ శూద్రయోగి యిప్పుడు దండకారణ్యమున యజ్ఞము జేయుచున్నాఁడు. అదియే దాక్షిణాత్యమునం దా యనావృష్టికిని దుర్భిక్షమునకును, ఈ యకాల మరణములకును గారణమై యున్నది!

శ్రీరా:— గురుదేవా! అట్లైనఁ బ్రస్తుతము నా కర్తవ్య మేమి?

వశి:— కర్తవ్యమున కేమున్నది? ధర్మద్రోహియగు నా శంబుకుని రాక్షసప్రాయునిగఁ దలంచి యాతని సంహరించుటయే దేశమునకు సర్వారిష్ట నివారక మగును.

శ్రీరా:— గురుదేవా! శంబుకుఁ డెట్లు ద్రోహి యయ్యెనో నే నూహింపఁజాలకున్నాను. స్వేచ్ఛాపూర్వకముగ జపయజ్ఞములఁ జేసికొనుచున్నంత మాత్రమున నాతని దోష మేమి?

తే. గీ. విశ్వనాథుని సామ్రాజ్య పీఠమునకు
బ్రాహ్మణోత్తమ! భేదభావంబు కలదె?
ఇట్టి వర్ణాశ్రమాచార శృంఖలములు
కలవె తన్మహారాజ్య చక్రంబునందు?

మహాత్మా! ఆ శంబుకుని యజ్ఞదీక్షయే సర్వారిష్టములకును హేతు వనుట నా కంత యుక్తియుక్తముగఁ దోచుటలేదు. నా పాపకర్మమే యా సమస్తమునకును మూలకారణము. ఆ పాపమునకు యోగ్యదండనము నే ననుభవించెదను.

వశి:— వత్సా! విశ్వనాథుని సామ్రాజ్యపీఠమునకును నీ సామ్రాజ్య పీఠమునకును సామ్యములేదు. సర్వశాస్త్రవేత్తవు! ఈ విషయము నీకుఁ దెలియకపోదు. వర్ణాశ్రమధర్మము లనియెడు బలీయ స్తంభములమీఁదనే మన సామ్రాజ్యపీఠము నిశ్చలమై నిలచి యున్నది. ధర్మద్రోహ మేనాడు ప్రారంభమగునో ఆ నాఁడే సంఘవిప్లవమును, సామ్రాజ్యపతనమును ప్రారంభ మగును. శంబుకుఁడు ధర్మద్రోహి యని నీవు గుర్తించితివేని, అవశ్య మాతని దండించుటయే రాజధర్మము!

శ్రీరా:— (యోచించి) రాజధర్మమా! .... తుచ్ఛరాజత్వము! .... రాజత్వమున ధర్మము! .... మంచిది, గురూత్తమా! రాజ ధర్మమునకు నేనాత్మవిక్రయ మొనర్చుకొని బహుకాలమైనది. శంబుకుఁడు నిశ్చయముగ రాజద్రుష్టియం దపరాధమే యొనర్చుచుండిన నేను రాజధర్మమునే పాలించెదను. నేఁడే దండకాటవి కేగి శంబుకునిఁ జూచెదను.

వశి:— ఉత్తమము. రఘురామా! రాజ్యము సర్వారిష్ట విదూరమై సర్వసౌఖ్య నిలయమై వెలయుఁగాక! (నిష్క్రమించును)

శ్రీరా:— ఆహా!

తే. గీ. కడచె సీతాపరిత్యాగ కాండమపుడు,
కడచు నింక శంబుక వధాకాండమిపుడు!
అహహ! ఈ మహారాజత్వమందు నిట్టి
పుణ్యకాండంబు లిక నెన్ని ముగియవలెనో!

(నిష్క్రమించును)

దృ శ్య ము 3

[దండకారణ్యము - శంబుకుని యజ్ఞవాటిక-శంబుకుఁడు యజ్ఞవేదిక పై నాసీనుఁడై యుండును. చెంత భార్య తుంగభద్ర నిలచియుండును. నేపథ్యమున వేదఘోషము.]

శంబు:— (చేతులు జోడించి) హే చరాచర భూత బహిరంతర్విహారీ! హే వేదవేద్యా! హే జ్యోతి స్వరూపా! హే పరమపురుషా! హే అనంత సృష్టిస్థితిలయ విధాయకా! హే జగద్రక్షకా! పాహిమాం! పాహిమాం! (ధ్యానంగతుఁడగును.)

[ప్రవేశము - శ్రీరామ లక్ష్మణులు]

శంబు:— (కన్నులు విప్పి శ్రీరాముని జూచి మహానందముతో లేచి) సముజ్జ్వలిత సర్వదిగంతమూర్తివై, నీలమేఘశ్యాముఁడవై యున్న నీ వెవ్వరవు మహాపురుషా, ఈ యరణ్యాదేశమునఁ బ్రత్యక్షమైతివి! నా యజ్ఞఫల స్వరూపుఁడవై యున్న నీ వెవ్వరవు ప్రభూ! ఈ మనోజ్ఞ స్వరూపమే నా నితాంత ధ్యానమూర్తి! ఈ స్వరూపమే .... ఈ స్వరూపమే, ఈ మనోహర తేజోమూర్తియే నా తపోదృష్టికి సర్వదా ప్రత్యక్షమగుచున్నది! ఆహా! నేను ధన్యుఁడను! ధన్యుఁడను!

సీ. పవనాంబు భక్షులై భయదాటవుల ఘోర
 తప మొనర్చెడు తపోధనులకైన,
సంసార దూరులై సర్వసంగ త్యాగు
 లై సంచరించు సంయములకైన,
జపహోమ యజ్ఞదీక్షా గరిష్ఠాత్ములౌ
 బ్రహ్మప్రధాను వర్తనులకైన,
ఆహారనిద్రా విహారసంతత హరి
 ధ్యానులౌ భక్త సత్తములకైన

గీ. అందగారాని సచ్చిదానందమూర్తి!
సర్వ భూతాంతరస్థ తేజస్స్వరూపి!
సకల బ్రహ్మాండ సామ్రాజ్య చక్రవర్తి!
అహహ! యెంతలో నాకుఁ బ్రత్యక్షమయ్యె!

తుంగభద్రా! మనము తరించితిమి! రమ్ము .... రమ్ము.
(శ్రీరాముని పాదములచెంత సాష్టాంగ మొనర్తురు.)

శ్రీరా:— శంబుకా! నన్ను గుర్తించితివా?

శంబు:— దేవా! గుర్తించితిని. నీవు నా ధ్యానమూర్తివి! నా తపస్సమాధియందు ఈ దూర్వాంకుర శ్యామలమూర్తియే సదా నాకుఁ గన్పట్టుచుండును! నా యంతర్దృష్టికి ఈ తేజోరాశియే సర్వదా గోచరించుచుండును. దేవాదిదేవా! ధన్యోస్మి! ధన్యోస్మి!

శ్రీరా:— ఓయీ, నే నెవ్వరి ధ్యానమూర్తినిఁగాను. తపస్సమాధియందు ఎవ్వరి హృదయములను నేను వసించువాఁడను కాను. నేను కేవల మొక మనుష్యమాత్రుఁడను!

శంబు:— కాదు. కాదు. ఈ నీల నీరద మనోజ్ఞమూర్తినే నేను నిత్యమును నా తపస్సమాధినిఁ జూచుచున్నాను! .... ఇంచుక తాళుము. (కన్నులు మూసికొని ధ్యానమునందుండి, తిరిగి కన్నులు విప్పి) ఈ స్వరూపమే! ఈ మనోహర శాంతమూర్తియే! నా యెదుట నిప్పుడు ప్రత్యక్షమైయున్న యీ దివ్య మంగళ విగ్రహమే యది! అణుమాత్రమును భేదము లేదు. ఈ యాకర్ణాంత విశాల నేత్రములే యవి! ఈ యాజాను బాహువులే యవి! ఈ నీలరత్నచ్ఛటా మోహన మూర్తియే యది! మహాపురుషా! నన్నేలఁ బరీక్షించెదవు? నా ధ్యాన మూర్తివే నీవు. సందియము లేదు.

శ్రీరా:— శంబుకా! నేను నీ ధ్యానమూర్తినిగాను. అయోధ్యా రాజ్యమున కధీశ్వరుఁడను నేను. ఎన్నఁడైన రామ నామము విని యుంటివా?

శంబు:— రామనామము! వినియుంటిని, ప్రభూ! వినియుంటిని. అనేక ముఖములఁ వినియుంటిని! తొల్లి యౌవనమునందు నేను దివారాత్రములు శ్రీరామనామమునే జపించుచుంటిని! పితృవాక్య పరిపాలనార్థమై రాజ్యభోగ పరిత్యాగ మొనర్చి, సతీ సమేతముగ నే దినమున నీవు మహారణ్యా గామివైతివో, యా దినమే శ్రీరామనామము నా జపమాలపైఁ బ్రతిధ్వనించుట కారంభము! కాని, రఘుపతీ! ఏ దినమున లోకాపవాదమునకు భీతిల్లి మహాపతివ్రత, లోకైకపావని, నిరపరాధిని, పూర్ణగర్భధారిణి యగు జానకీదేవిని విభ్రాంతమతివై యరణ్య గర్భమున విసర్జించితివని వినియుంటినో, ఆనాటినుండియు రామనామము నందలి మాధుర్యము నా కనుభూతమగుట లేదు. రామనామము ధూమకేతువువలె నా హృదయమున కుత్పాత సూచకమై తోచినది! దివ్యమూర్తియని నేను భావించిన శ్రీరాముఁడు కేవల మొక క్షుద్రమనుష్యమాత్రుఁడని నేను గుర్తించితిని. ఆ దివ్యత్వము అణుమాత్రమైనను నీయందు నా కిప్పుడు గోచరించుట లేదు - అయినను .... అయినను .... నా ధ్యానదృష్టికిఁ బ్రత్యక్షమగుచుండిన యా మనోహర మూర్తివే నీవు! సందేహము లేదు. ఇందలి రహస్యమును నేను గ్రహింపఁజాలకున్నాను!

శ్రీరా:— గ్రహింపవలసిన యావశ్యకతయు లేదు. శంబుకా! ప్రస్తుతము నేను నీ యెదుట న్యాయాధిపతినై నిలచి యున్నాను. నీ యపరాధమునకు నేను నీకు మరణదండనము విధింప వచ్చియున్నాను.

శంబు:— మరణ దండనమా? రాజేంద్రా! నా యపరాధమేమి?

శ్రీరా:— వర్ణాశ్రమ ధర్మద్రోహివై, నీవు సమాజ నియమముల నతిక్రమించితివి. నీ యజ్ఞకర్మ హేతువుచే రాజ్యమునం దనావృష్టియు, దుర్భిక్షమును, అకాల మరణములును సంప్రాప్తము లగుచున్నవి.

శంబు:— (నవ్వి) రాజ్యమునందలి యుపద్రవములకు నా యజ్ఞ కర్మమా హేతువు! ఇంత యుక్తిహీనమగు వాక్యము నీ ముఖమునుండి యెట్లు వెల్వడినది ప్రభూ! ఇదియా నీ న్యాయనిష్ఠ ?

తే. గీ. కులసతీ విసర్జన మహాకలుషమునను
నీదు మస్తిష్క మిపుడు భ్రాంతిగతమయ్యె!
పాప పుణ్య విచార సందీపనమ్ము
సాధ్యమగు టెట్లు నీకింక సార్వభౌమ ?

శ్రీరా:— శంబుకా! కాలయాపనమువలనఁ బ్రయోజనము లేదు. నీ యపరాధమునకు శిక్ష ననుభవించుటకు నీవు బాధ్యుఁడవు.

శంబు:— రఘుపతీ! ప్రాణత్యాగమునకు నేను వెనుఁదీయుట లేదు. కాని, నీ ధర్మవిచారమునకు నాకు నవ్వువచ్చుచున్నది! రామచంద్రా! నీ యధఃపతనమునకు నేను దుఃఖించుచున్నాను. నీ పూర్వప్రతిభ చిహ్నమాత్రమైనను మిగులక సంపూర్ణముగ నశించిపోయినదా ? మహారాజా! తెలిసినది! ....

తే. గీ. ఏ రమాదేవి తేజః ప్రసారణమున
నీవు తేజస్వివై యుంటి విన్నినాళ్లు,
ఆ మహాతేజ మిపు డరణ్యముల కేగె!
కాక యున్న నీ కీ యధోగతి య దేల ?

మ. అకలంకంబగు వంశమా నవసె, నుద్యత్ జీవనాశాలతా
ప్రకరంబెల్ల పదాహతంబయి చనెన్ బాతాళ గర్భంబునన్!
ఇఁక రాజోత్తమ! పాడు రాచఱికమం దేమున్నదం చీవు మా
నక మో మెత్తితి, వా జగజ్జనని వెంటన్ గానకున్ బోవకన్ ?

శ్రీరా:— శంబుకా! నీతోఁ దర్కవితర్కములు చేయుటకు నేను రాలేదు. నేను యుక్తిజ్ఞాన తేజోవిహీనుఁడనైన నగుదును గాక! శాస్త్రనియమానుసారము నీ యపరాధమునకు శిక్ష ప్రాణహరణము! ఆ శిక్షావిధానముఁ బాలించుటకు నేను

వచ్చితిని. ఎట్టి మరణమును నీ వపేక్షింతువో చెప్పుము; సైన్యసమేతముగ నీవు న న్నెదుర్కొనఁ గోరెదవా?

శంబు:— రాజేంద్రా! నీతో యుద్ధమా? రావణ విజేత యగు జగదేకవీరునితో యుద్ధమా? ఇంతకును యుద్ధమున సంహరించుట యొక శిక్ష యగునా? నాకుఁ బ్రాణదండనము విధించితివి. ఇదిగో, ఆత్మార్పణ మొనర్ప సిద్ధముగ నున్నాను. నా మూర్ధమును ఖండింపుము. (శిరము వంచును)

తుంగభద్ర:— (ముందునకు వచ్చి) సూర్యాన్వయ సంభవుండును, పుణ్యవ్రతుండును అగు శ్రీరాముఁ డను ధరణీపతివి నీవేనా? మహాపురుషా! నీయెడ నే యపరాధము నెఱుఁగని నా భర్తను సంహరింపఁ బూనితివా?

శ్రీరా:— కల్యాణీ! నీ భర్త సంఘవిప్లవకర్తయై, దేశారిష్టములకు హేతుభూతుఁ డయ్యెను. ఆ యపరాధ మెట్టిదో నీకుఁ దెలియదు.

తుంగ:— మహారాజా! నా భర్త నిశ్చయముగ నపరాధియే యైనను, కులకాంతను - అశ్రుధారాసిక్తనై యర్థించుచున్నాను. క్షమాభిక్ష నొసంగవా? నిరపరాధినినైన నన్ను అనాథను జేసివేయుదువా?

శ్రీరా:— కాంతామణీ! నీ భర్త యపరాధము రాజదృష్టియందు క్షమాయోగ్యము కాదు. శాస్త్రనియతి యనుల్లంఘనీయము.

తుంగ:— మహాపురుషా! రాజదృష్టి మానుషదృష్టి కతీతమైనదా?

శ్రీరా:— ఆ జిజ్ఞాసకు ప్రస్తుతము నా హృదయమునందు స్థానము లేదు. కేవల రాజత్వమునకై నేను మానుషత్వమును విక్రయించుకొని చాలకాల మైనది!

శంబు:— తుంగభద్రా! నే నొనర్చినది యపరాధము కాదు. నీ వీతని క్షమాభిక్ష మడుగనేల? కేవలము స్వజాతి సంస్కరణమే నా యాదర్శము కాని, పరధర్మ గ్రహణము కాదు. మానవ సంఘమునందుఁ బరికల్పితమైయున్న స్వార్థనియతిని నేను

ప్రతిఘటించితినే కాని, సర్వోత్తమమగు ఈశ్వరనియతిని నేను ప్రతిఘటింపలేదు. రఘురామా! నీ శిక్షావిధానమును నీవు పాలింపుము. సిద్ధముగ నున్నాను.

శ్రీరా:— లక్ష్మణా! నా ధనుర్బాణముల నిటు తెమ్ము.

(లక్ష్మణుఁడు అందిచ్చును.)

తుంగ:— (ఆవేగమున ఇరువురి మధ్యను నిలచి) నిష్ఠురాత్మా! ముందు నా ప్రాణముల హరింపుము. అస్త్రమును ప్రయోగింపుము. ముందు స్త్రీవధా ప్రశస్తిఁ బడసి, పిదప నిరపరాధి ప్రాణముల హరింపుము. నిర్దోషియగు మహాసాధ్వి యకల్మష హృదయముపై వజ్రాఘాత మొనర్చితివి! లంకారాజ్యమును శ్మశాన మొనర్చి యా రుద్రభూమిని శతలక్ష రాక్షసవధూ హాహాకారములచేఁ బ్రతిధ్వనింపఁ జేసితివి! ఈ విధానము నీకుఁ గ్రొత్తకాదు. కానిమ్ము, అస్త్రమును విడువుము; నీ కీర్తి చరిత్రమును మూఁడులోకములును గీర్తింపఁగలవు!

శ్రీరా:— (బింకముగ) సాధ్వీమణీ! ప్రభుకార్యమున కంతరాయముఁ గల్గింపకుము. తొలఁగుము.

శంబు:— తుంగభద్రా! దూరముండుము. నిర్విచారముగ నుండుము. మన జీవనలీల కిదియే సమాప్త మనుకొంటివా? అది యనంతము - అప్రతిహతము!

తుంగ:— (ప్రక్కకుఁ దొలఁగి తీవ్రముగ) వధింపుము, వధింపుము - రాజేంద్రా భర్తప్రాణముల హరించి నిరపరాధిని యగు ధర్మపత్నిని అనాధను జేయుచుంటివా, పాషాణ హృదయా?

(ఏడ్చును.)

శ్రీరా:— సతీమణీ! నీవు సత్యముఁబల్కితివి. నాహృదయ మిప్పుడు పాషాణమే యైయున్నది. నా తనూమనఃప్రాణ సర్వస్వము నిప్పుడు పాషాణమయమే యైనది. లౌకిక వ్యధా సముచ్చయములు ఎంతటి కఠోరములైనను నన్నిప్పుడు బాధింపఁజాలవు.

కేవల రాజధర్మమునకై పూర్ణగర్భిణియైన యర్ధాంగలక్ష్మిని విసర్జించితివి. కేవల రాజధర్మమునకై యిప్పుడు నీ భర్తప్రాణముల హరించెదను.

శంబు :— ఇది రాజధర్మము కాదు, రాజేంద్రా. ఇది రాజధర్మపు నిర్జీవ కంకాళము. దానిని నీవు పూజించుచుంటివి. రాజధర్మమును, సత్యప్రతిష్ఠయు, చాలకాలమై నిన్నుఁ బరిత్యజించినవి.

సీ. అఖిల భోగత్యాగినై తొల్లి యేనాఁడు
కాషాయ వస్త్రంబుఁ గట్టినావొ !
అధముఁడౌ గుహుని ప్రేమాంజలి నేనాఁడు
శ్రీపాదయుగళ మర్పించినావొ !
శబరి యుచ్ఛిష్ట ప్రసాదంబు నేనాఁడు
సిద్ధామృతముగ భక్షించినావొ !
పగఁబాసి రావణభ్రాత కేనాఁడు లం
కా రాజ్య పట్టంబుఁ గట్టినావొ !

గీ. అఖిల లోకాభిరామమైనట్టి నాటి
ఆమహాతేజ మానాఁడె యస్తమించె
దండకారణ్య రాజ్యపదంబు విడిచి
తిరిగి యేనాఁ డయోధ్యకున్ మఱలినావొ !

ఇంకను ధర్మ మెక్కడ? ధర్మ మనుపేర నధర్మభూతమున కాత్మార్పణ మొనర్చుకొంటివి. ఆ పవిత్రధర్మదేవతా పునస్సంధానము మరల నీకీ జన్మమున లభింపఁజాలదు. అయినను, నీవు నా యారాధ్యమూర్తివి. నా ధ్యానాధిష్ఠాన మూర్తివి. ఆ శ్యామసుందరమూర్తివే నీవు. నీ యస్త్రాఘాతమున నేను మరణించి శాశ్వత ముక్తిఁ గాంచెదను. దేవాది దేవా! అస్త్రమును సంధింపుము.

శ్రీరా :— (అస్త్రసంధానముఁ జేసి) శంబుకా! నీయపరాధమునకు ఈ దివ్యాస్త్రము నిన్ను భస్మీభూత మొనర్చి వాయుమండలమున లీనముఁ జేయుఁగాక! (బాణము విడచును)

(బాణముతోఁగూడ శంబుకుఁడు అదృశ్యుఁ డగును.)

తుంగ :— హా! హా! ప్రభూ! ప్రభూ! (మూర్ఛిల్లును.)

తుంగ :— (ఇంచుక సేపైన పిదప లేచి) రఘువంశ కళంకా! నిష్ఠురాత్మా! పతివ్రతా శాపోపహతుఁడవు నీవు! ముహూర్త మాత్రమైన నీకీ జన్మమున శాంతి యుండదు! అహోరాత్రము లాహార నిద్రా విహీనుండవై, సహస్రబంధు మధ్యమున నేకాకివై, మనస్తాప వహ్నిజ్వాలా మధ్యంగతుఁడవై నీవు మరణము నపేక్షింతువు! నరరూప రాక్షసా! నీ ముఖముఁ జూచిన నరకము సంభవించును. నా సమక్షమునుండి తొలఁగి పొమ్ము.

శ్రీరా :— దేవీ! అవనతమస్తకుఁడనై చేతులుమోడ్చి నీ యభిశాపమును ఆశీర్వాదప్రాయముగ గ్రహించుచున్నాను. లక్ష్మణా! రమ్ము.

(ఇరువురు నిష్క్రమింతురు.)

పృథ్వీపుత్రి

తృతీయాంకము

దృశ్యము 1

[వాల్మీకాశ్రమము - వాల్మీకి సమక్షమున లవకుశులు ఆశ్రమ బాలురతోఁ గలసి రామభజనముఁ జేయుచుందురు.]

శ్రీ రామ భజనము

(భజనానంతరము బాలకులు నిష్క్రమింతురు.

లవకుశులు వాల్మీకి చెంత కేగుదురు.)

లవు:— తాతా! నిన్నొక ప్రశ్న మడిగెదను. నాకు సందేహ నివృత్తిఁ జేయుము.

వాల్మీ:— ఏమి సందేహము నాయనా?

లవు:— నీవు రచించిన రామాయణమునందు శ్రీరాముని పట్టమహిషి సీత యని వ్రాసితివి. ఆమె శ్రీరామునిచేఁ బరిత్యజింపఁబడి యరణ్యగామినియై దుఃఖభాజని యైన దని రచించితివి. మఱి, మాయమ్మనుగూడ సీత యనియే పిలచుచుంటివి. తాతా! ఆ రామయణ సీతయును, మా యమ్మ సీతయును ఏక వ్యక్తియే యగునా లేక భిన్న భిన్న వ్యక్తులా?

వాల్మీ:— (స్వగ) ఈ బాలకుని ప్రశ్నకు నే నేమని ప్రత్యుత్తర మీయఁగలను?

లవు:— ఏమట్లూరకుంటివి? తాతా! నా ప్రశ్న మేమంత కఠినముగ నున్నదా?

వాల్మీ:— లవకుమారా! సీత నా మానసపుత్రి. నా కల్పనా క్షేత్రమునందామె యావిర్భవించినది. ఆ మధురాక్షరము

లపై నాకుఁగల యభిమానముచే నేను మీ తల్లినిగూడ సీత యనియే పిలుచుచున్నాను.

కుశు:— అట్లైన మాతల్లి సీత కాదా?

వాల్మీ:— కాకేమి? మీతల్లికూడ సీతయే.

లవు:— కాదు తాతా! రామాయణమునందు నీవు వర్ణించిన సీత మా తల్లి కాదా?

వాల్మీ:— నాయనా! ఆమె జగజ్జనని!

ఆ. వె. పరమపుణ్యధామ! బ్రహ్మరుద్రారాధ్య
చరిత! సర్వలోకజనని యామె!
జగతియెల్ల నామె సంసారమైయుండ
జననికాదె మీకు మనుమలార!

లవు:— ఆహా! తాతా! అట్టి భువనైకపూజ్య యగు మహాసతిని లోకోత్తర చరిత్రుఁడైన నీ రాముఁ డెట్లు పరిత్యజించెను. తాతా! రామాయణమునందా సీతావిసర్జనఘట్టమును బఠించు నపుడెల్ల నా కన్నుల నేకధారగ బాష్పములు రాలుచుండును. అది యెంత హృదయ విదారకము! (తదేక దృష్టితో నూర్ధ్వాభిముఖుఁడై) ఆహా! అదే! అదే! ఆ మహాసతి! శ్రీరామాజ్ఞను శిరమున ధరించి యవనతవదనయై, అశ్రుధారా వర్షముఁ గురియుచు, అంతఃపురద్వారమును వెల్వడుచున్నది! అదిగో! ప్రాసాదప్రాంగణముల నిలచియున్న రాజమాతృగణమునకు ఆ యభాగిని నమస్కరించుచున్నది! మహారాజ మహిషి! అయోనిసంభవ! జగదేక పవిత్ర! పూర్ణగర్భధారిణి! అంతఃపుర బహిష్కృతయై, సర్వభోగ త్యాగినియై, సన్న్యాసినియై, శరీరమాత్ర శేషయై, దిక్కుమాలిన పక్షియై సింహద్వారమును సమీపించుచున్నది! అదే! లక్ష్మణచోదితమైన రథము! అశ్రుధారాసిక్తయై యా మహాదేవి రథారోహణ మొనర్చుచున్నది! శోకాకులమైన పుర నారీలోక మంతయు నామెకు చరమ నమస్కారము చేయు

చున్నది! రాజమార్గమునంబడి, రథము మెల్ల మెల్లఁగా బోవుచున్నది! అయోధ్యానగర మంతయు హాహాకార విఘూర్ణితమై చలించుచున్నది! అదే! అదే! అనంత చక్ర వాళమునందు రథము అదృశ్య మగుచున్నది! ఏ పాపము నెఱుంగని పరమసాధ్వి! నిష్కారణ బహిష్కృత! భవిష్య దంధకారమునందు లీన మగుచున్నది!.... ఇంక నేను చూడఁ జాలను.... చూడఁజాలను! అమ్మా! అమ్మా! పోయితివా? పోయితివా? (ఏడ్చును.)

వాల్మీ:— నాయనా! ఊరడిల్లుము. మెలకువఁ గల్గియే స్వప్నముఁ గాంచుచుంటివా?

లవు:— స్వప్నము! అగును. స్వప్నభంగమైనది. కాని, తాతా! నా యంతర్నేత్రములకు గోచరించిన యా మహాసతి సీతకును, ఆశ్రమవాసినియైయున్న మాయమ్మ సీతకును ఎట్టి సాదృశ్యము!

చం. అదె, నయనాబ్జయుగ్మ, మదె! యా ముఖచంద్రకళావిలాసమున్,
అదె, గమనంపువాట, మదె! యా మృదులస్వరమాధురీ క్రమం
బదె, సకలాంగశోభ! యదె యంతయు, భేద మొకింత లేదు; నా
హృదయ గుహాంతరాళమున నీమెయె యామె యటంచు
భ్రమోగెడిన్!

వాల్మీ:— నాయనా! ఊహాప్రపంచమున మానసిక ప్రవృత్తి యత్యంత బలీయము. లోకపూజ్యయగు నా శ్రీరామపత్ని యందు నీ కావిర్భవించిన మహాభిమానమే నీ యూహాదృష్టి యందు ఆమెకు నీ మాతృస్వరూపమును బ్రసాదించినది! ఇందు విచిత్ర మేమియును లేదు.

[ప్రవేశము - ఒక బాలకుఁడు]

బాల:— లవకుమారా! కుశకుమారా! రండు. రండు. మన యాశ్రమ వనమం దొక మహా సుందరమైన యశ్వము ప్రవేశించినది. చూచెదరు రండు.

లవ:—
కుశ:— } అశ్వమా ? అశ్వమా ?

లవు:— తాతా! పోయి ఆ యశ్వమెట్టిదో చూచి వచ్చెదము. దానిని కట్టివేయుటకే యత్నించెదను.

వాల్మీ:— ఏమీ! ఆ యశ్వమును నీవు పట్టఁగలవా ?

లవు:— ఆ యశ్వమునే నేను పట్టలేనా ? తాతా! క్షణములోఁ బట్టితెచ్చెదను చూడుము. సోదరా, తాతకు సందేహనివృత్తిఁ జేయుదము రమ్ము.

(బాలకునితో నిష్క్రమింతురు.)

వాల్మీ:— (స్వగ) ఈ క్షాత్ర సింహ కిశోరమున కా యశ్వ మెంత ? కానిమ్ము. భగవత్ సంకల్ప మనివార్యము! ఈ యల్పకార్యము వలన మహాభాగ్యమగు పితృ పరిచయ మీ రఘువంశాంకుర ములకు లభింప నున్నది!

సీ. క్రతుముక్తమైన యా రాజాశ్వమును బట్టి
బంధించి తీఱు నీ బాలకుండు,
హయ రాజ రక్షా విహారి శత్రుఘ్నుండు
పనికిమాలిన మంటి బంటు కాఁడు,
అశ్వార్థమై విశ్వ విశ్వాద్భుత రణంబు
తమసా తరంగ వాద్యముల మ్రోగు,
ఆ చిత్రయుద్ధ పర్యవసానముగ పితా
పుత్ర సమ్మేళనంబు ఘటిల్లు!
గీ. ఆ యపూర్వ సంఘటనా విధేయ మగుచు
తనరు నామీఁది రామకథా క్రమంబు
కల్పనాతీత దైవసంకల్ప చక్ర
ధాటి కోర్వంగవశమె విధాతకైన!!

[ప్రవేశము - సీత]

సీత:— తండ్రీ !

వాల్మీ:— అమ్మా ! రమ్ము.

సీత:— గ్రంథము సమాప్తమైనదా ?

వాల్మీ:— అమ్మా ! భారతీదేవి యనుగ్రహమున రామాయణ గ్రంథము సమాప్త మైనదనియే చెప్పవచ్చును.

సీత:— తండ్రీ ! జానకి జీవనలీల నెట్లు సమాప్తిఁ జేసితివి ? ఆ భావిలీలా చిత్రపటము నీ దివ్యహస్తముల నెట్లు చిత్రింపఁ బడినదో చూడ మనసగుచున్నది ?

వాల్మీ:— తల్లీ ! భావిజీవన విషయికమగు ప్రశ్న నీయట్టి లోకోత్తర వ్యక్తికిఁ దగునా ? నీ మనోభావమును గుర్తించితిని. విరహ సమ్మేళనములు క్షుద్ర మానవకోటికి విచారణీయములు కాని, లోకాతీతులగు సీతారాముల పట్లఁ గేవలము హాస్యాస్పద ములు ! ఈ వాల్మీకి యొక్క సీతారాములకు విశ్లేషములేదు. వారి యాంతరంగిక సమ్మేళనము అవిఛేద్యము ! అందు స్థల కాల దోష స్పర్శకు స్థానములేదు. ప్రాపంచిక ఘటనా చక్రమున కది యతీతము తల్లీ !

సీత:— మహాత్మా ! నా యజ్ఞానమును క్షమింపుము.

(నిష్క్రమించును.)

వాల్మీ:— (స్వగ) నిశ్చయముగ నీమె ప్రశ్న మతిసహజమైయున్నది. కాని, అత్యంత జటిలము. ఈ విరహతత్వమును నేను నిర్ణ యింపఁ జాలకున్నాను. సీతారామ విరహము ప్రాపంచికముగ సత్యము కాదా ? ఆ విరహవ్యథానిర్ఝరిణి నా రామాయణ గ్రంథమునందు శ్లోక శ్లోకము నందును ప్రత్యేకాక్షరము నందును బ్రతిధ్వనించుటలేదా ? అప్రయత్నముగ నెన్నిఘట్ట ములయందు బాష్పధారావరుద్ధమై నాదృష్టి చలించినది ! ఎన్నిసార్లు ప్రకంపితమైన నా హస్తమునందలి లేఖిని జారి

పడినది! విరహావ్యథ నిశ్చయముగ దుర్భరము! .... ఆహా! ఆనాటి క్రౌంచనిషాద సంఘటనము నా కిప్పుడు స్మరణకు వచ్చుచున్నది!

తే. గీ. జంట పక్షినిఁ గోల్పడి మింటికెగసి
ఎంత ఘోషించె నా క్రౌంచకాంత యకట!
అదియెకద తొల్లి బీజాంకురార్పణమ్ము
ప్రాజ్య వాల్మీకి కావ్య ప్రపంచమునకు!

కాని, సీతారాములకు విరహమేమి? సీతారామ శబ్దము ఓంకారమువలె నభేద్యము! .... సీతా!

[సీత తిరిగి ప్రవేశించును]

సీత:— తండ్రీ! పిలచితివా?

వాల్మీ:— ఔనమ్మా! నేను నేఁడు అయోధ్యకుఁ బోవుచున్నాను.

సీత:— అయోధ్యకా?

వాల్మీ:— అగును. శ్రీరామునిఁ జూచెదను. ఆతనికిని, నా కావ్య కథానాయకుఁడగు శ్రీరామునకునుఁగల తారతమ్యమును బరిశీలించెదను. కల్యాణీ! వాల్మీకి కావ్య కథాక్రమము యథార్థమో, లేక మిథ్యా కల్పితమో నేను తెలిసికొనెదను.

సీత :— (ఇంచుక సేపూరకుండి) తండ్రీ! ఒక్క విషయము నిన్నుఁ బ్రశ్నింపఁ దలఁచితిని. క్షమించుము.

వాల్మీ :— ఏమది?

సీత :— అయోధ్యా సింహాసనమున కెవ్వరుత్తరాధికారి యగును?

వాల్మీ :— ఆ విషయము శ్రీరామునే యడిగెద నమ్మా!

సీత :— (ముఖమువంచి నిలచి యుండును.)

వాల్మీ :— సీతా! శ్రీరామచంద్రుఁ డిప్పు డశ్వమేధయాగమును జేయనున్నాఁడు. ఆ యాగమునకు నే నాహ్వానింపఁబడి

యున్నాను. ఆ కారణమున నే నిప్పు డయోధ్యకుఁ బోవుచున్నాను.

సీత :— అగును. అయోధ్యనుండి వచ్చిన పత్రవాహకుని నేను చూచితిని .... అయోధ్యా నూతన పట్టమహిషికి జయమగుఁగాక!

వాల్మీ :— అయోధ్యా నూతన పట్టమహిషి! నీ యభిప్రాయమేమి?

సీత :— తండ్రీ! శాస్త్రవిధి ననుసరించి ఆ యజ్ఞవాటిక యందు రఘురాముల వామపార్శ్వమున నాసీన యగుట కే సతీమణి శ్రీరామునిచేఁ బునః పరిణీత యగునో యా సతీమణియే నూతన పట్టమహిషి యని నా యభిప్రాయము.

వాల్మీ :— అమ్మా! శ్రీరామునకుఁ బునఃపరిణీత పత్నియా? వాల్మీకి కల్పనా నేత్రమున కట్టిది కేవల మగోచరమైయున్నది.

తే. గీ. బాల! వాల్మీకి కల్పనాగోళమందుఁ
గానఁగారాని విషయ సంఘటన మొండు
పావనంబగు శ్రీరామ జీవనమున
జరుగనేరదు తల్లి! నిస్సంశయంబు!

నిర్విచారముగ నుండుము తల్లీ.

(సీత నిష్క్రమించును.)

వాల్మీ :— (స్వగ) సీతాపతి యయోధ్యయందు లేఁడు. శ్రీరామపత్ని యరణ్యమునందు లేదు. సీత శ్రీరామునియందు లీనమై యున్నది. శ్రీరాముఁడు సీతాహృదయమునందు వసించి యున్నాఁడు. సీతారాములు ఏకైక తేజస్స్వరూపమై యీ వాల్మీకి హృదయ సింహాసనముపై నుపవిష్టులై యున్నారు! ఓ మాయామానుష విగ్రహా! నీ దర్శనభాగ్యమున నేను ధన్యుఁడ నయ్యెద.

(శ్రీరామకీర్తనముఁ జేయుచు నిష్క్రమించును.)

యున్నాను. ఆ కారణమున నే నిప్పు డయోధ్యకుఁ బోవు చున్నాను.

సీత :— అగును. అయోధ్యనుండి వచ్చిన పత్రవాహకుని నేను చూచితిని .... అయోధ్యా నూతన పట్టమహిషికి జయ మగుఁగాక !

వాల్మీ :— అయోధ్యా నూతన పట్టమహిషి! నీ యభిప్రాయ మేమి ?

సీత :— తండ్రీ ! శాస్త్రవిధి ననుసరించి ఆ యజ్ఞవాటిక యందు రఘురాముల వామపార్శ్వమున నాసీన యగుట కే సతీమణి శ్రీరామునిచేఁ బునః పరిణీత యగునో యా సతీమణియే నూతన పట్టమహిషి యని నా యభిప్రాయము.

వాల్మీ :— అమ్మా ! శ్రీరామునకుఁ బునఃపరిణీత పత్నియా ? వాల్మీకి కల్పనా నేత్రమున కట్టిది కేవల మగోచర మైయున్నది.

తే. గీ. బాల! వాల్మీకి కల్పనాగోళమందుఁ
గానఁగారాని విషయ సంఘటన మొండు
పావనంబగు శ్రీరామ జీవనమున
జరుగ నేరదు తల్లి ! నిస్సంశయంబు !

నిర్విచారముగ నుండుము తల్లీ.

(సీత నిష్క్రమించును.)

వాల్మీ :— (స్వగ) సీతాపతి యయోధ్యయందు లేఁడు. శ్రీరామ పత్ని యరణ్యమునందు లేదు. సీత శ్రీరామునియందు లీనమై యున్నది. శ్రీరాముఁడు సీతాహృదయమునందు వసించి యున్నాఁడు. సీతారాములు ఏకైక తేజస్స్వరూపమై యీ వాల్మీకి హృదయ సింహాసనముపై నుపవిష్ఠులై యున్నారు! ఓ మాయామానుష విగ్రహా ! నీ దర్శనభాగ్యమున నేను ధన్యుఁడ నయ్యెద.

(శ్రీరామకీర్తనముఁ జేయుచు నిష్క్రమించును.)

దృశ్యము 2

[ఆశ్రమోపాంతము - ప్రవేశము : లవకుశులు]

కుశు :— సోదరా! ఆ యశ్వము ఫాలభాగమునఁ గట్టఁబడియున్న యా పత్రికను జూచితివా? అది నిశ్చయముగ రాజాశ్వమే! అశ్వమేధయాగ సందర్భమున దిక్సంచారముఁ జేయ విడువఁ బడిన రణాశ్వము!

లవు :— అయిన నేమి?

కుశు :— దీని పర్యవసానము యుద్ధమని నీకుఁ దెలియదా?

లవు :— అగుగాక— యుద్ధము మన కొక యసాధ్యకార్యమా?

కుశు :— కాదు కాని,

తే. గీ. పావనం బీ ప్రశాంత తపోవనంబు
ఘోరసంగ్రామ రంగమై ఘోషఁజెందు!
పూవుదేనియల్ పాఱెడు పుణ్యభూమి
నకట! రక్తధారాప్రవాహములుపాఱు!

లవు :— సోదరా! దానికి మన మేమి చేయగలము? అశ్వము నేమో కట్టితిమి కదా! పట్టిన యశ్వమును రణమునకు భీతిల్లి విడిచిపుచ్చుట వీరులకు లక్షణమగునా?

కుశు :— స్వయముగ అమ్మయేవచ్చి నిషేధించిన?

లవు:— అమ్మ నిషేధించునా? క్షత్రియకాంత కాదా?

కుశు:— రాజాశ్వమును బంధించుట రాజున కవమానముఁ జేయుటయే యగును. అది రాజద్రోహముతో సమానము. రాజద్రోహము క్షాత్రధర్మమా? ఇంతకును ఎవ్వరి యశ్వమును మనము పట్టితిమో తెలియునా?

తే. గీ. తాత రచియించిన మహా కథాక్రమమున
నాయకుండు! సీతాసతీ నాయకుండు!
రావణ విజేత! త్రిభువనారాధ్యుఁడైన
రామ భూపాలు సవనాశ్వ రాజ మిద్ది!

లవు:— ఏమీ! అయోధ్యాపతి శ్రీరాముని సవనాశ్వమా యిది?

కుశు:— ఫాలపత్రికను నీవు చదువలేదా?

లవు:— అందేమి వ్రాసియున్నది? .... ఆగుము. ఆ పత్రిక నిటుఁ దెచ్చెదను.

(పోయి పత్రికఁ దెచ్చును)

లవు:— ఇదిగో పత్రిక — (చదువును)

మ. రవి తేజః పరిరక్షితంబు, రణవిక్రాంతం, బయోధ్యాధిరాట్
సవనోత్సర్జితమా మహా హయవతంసం బిద్ది! బంధించి, యా
హవమున్ జేయుఁడు, దుర్నిరీక్ష్యమగు రామాస్త్రాగ్ర కాలానల
చ్ఛవి కోర్వంగల వీఁడు లీ వసుమతీచక్రంబునం దుండినన్!

(అని చదివి, ఆనందముతో) ఓహో! నేఁ డెట్టి సుదినము! సోదరా! ఈ పత్రికను జూచిన పిమ్మట నాకు రణోత్సాహము మఱెంత యధికమైనది! ఈ యశ్వమును నే నింక విడతునా?

[ప్రవేశము - సీత]

లవు:— అమ్మా! మంచి సమయమునకే వచ్చితివి. నేఁడు నా కెట్టి సుదినమమ్మా! ఎట్టి మహావకాశము నేఁడు నాకు లభించెనో నీకుఁ దెలియునా?

సీత:— ఏమది నాయనా?

లవు:— అయోధ్యాపతి శ్రీరామునితో యుద్ధముఁ జేయుట కవకాశము కల్గినది.

సీత:— (చకితయై) అయోధ్యాపతితో .... యుద్ధము!

లవు:— అగునమ్మా! అశ్వమేధయాగముఁ జేయుచున్నాఁడఁట! అదిగో, ఆ యజ్ఞాశ్వము! చూచితివా యెట్లు బంధించితినో! దాని ఫాలభాగమునఁ గట్టఁబడిన పత్రిక యిదిగో చూడుము. నిరపరాధినియైన మహాసతి సీతను నిష్కారణముగఁ బరిత్య

జించిన మహా నీతిశాలి, యీ పత్రికయం దెన్ని గొప్పలు చెప్పుకొనినాఁడో చూఁడుమమ్మా; సిగ్గులేక !!

(పత్రికను స్పష్టముగ వికటముగ వచనరీతిని చదువును.)

సీత:— (పత్రికను జూచి కొంచెమాగి) నాయనా! ఆ జగదేక వీరునితో నీవు యుద్ధముఁ జేయుదువా ?

కుశ:— నే నెంత చెప్పినను వినకున్నాఁడమ్మా. ఏమైనను అతఁడు లోకారాధ్యుఁడైన ప్రభువు కాఁడా ?

లవు:— ప్రభువైన నేమి ? జగదేకవీరుఁ డంటివి; ఆ జగదేక వీరత్వ మెట్టిదో నేను జూచెదను. అమ్మా! అనుజ్ఞ నిమ్ము. ఏనాఁడు రామాయణమును దొల్లి పఠించితినో యానాఁడే ఆ శ్రీరామునితో యుద్ధముఁ జేయవలయునన్న సంకల్పము నాయందు జనించినది. ఇంతకాలమునకు ఆ సంకల్పము సిద్ధింపనున్నది!

సీ. సురగణంబు నుతింప హర ధనుర్దండ భం
      జన మొనర్చిన మహా సత్త్వశాలి!
ఒక్క బాణాహతి నొగి సప్తతాళ భే
      దన మొనర్చిన మహోదగ్ర ధన్వి!
ఖరదూషణాది రాక్షసయోధ యూథంబు
      హతమార్చిన మహా పరాక్రమార్చి!
దశకంఠ కంఠర క్తస్నాతుఁడై పుష్ప
      వృష్టిఁ దేలిన మహా వీరమాళి!
గీ. తల్లి! యుద్ధమే చేయంగఁ దలఁతునేని
అట్టి సర్వలోకైక విఖ్యాతుఁడైన
వైరితోఁడను బోరాడవలయుఁ గాని
ఇతర నరకీటకములతో నేటికమ్మ ?

అమ్మా! రణోత్సాహినై యున్న నన్నాశీర్వదించి పంపుము.

సీత:— నాయనా! ఈ యభాగిని విచ్ఛిన్న హృదయమునఁ జిచ్చు రగిల్చెదవా ?

లవు:— అమ్మా! నీకు నమస్కరించెదను. నన్ను వారింపకుము. యాగాశ్వమును బట్టితిని. యుద్ధము చేయక అశ్వమును విడువను. తల్లీ! అనుమతి నిమ్ము.

కుశు:— అమ్మా! పోనిమ్ము. వీని కుత్సాహభంగ మేలచేసెదవు? అనుమతి నిమ్ము. మే మిద్దఱమును ధనుష్పాణులమై యుద్ధరంగమును జొచ్చితిమేని ఫాలాక్షునకైన మమ్ము జయింప సాధ్యమగునా ?

లవు:— సోదరా! మన మిద్దఱమును గూడ నేల? నే నొక్కఁడను చాలనా ?

సీత:— (స్వగ) రఘువీరునితో యుద్ధమా? సాక్షాత్ జనకునితో సంగ్రామమా! నే నేమని యనుమతి నీయఁ గలను? — క్షత్రియకాంతను! శ్రీరామ పత్నిని! వీరమాతను! భీరుత్వమునకు స్థానము కలదా? — పితా పుత్రుల యుద్ధము! ఈశ్వర సంకల్ప మిట్లున్నదా! హా! జగద్రక్షకా! ఎట్టి విషమసమస్యయందు నన్ను వైచితివి!

లవు:— అమ్మా! ఊరకుంటివేమి? అనుమతినిమ్ము. ఆశీర్వదింపుము.

సీత:— (స్వగ) హా! ప్రభూ! సర్వాంతర్యామీ! నా మనోవ్యథ నీ వెఱుంగుదువు! నాకుఁ గర్తవ్య పథముఁ జూపుము.

(బాష్పములు రాల్చును)

లవు:— అమ్మా! ఇట్టి శుభసమయమునందు నీవు దుఃఖించెద వేమి? ఏమియును భయములేదమ్మా? నా పరాక్రమము నీ వెఱుఁగవా ?

సీ. చినతనంబాది నేర్చిన శరాసన కళా
గరిమ నింకెపుడు కన్పఱతు నమ్మ?
జన్మసిద్ధంబైన క్షాత్ర తేజః ప్రభా
వముఁ జూప నెపుడింక సమయమమ్మ?

తాత యిచ్చిన మహత్తర దివ్య శస్త్రాస్త్ర
పటిమ నింకెపుడు చూపఁగలనమ్మ?
సీతాకుమారు లజేయులంచు విశాల
జగతి నింకెపుడు చాటఁగలనమ్మ?

గీ. రావణాంతకుఁడైన శ్రీరాము వంటి
విశ్వవిఖ్యాతుఁ డగు మహావీరుతోడ
సమర మొనరింపగల మహాసమయ మింక
ఎన్ని జన్మంబులకు లభియించునమ్మ?

కుశు:— అమ్మా! నిర్విచారముగ నాజ్ఞాపించుము. నిశ్చయముగ మా సమరవిద్యా ప్రదర్శనమున కిదియొక యమూల్యమగు నవకాశమే యగును. నీయాశీర్వాదమే మాకు వజ్రకవచము. ఏమియును భయములేదు తల్లీ!

సీత:— అశ్వమున కంగరక్షకులై యెవ్వరు వచ్చిరి?

లవు:— ఎవఁడో యొక సేనాపతి. ఎవ్వఁడైన నేమి? స్వయముగ శ్రీరాముఁడు మాత్రము రాలేదు. వచ్చియుండిన నెంత సులువై యుండునమ్మా! ముందీ సేనాపతిని గడపవలెను? ఆపైగదా శ్రీరాము నెదుర్కొనుట! కానిమ్ము — ఏమి చేయఁగలము?

సీత:—(స్వగ) ఈశ్వర సంకల్ప మనివార్యము. వీరపుత్త్రుల క్షాత్రోచిత కార్యమునకు నే నంతరాయముఁ గల్గింపఁ జాలను. (ప్రకాశము) కుమారులారా! మంచిది. యుద్ధయాత్రకుఁ బోయి రండు. సంగ్రామమునందు మీకు సర్వతోముఖ విజయము లభించుఁ గాక! సీతా పుత్రులు యుద్ధమునం దజేయులగుదురు గాక!

లవ-కుశ:— (నమస్కరింతురు)

లవు:— అయోధ్యాపతీ!

తే. గీ. నిరపరాధిని యైన యా పరమసాధ్వి
కానలకుఁ బంపినట్టి నీ కఠినహృదయ
మెట్టులోర్చునో చూచెద నింకమీద
చటుల సీతాసుత మహోగ్రశస్త్రఘాటి!

(లవకుశులు నిష్క్రమింతురు.)

సీత:— తల్లీ! సర్వమంగళ ప్రదాయినీ! జగజ్జననీ! రక్షింపుము. రక్షింపుము.

సీ. ప్రాణాధికంబైన రఘుకులేశ్వరుని మా
నసపద్మ మొకయింత నవయకుండ,
పసికందువుల ఫాలభాగంబులందున్న
సిందూరతిలకముల్ చెదరకుండ,
ఇరు పక్షముల ధనుర్ధరగణంబుల యందు
నొకఁడైన రణభూమి నొరగకుండ,
వీరసైనిక రక్తబిందు వొక్కటియైన
వసుధాతలంబుపైఁ బడకయుండ,
గీ. జయ జయ ధ్వను లుభయ పక్షముల మ్రోఁగ,
మంగళముల, పరస్పరాలింగనముల
చిత్రమైనట్టి యీ పితాపుత్ర సమర
మంత మొనరింపు మమ్మ! సర్వార్థనిలయ!!

(చేతులు జోడించి ధ్యానంగత యగును.)

దృశ్యము 4

[ఆశ్రమోపాంతము - ప్రవేశము లవకుశులు, కొందరు బాలకులు]

లవు:— సోదరా! ఇంక నతిస్వల్ప కాలములోనే యుద్ధము ప్రారంభమగును. ఆశ్రమము నిస్సహాయమై యున్నది! తాత విదేశగామియై యున్నాఁడు. నీవు ఆశ్రమ రక్షణముఁ జేయుము. అమ్మకును, ఆశ్రమవాసులకును ఎట్టి హానియు జరుగకుండ నీవు కాపాడుము.

కుశు:— మఱి నీవు?

లవు:— నేను పోయి యా సేనాపతి నెదుర్కొందును.

కుశు:— నీవు పోనేల? ఆ సేనాపతియే యశ్వముకొఱకు మన యొద్దకు రాక తప్పదుకదా!

లవు:— అగును. కాని, విలంబ మేల కావలెను? ఆతఁడు వచ్చి మనల యుద్ధమున కేల పిలువవలెను? ఆ ప్రథమ నిమంత్రణ గౌరవము మన మేల ఆతనికి విడువవలెను?

బాలకులు:— ఔను, అంతే.

కుశు:— (ప్రక్కకుఁ జూచి) అదిగో, ఆ సేనాపతియే కాఁబోలు నిటు వచ్చుచున్నాఁడు.

లవు:— (చూచి) మంచిది. నీ వింకఁబోయి యాశ్రమమం దుండుము. బాలకులారా! మీరుకూడ పొండు.

ఒక బాలుఁడు:— లవకుమారా! నన్నుమాత్రము నీ వెంట నుండ నిమ్ము. నవ్వులాటకైనఁ బనికివత్తును. బాలకులారా! మీరందఱును కుశుని వెంట పొండు. ఆశ్రమము జాగ్రత్త!

(కుశుఁడు, బాలకులు నిష్క్రమింతురు)

[ప్రవేశము — శత్రుఘ్నుఁడు, వృద్ధులు భటులు]

శత్రు:— (లవునిఁజూచి) బాలకా! నీవేనా మా యశ్వమును బట్టిన బాలవీరుఁడవు?

లవు:— ఎట్లు గుర్తించితివయ్యా? (నవ్వి) నీవేనా యశ్వము కంగ రక్షకుఁడవై వచ్చిన సేనాపతివి?

శత్రు:— అగును. (లవుని తేరి చూచుచుండును)

లవు:— (బాలకునితో) ఓయి బ్రాహ్మణవీరా! ఈ సేనాపతితో నీవు యుద్ధముఁ జేయఁగలవా?

బాల:— నీ చేతికి మించినప్పుడు కదా నేను? ముందు నిన్ను గెలువ నిమ్ము. అపై నా బ్రాహ్మణశక్తి చూడఁగలఁడు.

శత్రు:— (విస్మయముతో, స్వగతము) ఎవ్వఁ డీ బాలకుఁడు?

తే. గీ. భువనమోహనమైన యీ ముఖము తీరు,
నీలరత్నచ్ఛటల నీను నేత్రయుగము,
అమృతరసమొల్కు మధుర కంఠారవంబు,
స్మరణకును దెచ్చు నా మహాసాధ్వి నహాహా!

లవు:— ఏమయ్యా. అట్లు దిగ్భ్రమఁజెంది చూచుచున్నావు?

బాల:— మన మిద్దఱమును ఈతనికి రెండు పెనుభూతములవలెఁ గనఁబడుచున్నాము కాఁబోలునోయి లవకుమారా! (నవ్వుచు) మేము భూతములము కామయ్యా, భయపడకు.

శత్రు:— (లవునితో) బాలకా! లోకాభిరామమైన యీ మధుర మోహనాకృతి నీకుఁ గల్పించిన మాతాపితరు లెవ్వరు?

లవు:— సేనాపతీ! నీవు యుద్ధముఁ జేయుటకు వచ్చితివా, లేక, ముక్కులు మోములుఁ జూచుటకు వచ్చితివా? నీ ప్రభుని యజ్ఞాశ్వమును నేను బంధించితిని. అధిక ప్రసంగ మేల? రెండే ప్రశ్నలు.

మ. ముదమారన్ బ్రభుకార్య ధూర్వహుఁడవై మ్రోగించి కోదండమున్,
గదనక్షేత్రముఁజొచ్చి శౌర్యమున సంగ్రామంబె కావింతువా?
పదిలంబారఁగ నీ భుజోపరి ధనుర్బాణంబులన్ దీసి నా
పదయుగ్మంబునవైచి సాగిలి నమోవాకంబె కావింతువా?

చెప్పుము.

బాల:— అంతే, ఏదో యొకటి చెప్పుము.

శత్రు:— బాలవీరా! సత్యముగ నీవు నాతో యుద్ధముఁ జేయుటకే సంకల్పించుకొని యుంటివా?

బాల:— అదిగో, తిరిగి యధికప్రసంగమునకు దిగుచున్నాఁడు చూడు.

లవు:— పోయి త్వరలో నీ సైన్యములను సిద్ధముఁ జేసికొనుము.

శత్రు:— (స్వగ) ఈ బాలకుని ముఖదర్శన మాత్రమున నా సర్వాంగము నిస్తేజమై నిర్వీర్యమగుచున్న దేమి? ఈ పసిబాలు నాలింగనముఁ జేసికొన నా కిచ్ఛ పొడముచున్నది! తీక్ష్ణములగు శరాఘాతములచే నవనీతకోమలమగు నీవక్షము నెట్లు భేదింపఁగలను? నా శరీర మాపాదమస్తకమును వివశమగుచున్న దేమి? శతకోటి ప్రవిస్తరమైన శత్రుసైన్యము నెదుర్కొనునప్పుడైన లేనిది యీ హృదయచాంచల్యమేమి?— (ప్రకాశము) బాలకా! నీతో యుద్ధముఁ జేయుటకు నా కిచ్ఛ పొడమకున్నది! నిన్నుఁ జూచినంతనే నా హృదయము ద్రవీభూత మగుచున్నది.

లవు:— (పకాలున నవ్వి) ఇదియా అయోధ్యావీరుల తత్వము? లోకైకవీరుఁడని ప్రసిద్ధిఁగాంచిన శ్రీరాముని సేనాపతివేమో! (పకపకనవ్వి) ఇట్టి స్త్రీహృదయముతోఁడనా నీవు యజ్ఞాశ్వమున కంగరక్షకుఁడవై వచ్చితివి? పొమ్ము. పొమ్ము. పోయి మీ మహారాజుతో నిట్లు చెప్పుము.

సీ. తమసా ప్రవాహ తీరమున వాల్మీకి మ
హర్షి దివ్యాశ్రమం బలరు ననుము,
ఆ పుణ్యభూమియం దవతారము ధరించి
శ్రీ మహాలక్ష్మి వసించు ననుము,
ఆ యమ్మ రెండు సింహంపుఁబిల్లల నెంతొ
యుత్సాహమునఁ బెంచుచున్న దనుము,
అవి ఫాలనేత్ర కాలానలోద్ధతికైన
జడియని బెడిదంపు పిడుగు లనుము,

గీ. అం దొకటి కట్టువిడి విలాసార్థముగను
తనదు సవనాశ్వమును బట్టుకొనియె ననుము,
భీమ సంగ్రామభూమియం దేమొకాని
వట్టిమాటలఁ దనపట్టు వదల దనుము!

బాల:— ఆపై నాతఁడే వచ్చునో, మఱియొకనిఁ బంపునో, గుఱ్ఱమును విడిపించుకొనుటకు! పొమ్ము పొమ్ము. శీఘ్రముగఁ దెలియఁ జేయుము. ఓహో, అయోధ్యావీరు లనఁగా నెట్లుందురో యనుకొంటిని!

శత్రు:— బాలకా! నీకు రణోత్సాహ మధికముగ నున్నట్లు తోచుచున్నది! యుద్ధముతప్ప అన్యచింత నీ హృదయమున లేనట్లు కనబట్టుచున్నది!— కానిమ్ము, నీ యభిలాషకు నేనేల విఘాతముఁ గల్గించవలెను? ఏదీ నీ కేమైన సైన్య మున్నదా?

లవు:— సైన్యమా? నే నేమి మహారాజు బిడ్డనా - నాకు సైన్యముండుటకు? కేవల మొక తాపస బాలకుఁడను. ఆశ్రమవాసిని! పోనిమ్ము. సైన్యసమేతుఁడవగు నీతో నేను ఏకాకినై యుద్ధము జేసెదను రమ్ము.

బాల:— ఇదిగో, నా సహాయముకూడ నీతని కవసరములేదు, మఱి చూడుఁడు.

శత్రు:— బాలకా! అసంఖ్యాకమైన మహాసైన్యముతో నీ వేకాకివై పోరెదవా? నీ మాటలకు నాకు నవ్వు వచ్చుచున్నది!

బాల:— నవ్వువచ్చుచున్నదా ? (పకపకనవ్వి) - నవ్వు - నవ్వు. ఎంత నవ్వగలవో యిప్పుడే నవ్వు. తరువాత మఱి నవ్వుటకవకాశ ముండదు సుమా.

లవు:— అయ్యా ! నీ సైన్య మసంఖ్యాకమే యగుఁగాక. నే నేకాకినే యగుదును గాక. బలాబల నిరూపణము ఫలితములపైఁగదా యాధారపడి యుండును ? ఇంతకును, ఈ యధిక ప్రసంగ మేల ? యుద్ధముఁ జేసెదవా ? తిరిగి పోయెదవా ?

బాల:— అంతే. రెండే ప్రశ్నలు. చెప్పు.

శత్రు:— బాలవీరా ! నీ పౌరుషవాక్యములు నా కాశ్చర్యముఁ గొల్పుచున్నవి !

లవు:— వాక్యములే నీ కాశ్చర్యముఁ గొల్పుచుండ, మఱి కార్యములకు నీ మేనఁ జైతన్యమే వదలిపోవునేమో !

శత్రు:— కుమారా ! నిన్నుఁజూచినది మొదలు నా చిత్తము చలించుచున్నది.

బాల:— సరే ! ఉఁ ! లవకుమారా ! పాపము, ఇతనిని విడచి వేయుము. ఇంత చలించిపోయిన యీతని నింక బాధపెట్టుట తగదు.

శత్రు:— అజ్ఞాతమును, అదృశ్యమును అగు నొకానొక బలీయ ప్రేమపాశము నన్ను బంధించి నీ దెస కీడ్చివేయుచున్నది. ఏ మహాతేజః ప్రభావముచే నీ విప్పుడు తేజస్వివై నన్నెదుర్కొన నుంటివో నే నూహింపఁజాలకున్నాను.

లవు:— అగును. ఆ మహాతేజః ప్రభావమును నీ వూహింపఁజాలవు.

సీ. ఏ దుర్నిరీక్ష్య తేజోదర్ప మఖిల దిక్
దంతావళములకున్ గన్నుమూఁత !
ఏ హుంతాశార్చి దుర్దాహంబునకు సప్త
జలనిధుల్ శూన్య శ్మశాన తటులు !

ఏ ప్రపంచాతీత దృప్తసారమునకుఁ
బంచభూతములు నిష్ప్రాభవములు !
ఏ దుర్జయప్రభా హేలాభిరతికి న
క్షత్ర మండలము రంగస్థలంబు !
గీ. ఆ మహాశక్తి ! యపరాజితాత్మశక్తి !
మాతృదేవతాశీర్వాద మహితశక్తి !
సర్వశక్తి సంపూర్ణమహా సాధుశక్తి !
కదనభూమిని నేఁడు కాచెదవుగాక !

శత్రు:— కానిమ్ము. విధివిధానము అవిలంఘనీయము. నా విధ్యుక్తమును నేను నెఱవేర్పవలయునుగదా. ఈ ఋష్యాశ్రమోపాంతము రణమునకు యోగ్యస్థలముకాదు. అదే యా కన్పడుచున్న సమప్రదేశమునకుఁ బోవుదము రమ్ము.

లవు:— మహానందమైనది. ఇప్పటికికదా నీవొక వీరునివలె మాటాడితివి ! సేనాపతీ ! నడువుము.

బాల:— లవకుమారా ! అక్కడికి నేనుకూడ రావలెనా యేమి ? ఇక్కడ నేను నిలచి మీ యుద్ధమును కనిపెట్టుచుండెదను.

లవు:— (నవ్వి) పిరికిబాపఁడా, అట్లే కానిమ్ము. ఇచ్చటనేయుండుము.

(శత్రుఘ్నునితో నిష్క్రమించును.)

బాల:— (స్వగ) అమ్మయ్యా ! బ్రతికితిని. కాదు, నావెంటరమ్మన్న ? నాగతి యేమైయుండును ? ఆహాహా ! భగవంతుఁడు మహాగొప్పవాఁడు ! (చేతులు జోడించుచు) నిజముగా భగవంతునివంటి మనిషి లేఁడు !

(తెరవ్రాలును.)

దృశ్యము 4

[ఆశ్రమవనము - ప్రవేశము : కుశుఁడు]

కుశు:— (స్వగ) ఏకాకియై యసంఖ్యాసైన్యము నెదుర్కొనఁబోయిన లవకుమారుని జాడ యేమియుఁ దెలియకున్నది! ఆ మహా సైన్యము నసహాయముగ నీతఁ డవరోధింపఁ గల్గియుండునా? నా హృదయము చలించుచున్నది.

తే. గీ. అతి భయాకుల చిత్తయై యాశ్రమమున
నేకధారగ జనయిత్రి యేడ్చుచుండె;
అకట! తోడు నిల్వక సమరాంగణమున,
ఏల పడియుంటి నిచట నిర్హేతుకముగ!

బాల:— (ప్రవేశించి) కుశకుమారా! అదిగో, మన లవుఁడు వచ్చుచున్నాఁడు.

కుశు:— (ఆత్రముతో) ఏఁడీ? (ప్రక్కకుఁజూచుచు) ఆహా! మందహాస విలసితమైన యా ముఖము విజయమునే సూచించుచున్నది!

[ప్రవేశము - బాలకునితో లవుఁడు]

కుశు:— వచ్చితివా, సోదరా! (కౌఁగిలించుకొని) యుద్ధ మేమైనది?

లవు— (నవ్వుచు) ఏమైనది? ఏమి కావలెనో యది యైనది!

బాల:— కుశకుమారా! నే నుండఁగా నేమి కాఁగల దనుకొంటివయ్యా? లవకుమారుఁ డొక ప్రక్క — నేనొక ప్రక్క — తెలియునా? ఇంక హరిహరాదులకైన మా వ్యూహమునం దడుగు పెట్టుటకు సాధ్యమా? (ఇతర బాలకులను జూపుచు) ఈ పిరికి పీనుఁగు లెవ్వరైన ఆ యుద్ధమువైపుఁ జూడనైనఁ జూడఁగలరా? (పక పక నవ్వును.)

లవు:— సోదరా! యుద్ధమే జరుగలేదు. తొలుత వాయవ్యాస్త్ర ప్రభావమును జూపితిని.

తే. గీ. క్షణములో నా మహాసైన్య సముదయంబు
కట్టు తెగి యంతరిక్ష మార్గమున కెగసి
వసుధ కంపింపఁ దిరిగి భూపతన మయ్యె
నరకళేబర వర్షంబు కురిసినట్లు!

బాల:— కుశకుమారా! ఆ చిత్రమును నీవు చూచి తీరవలసిన దయ్యా! గాలికుమారమునందుఁ గలసి యా సైన్య మంతయు నాకాశమునం దూగిన యా యుఱ్ఱూతలు, పెట్టిన యా మొఱ్ఱలు, మఱి వర్ణింపలేనయ్యా!

లవు:— పిమ్మట సమ్మోహనాస్త్ర ప్రయోగమున సేనాపతి సమేతముగ సమస్త సైన్యమును సమ్మూర్ఛిత మొనర్చితిని. తమసా తీరమునం దా సైన్యమంతయు నిష్పందు నిశ్చేష్టమై పడియున్నది! ఈ యస్త్రప్రభావమున మూడు రాత్రులు గడచువఱకు నట్లే పడియుండును. పిమ్మట తిరిగి చైతన్యముఁ గాంచును.

కుశు:— రమ్ము. ముందు అమ్మను జూచివత్తము రమ్ము. అత్యంత భయాకులయై యేడ్చుచున్నది.

లవు:— ఏడ్చుచున్నదా? ఏమి? నా శక్తిని శంకించినదా? సోదరా! నీవుపోయి యామెకు నా యభివందనము లర్పించి, సమస్తమును నివేదించి యోదార్పుము. నే నిప్పు డామె యొద్దకు రాను. నా కార్య మింకను బూర్తికాలేదు. ఇప్పుడు నే నయోధ్యకుఁ బోవలెను.

కుశు:— ఏల?

లవు:— యజ్ఞాశ్వ మిచ్చట బంధింపఁబడియున్న వృత్తాంతము అయోధ్యాపతికిఁ దెల్పుటకు. పాపము, ఆతని సైన్యమునం దొక్కఁడును సచేతనుఁడై మిగిలియుండలేదు. నేనే స్వయముగ నయోధ్య కేగి యావద్వృత్తాంతమును రాజున కెఱిగించి వచ్చెదను. ఆ యజ్ఞాశ్వము నధిరోహించియే పోయెదను.

కుశు:— అమ్మ నిన్నుఁజూడ మిక్కిలి వ్యాకులపడుచున్నది.

లవు:— ఆమెను నీ సోదాద్భవము. నేను వాయువేగమునఁ దిరిగి వచ్చెదను.

కుశు:— సోదరా! ఆ మాత్రము వార్తఁ దెల్పుటకు ఇంకెవ్వరినైన నయోధ్యకుఁ బంపినఁ జాలదా?

లవు:— అటుకాదు సోదరా? కేవలము వార్త నివేదించుటకే నేను పోవుట లేదు.

తే. గీ. ధర్మపత్నీ పరిత్యాగ దక్షుఁడైన
ఆ మహారాజు రూపు నే నరసివత్తు
ఆ శరీరంబు రక్త మాంసాస్థి మయమొ
నిష్ఠుర కఠోర పాషాణ నిర్మితంబొ!

నీ వమ్మను జూచిరమ్ము. (పోఁబోయి. తిరిగి చూచి) ఇదిగో, సోదరా! పాపము రాజసైన్య మంతయు మూర్ఛాగతమై పడియున్నది! గృధ్ర శృగాలములచే నా సప్రాణ కళేబరములకు హానికలుగకుండ నీవు కాపాడవలయును సుమా!

బాలు:— అచ్చట నేను కాపుండెదను లెమ్ము.

కుశు:— అట్లే కాపాడెదను. కాని, సహోదరా! శీఘ్రముగ రావలయును సుమా! అయోధ్యాపురీ సౌధ గోపుర సౌభాగ్యమును జూచుచు, ఈ పర్ణకుటీరమును మఱచి పోఁగలవు!

లవు:— అది కేవల మసంభవము!

ఆ. వె. జన్మభూమి మాతృచరణ పుష్ప పరాగ
శోభితంబు! గురుపదాభిరామ
మీ కుటీరసీమ కెనయౌనె భువి నెన్ని
కోట్లయోధ్యలైన కుశకుమార!

(ఇరువురును చెరియొకవైపు నిష్క్రమింతురు)

పృథ్వీపుత్రి

చతుర్థాంకము

దృశ్యము 1

[అయోధ్యా రాజమందిరము - ప్రవేశము - ఏకాకియై శ్రీరాముఁడు]

శ్రీరా:— (స్వగతము) దేవీ! తుంగభద్రా! పతివ్రతామణీ! నీ యభిశాపఫలమును సంపూర్ణముగ నేననుభవించెదను. ముహూర్తమాత్రమైన నాకీ జన్మమున శాంతి యుండదు. అహోరాత్రము లాహార నిద్రావిహీనుండనై, సహస్ర బంధుమధ్యమున నేకాకినై, మనస్తాప వహ్నిజ్వాలా మధ్యాంగతుండనై, మరణము నపేక్షింతును. దేవీ! నీ హృదయమును విదారణ మొనర్చి నే నార్జించిన యభిశాపవాక్యమునఁ బ్రత్యేకాక్షరమును మహాఫలప్రదమై యున్నది! ఈ విశాల జగతియందు నేను కేవల మేకాకినై యున్నాను. నాకు బంధు వనఁదగు ప్రాణి యీ ప్రపంచమున లేదు. నా భవిష్యజ్జీవన మంధకార మయము! సర్వశూన్యమగు శ్మశానము!

[వశిష్ఠ మహర్షి ప్రవేశించును - శ్రీరాముఁడు అభివాదముఁ జేయును]

వశి:— వత్సా! అశ్వమేధమునకు సర్వమును సన్నద్ధమగుచున్నది. నిమంత్రణ కార్యభార మంతయు సౌమిత్రి వహించెను. అశ్వముతో సైన్యసమేతముగ శత్రుఘ్నుఁడు పోయి యున్నాఁడు. నందిగ్రామమునుండి భరతుఁడు నేఁడో రేపో రాఁగలఁడు.

శ్రీరా:— గురుదేవా! యజ్ఞసన్నాహ మంతయు నిల్పివేయుఁడు. యజ్ఞము జరుగనేరదు.

వశి:— అదేమి ?

శ్రీరా:— మతిచాంచల్యమున, అశ్వమేధమునకుఁ దొల్లి యంగీకరించితిని. యజ్ఞానుష్ఠానము కేవల మసంభవము.

వశి:— అసంభవమా ? ఎట్లు ?

శ్రీరా:— ఎట్లో సకాలమునఁ దమకు నివేదింపఁగలను. ప్రస్తుతము సర్వప్రయత్నములను విరమింపుఁడు.

వశి:— రఘురామా! ఏకాకివై, ఏకైకచింతా పరితప్త హృదయుండవై, అహోరాత్రము లంతఃపురమును విడువకుంటివి. సభాస్థానమునందు బహుకాలమై నీ దర్శనభాగ్యము లేక ప్రజాగణము వ్యాకులపడుచున్నది.

శ్రీరా:— మునీంద్రా! నేను మిక్కిలి యస్వస్థుఁడనై యున్నాను. కొంతకాలము నాకు ఏకాంత విశ్రాంతి కావలయును. ప్రజాగణము నన్ను క్షమించుఁగాక!

వశి:— వత్సా! నీ యస్వస్థతకుఁ గారణ మేమి ?

శ్రీరా:— గురుదేవా! దుఃఖితుఁడను నేను. ఈ జీవన సంగ్రామమునందు నా ప్రాణములు మిక్కిలి యలసియున్నవి. నాకు విశ్రాంతి కావలయును. రాజభక్తి పరాయణులగు అయోధ్యాపురవాసులు తమ ప్రభువున కీ విశ్రాంతిని సహితము నీయనొల్లరా ?

వశి:— రఘురామా! నీ యట్టి ప్రభుసత్తము లిట్లనఁ జెల్లునా? రాజకార్యమున విశ్రాంతికి స్థానము లేదు.

శ్రీరా:— రాజకార్యములు! .... రాజకార్యములు కాక మనుష్యప్రాణి కింక జీవనమునం దన్యకార్యములు లేవా? జాగరణమునందును, నిద్రయందును, స్వప్నములందునుగూడ రాజకార్య ప్రసక్తియే కావలెనా? గురుదేవా!

చం. జనపతియైన జన్మ సహజంబగు నూర్జిత మానుషత్వమున్
మనుజుఁడు మంటఁగల్పుకొని మాఱును కేవల యంత్రమూర్తిగన్!
అనఘ! కిరీటధారి యయినంతనె మానస ధర్మఘాతియై
అనవరతాత్మ హంతయయి యామరణంబుఁ దపించుచుండునే!

వశి:— వత్సా! శాంతింపుము. ఆదర్శమూర్తివైన నీకిట్టి హృదయ దౌర్బల్యము తగదు.

శ్రీరా:— ఆదర్శమూర్తిని!....ఆదర్శమూర్తిని!....అగును అగును. మీ యాదర్శ రక్షకై స్వహస్తములతో నా హృదయగోళ మును వక్షఃకుహరమునుండి పెకల్చివైచితిని! మీ యాదర్శ రక్షకై నిరపరాధియగు శంబుకుని హత్యఁ గావించితిని! ఆదర్శమూర్తిని! ఆదర్శమూర్తిని నేను! హా హ్హా హ్హా!

వశి:— రామచంద్రా! ఇట్టి విపరీతావస్థ యీ వఱకు నీ యెడ నేను చూచియుండలేదు. ఏమి సంభవించినది వత్సా? (చేతులు పట్టుకొని) నాతో సత్యముఁ బల్కుము. జానకీదేవి నీ స్మృతి పథమునఁ బడియుండనోపు!

శ్రీరా:— (ఉత్తేజితుఁడై) గురుదేవా! గురుదేవా! ఆ నామాక్షర ముల నుచ్చరింపవలదు. ఆ నామస్మృతి మాత్రమున రాజ ధర్మము కళంకితము కాఁగలదు! రాజధాని యపవిత్రము కాఁగలదు! చరణములంటి ప్రార్థించెదను, గురూత్తమా! ఆ సీతానామ స్మరణముఁ జేయవలదు. వశిష్ఠ సహితముగ అయోధ్యావాసులకు ఆ నామోచ్చారణమున కధికారము లేదు. క్షమింపుఁడు.

వశి:— వత్సా! నీ నితాంత శ్రేయోభిలాషి నగు నా యుపదేశము నాలింపుము. అశ్వమేధమును బూర్తిగావింపుము. నీ హృదయ క్లేశము లన్నియు నివారణము లగును.

శ్రీరా:— మునీంద్రా! అశ్వమేధ మెట్లు పూర్తికాఁగలదు? సర్వ శాస్త్ర పారంగతులగు తా మెఱుంగని దేమున్నది? శాస్త్ర విధానము పాలింపఁబడవలయును కదా!

వశి:— అగును. యజ్ఞానుష్ఠానమునకు సహధర్మచారిణి చెంతనుండ వలయును. ఉపాయ మేమైన నూహింతము. యజ్ఞభంగ మైనచో ప్రజాగణము నిరాశాహతమై పోవును.

శ్రీరా:— నేనేమి చేయఁగలను మునీంద్రా! ఎంతవఱకు సాధ్యమైనదో అంతవఱకును ప్రజానురంజనముఁ గావించితిని. ఈ యజ్ఞాను ష్ఠానము నా శక్తి కతీతమైనది! నేనేమి చేయఁగలను?

[ప్రవేశము - కౌసల్య]

కౌసల్య:— నాయనా! అది యంత శక్తి కతీతమైన కార్యము కాదు.

వశి:— దేవీ! నీ యభిప్రాయ మేమి?

కౌసల్య:— స్వర్ణసీతా విగ్రహమును నిర్మించి శ్రీరాముని వామ భాగమునందు నిలిపి యజ్ఞపూర్తిఁ జేయవచ్చును.

శ్రీరా:— స్వర్ణసీతా విగ్రహము! .... జానకి సువర్ణప్రతిమా నిర్మాణమునకు నేను సమ్మతింపవలయునా? బహిస్స్వరూపమే ప్రధానమా?

వశి:— వత్సా! శాస్త్రనియతి యంతటితో సంతృప్తిఁ బొందఁగలదు.

శ్రీరా:— శాస్త్రనియతి! .... శాస్త్రనియతి! .... బహిస్స్వరూపమే ప్రధానము! ఆత్మతేజోవిహీన నిర్జీవకంకాళమే శాస్త్రనియతికి ప్రధానము!

కౌసల్య:— నాయనా! సంకల్ప మెట్లో సంపూర్ణము కావలయును కదా! సమర్థులగు శిల్పుల రావించి సీతావిగ్రహ నిర్మాణముఁ గావింతము.

శ్రీరా:— సమర్థుఁడైన శిల్పి! తల్లీ! సీతాస్వరూప నిర్మాణముఁ జేయఁగల శిల్పి చతుర్దశలోకముల నొక్కఁడైనఁ గలఁడా?

తే. గీ. శిల్పులకు శిల్పి యఖిలాండ సృష్టికర్త
బ్రహ్మకైన సీతామూర్తి వశమె తల్లి!
మహిత సీతాస్వరూప నిర్మాణమునకు
నింక నత డెన్ని జన్మంబు లెత్తవలెనో!

అమ్మా! ఆ సువర్ణసీతను నిర్మింపఁగల సమర్థుఁడు బ్రహ్మాండ మునం దొక్క శ్రీరాముఁడు తప్ప వేఱొక్కఁడు లేఁడని గ్రహింపుము.

కౌసల్య:— పోనిమ్ము. ఆ స్వర్ణవిగ్రహమును నీవే నిర్మింపుము.

శ్రీరా:— (యోచించి) మంచిది. నేనే స్వయముగ దానిని నిర్మించె దను. అహోరాత్రములు నిద్రాహారములు లేక ఏ పవిత్ర మూర్తిని నేను ధ్యానించుచుంటినో, ఆ లోకోత్తరమూర్తిని నేనే స్వయముగ నిర్మించెదను. అన్యుల కది భావనాతీతము! అసాధ్యము! ఆ సువర్ణమూర్తిని నిర్మించి దానికిఁ బ్రాణప్రతిష్ఠ యొనర్చెదను!

కౌసల్య:— నాయనా! అట్లనే కానిమ్ము.

వశి:— వత్సా! నీ మనోభీష్టము సిద్ధించుఁగాక!

(కౌసల్య, వశిష్ఠుఁడు నిష్క్రమింతురు. తెర వ్రాలును.)

దృశ్యము 2

[రాజమందిరము—శ్రీరాముఁడు సీతాధ్యానమగ్నుఁడై యుండును.]

శ్రీరా:— (ఉన్మత్తునివలె) అదే! అదే! అదే, ఆ జగన్మోహన మూర్తి! అదే, ఆ సర్వమంగళ స్వరూపము! అదే, అదే, ఆ జగత్పావని! హా! సీతా! సీతా! సీతా!

(బాష్పములు రాల్చును.)

[ప్రవేశము - కౌసల్య]

కౌస:— తండ్రీ!

శ్రీరా:— అమ్మా! వచ్చితివా! అదిగో, అదిగో, ఆ లోకోత్తర మూర్తినిఁ జూడుమమ్మా! ఇదిగో, నా హృదయద్వారమునం దెట్లు మందహాసవదనయై నిలచియున్నదో చూఁడుము.

కౌస:— (స్వగ) ఇదేమి! ఈ యున్మత్తవైఖరి యేమి? భగవన్! భగవన్! ఈ విపరీతానుభవమునకా నేనింకను జీవించి యుంటిని! (కన్నుల నీరు నించును.)

శ్రీరా:— అమ్మా! అదేమి! ఏడ్చుచుంటివేమి? నేఁడు మనకు మహాశుభదినము! నా హృదయాధిష్ఠానదేవత నా హృదయ మందిరమును నేఁడు విరాజమాన మొనర్చుచున్నది! నేఁడు నా సమస్త మానసక్లేశములకు నవసానదినము! ఆ మనోహర విగ్రహమును జూఁడుమమ్మా! దివ్యాంబరాభరణభూషిత యగు రాజమహిషి యనుకొంటివా? కాదు. దివ్యతేజోరాసి యగు తపస్విని! జీర్ణవల్కలధారిణి! దీర్ఘోపవాసకృశాంగి! ఆ దివ్యనేత్రములనుండి ధారాపాతముగ వర్షించుచున్న ఆ యమృతవృష్టిఁ జూచితివా? ఆ విశీర్ణ కంఠోద్గత మగుచున్న యా ప్రేమసంగీతమును వినుచుంటివా? ఆహా! ఆహా! ఎట్టి యపూర్వదృశ్యమమ్మా!

కౌస:— నాయనా! ఈ విపరీత మేమి?

శ్రీరా:— విపరీతము కాదమ్మా! ఆ మహామహిమాన్విత జానకి నీకు గోచరించుటలేదా? నా నయనగోళములను నీవు ధరించి చూఁడుము! ఆ జగత్పావనిని జూఁడుమమ్మా! ఆహా! ఆ యలోకస్పర్శానుభవమున నా మనస్తాపములెల్ల నిశ్శేషముగ నివారణములైనవి తల్లీ! ధన్యోస్మి! ధన్యోస్మి!

కౌస:— (దుఃఖముతో) తండ్రీ! తండ్రీ!

శ్రీరా:— అమ్మా! ఊరక దుఃఖించెదవేమి? ఈ మహాపవిత్ర సమయమున నీ కన్నుల బాష్పము లేమి తల్లీ? నే నేమి యున్మత్తుఁడ నైతిననియా, నీవు దుఃఖించుచుంటివి? నే నున్మత్తుఁడను కానమ్మా! ఈ యనాచ్ఛాదితవక్షమునందు ఆ దేవీమూర్తి సుప్రతిష్ఠితమై యున్నది! ఈ వక్షమును భేదించి చూఁడుమమ్మా!

కౌస:— (స్వగ) ప్రభూ! జగద్రక్షకా! రక్షింపుము. రక్షింపుము.

శ్రీరా:— ధ్యానదృష్టిని నే నా దివ్యమూర్తిని జూచుచున్నాను. ఆ దివ్యమూర్తినిఁ నేను స్వర్ణమూర్తిగఁ జేసి ప్రాణప్రతిష్ఠ గావించెదను! సచేతన మొనర్చెదను! పిమ్మట బాష్పజలధారలచే నామెకు మంగళస్నానముఁ గావించెదను! పిమ్మటఁ బ్రేమామృత వర్షమున నామె కభిషేకముఁ జేసెదను! పిమ్మట నా స్వర్ణమూర్తిని సర్వలక్షణలక్షితయగు మానవమూర్తిని గావించెదను! అమ్మా ఆశీర్వదింపుము, ఆశీర్వదింపుము.

కౌస:— తండ్రీ! నీ మనోభీష్టము సంపూర్ణసిద్ధిఁ గాంచుఁగాక!

(నిష్క్రమించును.)

శ్రీరా:— లక్ష్మణా!

(లక్ష్మణుఁడు ప్రవేశించి యభివాదముఁ జేయును.)

శ్రీరా:— ఈ మందిరద్వారమున నీవు కావలి యుండుము. అభ్యంతర గృహమున నేను స్వర్ణసీతా నిర్మాణముఁ గావించెదను. నా దీక్ష కెట్టి భంగమును గలుగరాదు. లోని కెవ్వరిని రానీయవలదు.

(మందిరద్వారము తెరచి, లోనికేగి తలుపు వేసుకొనును.)

లక్ష్మ:— (స్వగ) ఆహా! ఎంతకాలమునకుఁ దిరిగి నా కెట్టి మహాభాగ్యము సంప్రాప్తమైనది! ఆనాటి పంచవటీ నివాసము నాకు స్మరణకు వచ్చుచున్నది! సత్యవ్రత పరిపాలనార్థము ఏనాఁ డయోధ్యాపురమును విడచి యరణ్యగాములమైతిమో, ఆనాటి మొదలు, పదునాల్గేండ్లు నిద్రాహారములు లేక ధనుష్పాణినై, యిట్లే పర్ణకుటీర ప్రాంగణములఁ గావలియుంటిని! ఆ సేవాభాగ్యము తిరిగి యింతకాలమునకు నాకు లభించినది! కాని ఆ పర్ణకుటీరమునకును, ఈ రాజమందిరమునకునూ ఎంత తారతమ్యము కలదు!

తే. గీ. లలిత సీతా విలాస లీలాప్రభూత
స్వర్గ సామ్రాజ్య ధామ మా పర్ణశాల!
జానకీశూన్య శూన్యశ్మశాన భూమి
అహహ! యీ మహారాజ సౌధాంతరంబు

[ప్రవేశము - భరతుఁడు]

భర:— లక్ష్మణా! అన్నగా రెచ్చట?

లక్ష్మ:— (సంజ్ఞఁజేయుచు) సోదరా! మెల్లఁగ మాటలాడుము. నందిగ్రామమునుండి యెప్పుడు వచ్చితివి?

భర:— ఇప్పుడే వచ్చుచున్నాను. సీతాబహిష్కరణమునకు అన్నగారిపై నాగ్రహించి, పామరునివలె రాజగృహమును విడచి పోయితిని. పరితాపతప్తుఁడనై యిప్పు డా మహాప్రభుని క్షమాభిక్ష మర్థింప వచ్చినాను. ఏరీ, వా రెచ్చట?

లక్ష్మ:— మెల్లఁగ—మెల్లఁగ మాటలాడుము.

భర:— ఏమి? విశేష మేమి?

లక్ష్మ:— వా రిప్పుడీ శ్రీమందిరమున ధ్యాన సమాధియం దున్నారు. దీక్షాభంగము కాఁగలదు, జాగ్రత!

భర:— ధ్యానసమాధియందా? నా కేమియు నర్థమగుట లేదు!

లక్ష్మ:— త్వరలోనే అంతయుఁ దెలియఁగలదు. సోదరా! కొంచె మోపికఁ బట్టుము.

[ప్రవేశము - లవుఁడు]

లవు:— (బిగ్గఱగ) అయోధ్యాపురీశ్వరు లెచ్చట? అశ్వమేధ కర్త లగు నా రఘువరేణ్యు లెచ్చట?

లక్ష్మ:— మూర్ఖబాలకా! ఎవ్వఁడవు నీవు? పొమ్మావల.

లవు:— నీచసేవకా! దూర ముండుము, జాగ్రత్త.

[లక్ష్మణుఁడు లవునిఁ బట్ట నుద్యుక్తుఁడగును. తటాలున మందిర ద్వారమును దెరచుకొని శ్రీరాముఁడు ప్రవేశించును.]

శ్రీరా:— ఎవ్వరిదా కంఠస్వరము! ఎవ్వరిదా చిరకాల పరిచితమైన సుధామధురస్వరము!

భర:— అగ్రజా! పరితప్త హృదయుఁడగు భరతుని యభివాద మందుకొనుఁడు.

(నమస్కరించును)

లవు:— తామే అయోధ్యాపతి, రావణవిజేత, రఘురాములా?

శ్రీరా:— (ఉన్మత్తునివలె లవునిఁ జూచుచు) నీవు .... నీవు .... నీవు ఎవ్వరవు నీవు బాలకా?

లవు:— మహారాజా! నేను వాల్మీకి మహర్షి పుణ్యాశ్రమమున వాసంబున్న యొక తాపసబాలుఁడను. తమచే విడువఁబడిన యశ్వమేధ హయమును నేను బంధించి యున్నాను. ఆయశ్వము వెంటఁ బంపఁబడియున్న సమస్త సైన్యమును నాచేఁ బరాజితమై తమసాతీరమున మూర్ఛాగతమై పడియున్నది.

శ్రీరా:— (లవునివైపు తేరి చూచుచు) ఆహా!

ఉ. ఆ ముఖచంద్ర వైభవమె! యా యపరాజిత ఫాలదేశమే!
ఆ మృదులాబ్జ గంధ మలయానిల శీతల దృక్ ప్రసారమే!
ఆ మధురామృత స్వరమె! యా యసమాన తనూవిలాసమే!
ఆ మహనీయ విగ్రహమె యారయ నియ్యది మూడుమూర్తులన్

బాలకా!

తే. గీ. జగతి నే ధన్యజీవుల శత సహస్ర
జన్మ జన్మాంతర తపః ప్రసాద మీవు?
తండ్రి! యే మాతృవక్షు స్సుధారసంబు
పాన మొనరించి తీవు లావణ్య నిలయ?

లవు:— ఏమయ్యా! అచ్చటఁ దమ సేనాపతి యిట్లే యనెను. ఇచ్చటఁ దాము సహిత మదే ధోరణి!

శ్రీరా:— ఏమీ! నా సేనాపతికూడ నిట్లే యనెనా?

లవు:— మీ మనఃప్రవృత్తి నా కాశ్చర్యముఁ గొల్పుచున్నది! ఏమి మహారాజా! మీ యయోధ్యయందలి ప్రజ లందఱకు నిదే

రోగమా? రూపగ్రహణము తప్ప చాపగ్రహణము మీకుఁ జేతఁ గాదా? నే నిందుల కేల వచ్చితినో యెఱుఁగుదురా?

తే. గీ. రావణ విజేతలైన సంగ్రామ శూరు
లనుచుఁ దమతోడ రణము సేయంగఁ దలఁచి
వచ్చియుంటిని కాని తావక ప్రియోక్తు
లాలకింప రాలేదు నే నవనిపాల!

రాజేంద్రా! మీ యశ్వమును బంధించిన శత్రువును నేను!

శ్రీరా:— ప్రియ బాలకా! నీవు నాకు శత్రుఁడవా?

తే. గీ. శుష్కమై, భ్రష్టమై, సర్వశూన్యమైన
నావిశీర్ణ మనః ప్రమదావనంబుఁ
దిరిగి యుజ్జీవిత మొనర్ప నరుగుదెంచు
శ్రీ వసంతవాయు తరంగ మీవు కావె!

ద్వాదశ వర్షములు నిద్రాహారములు లేక యే మనోహర నేత్రములను నేను ధ్యానించుచుంటినో, యా దివ్యనేత్ర ద్వయమే యిది! ఏ సుధామధుర కంఠస్వరవాహిని నాకు సర్వతాపహరమై యుండెనో, యా కంఠస్వరమే యిది! కుమారా! నా ప్రాణసతీ దివ్యమోహన స్వరూపము నీ సర్వాంగము లందును ముద్రితమై కన్పట్టుచున్నది! నీ కోమల కంఠమునుండి యామె మధురవాణియే వినవచ్చుచున్నది! బాలకా! ఆమె స్వరూపమును జూఁడుము.

(మందిరద్వారముఁ దెఱచి సీతా స్వర్ణవిగ్రహముఁ జూపును.)

లవు:— (చూచి విభ్రాంతుఁడై) ఎవరి విగ్రహ మది! ఎవ్వరి స్వరూప మది! ఆహా! నా తల్లి! స్వయముగ నా తల్లియే యిచ్చటఁ బ్రత్యక్షమైనది! అమ్మా! అమ్మా!

శ్రీరా:— (మహా సంభ్రమముతో) ఏమీ!.... ఏమీ!.... ఈమె నీ తల్లియా?.... నీ తల్లియా యీమె?.... నీవు.... నీవు సీతాపుత్త్రుఁడవా? నాయనా! నాయనా! (కన్నీరు గార్చును.)

లవు:— అగును. నేను సీతాపుత్త్రుఁడను! ఈమె నా తల్లి! ఈ విగ్రహముతో మీ కేమి పని?

శ్రీరా:— (గద్గదికతో) సీతాపుత్త్రుఁడవా? సీతాపుత్త్రుఁడవా? తండ్రీ తండ్రీ! ఈ భిక్షుక వేష మేమి? మహారాజ పుత్త్రుఁడవైన నీ కీ తాపసవేష మేమి నాయనా? రమ్ము. రమ్ము. ఈ యభాగ్యుని వక్షఃపీఠము నలంకరింపుము తండ్రీ!

(కన్నుల నీరు కాఱ, లవుని గాఁగిలించుకొనఁ బోవును)

లవు:— (కౌగిలి విడిపించుకొని) వలదు. వలదు. నన్ను విడువుఁడు. నాకంతయు దెలిసినది! (మహాదుఃఖముతో) నేను భిక్షుకుఁడను. తాము నన్ను భిక్షుకునిఁ జేసివైచితిరి! నా తల్లి గర్భవాసము నందే తాము నాచేత భిక్షాపాత్రఁ బెట్టితిరి! నేను భిక్షుకుఁడను! మహారాజ పుత్త్రుఁడను కాను! ఈ రాజప్రాసాదమున నాకు స్థానములేదు. నన్ను విడువుఁడు. భిక్షుకుఁడను నేను! అమ్మా! అమ్మా! (ఏడ్చుచుఁ బరుగున నిష్క్రమించును.)

శ్రీరా:— భరతా! లక్ష్మణా! శీఘ్రముగఁ బోయి బాలుని దోడ్కొని రండు.

(భరత లక్ష్మణులు నిష్క్రమింతురు.)

శ్రీరా:— (మహాదుఃఖముతో) ప్రభూ! ప్రభూ! అనుగ్రహింపుము. ఈ నిస్తేజ కళేబరమును తమసాతీరమునకుఁ దోడ్కొనిపొమ్ము. సీతా బాష్పజల తరంగితమైన యా పావన తమసాతీర్థమున నన్ను ముంచివేయుము. సీతా నిశ్వాస సంచలితమైన యా మహారణ్య మధ్యమున నన్నుఁ బూడ్చివేయుము. ప్రియ కుమారా! నన్ను సహితము నీ మాతృపద సాన్నిధ్యమునకుఁ దోడ్కొనిపొమ్ము. ఈ జగతి యంతయు నా కింక నంధకార మయము! నా కింక సర్వము నగమ్యగోచరము!

మ. రణధర్మంబును రాజధర్మ మను పేరన్ విశ్వసామ్రాజ్య శా
సన ధిక్కార మొనర్చియున్న కలుషస్వాంతుండ! లోకైక పా
వని నుగ్రాటవి పాలొనర్చిన మహాపాపంబు, నిర్దోషియా
మునిఁ గూలించిన ఘోరపాతకము, నన్ బూర్ణాహుతిన్ జేయవే?

ఈ ధర్మద్రోహికి, ఈ యాత్మద్రోహికిఁ బ్రపంచమున స్థానము లేదు! సర్వేశ్వరా! ఈ మహాపాతకుని మూర్ధమునఁ బదక్షేప మొనరించి పాతాళమునకుఁ ద్రొక్కి వేయుము. అమంగళ మగు రామశబ్దము బ్రహ్మాండమునం దెచ్చటను వినఁబడరాదు!

సీ. రామరాజ్యము పాపరాజ్యమంచు నఖండ
భూమండలంబు మార్మ్రోగుఁగాక!
రామనామంబు రౌరవ ఘోరనరక మా
ర్గమటంచు జగతిఁ బేర్వడుసుగాక!
రామశబ్ద మధర్మ నామాంతరం బౌచు
శబ్ద గోళమునఁ దేజరిలుఁగాక!
రామదర్శన ముగ్ర ధూమకేతు వటంచుఁ
బంచభూతములు ఘోషించుఁగాక!

గీ. 'రామ' యనియెడు పాపాక్షరములు రెండు
సాధుసజ్జన శ్రవణ భీషణములగుచు
ఆత్మవిద్రోహ, శోక, లజ్జాంధకార
ములకుఁ జిహ్నంబులై ధాత్రి వెలయుఁగాక!

[ప్రవేశము – భరత లక్ష్మణులు]

శ్రీరా:— (సంభ్రమముతో) ఏఁడీ? కుమారుఁ డేడీ? తోడ్కొని రాలేదా?

భర:— ప్రభూ! అశ్వారోహియై యా బాలకుఁ డప్పుడే వాయువేగ మున సరయూ సైకతముల నతిక్రమించినాడు! సరయూనదీ ప్రాంత మంతయు నాబాలుని మాతృస్మరణాక్రోశముచేఁ బ్రతి ధ్వనించుచున్నది! అతని సమీపించుటయే మాకసాధ్య మైనది!

శ్రీరా:— అభాజనులారా! "శ్రీరాముఁడు పాదాక్రాంతుఁడై ప్రార్థించుచున్నాఁడు, రమ్ము తండ్రీ!-రమ్ము" అని యెలుగెత్తి దీనాలాపములఁ బిలువఁజాలకపోయితిరా?

లక్ష్మ:— అత్యంత దీనాలాపముల నాహ్వానించితిమి. కతిపయ దూరమునందు నిలచి, యశ్వోపరిభాగమునుండి తిరిగిచూచి, మాతో నాతఁ డిట్లనెను.

శ్రీరా:— (ఆత్రముతో) ఏ మనెను? ఏ మనెను?

లక్ష్మ:— "మీ యజ్ఞాశ్వమును మీ కిచ్చివైచెదను. మీతో నేను రణము సేయనొల్లను. మాతా భ్రాతృ సహితుండనై భిక్షాపాత్రను జేతబట్టి రామనామ సంకీర్తన మొనర్చుకొనుచు దేశ దేశముల ద్రిమ్మరెదను. ఏ పాపరాజ్యమునుండి నా తల్లి మిథ్యాపవాద హేతుకముగ నిష్కారణముగ బహిష్కరింపఁ బడెనో యా యయోధ్యారాజ్య భూమిపై నేనింక నడుగు పెట్టను, పొండు. పొండు." అని బిగ్గఱగఁ గేకలిడి, క్షణ మాత్రమునఁ బురోమార్గ యానమున నదృశ్యుఁడయ్యెను.

శ్రీరా:— (మహాదుఃఖమున) హా! హా! అభిశాపహతుఁడను! అభిశాప హతుఁడను! భగవన్! భగవన్!

(మూర్ఛితుఁడగును. భరత లక్ష్మణులు సేవా ప్రమత్తులగుదురు.)

(తెరలో - వాల్మీకి సంకీర్తనము)

గీతార్థము.

[సత్యము, ధర్మము, వీని నిజస్వరూపమును హృదయవీణా తంత్రులు దివ్యసంగీత మొనర్చుచు నిరూపింపవలెను. బహిరింద్రియములకు సత్యముగఁ దోచునదెల్ల సత్యము కాదు. ధర్మముగఁ దోచునదెల్ల ధర్మము కాదు. హృదయసింహాసనస్థుఁడై యున్న సర్వాంతర్యామి ఆత్మసాక్షి సత్యధర్మముల నిజస్వరూపమును నిరూపించును.]

శ్రీరా:— (చైతన్యముఁ గాంచుచు) ఆహా! ఆహా! ఆ దివ్యవాణి యేమనుచున్నది? ఆ గంభీర కంఠధ్వని యెవ్వరిది? ధర్మతత్వము నుద్ఘోషించుచున్న యీయమృతాలాపము లెవ్వరివై యుండును?

వాల్మీ:— (పాడుకొనుచుఁ బ్రవేశించి, పాట పూర్తిఁ జేయును.)

శ్రీరా:— (లేచి సమీపించి) మహాపురుషా! శ్రీరాముని యభివాద మందుకొనుఁడు. పాపపంకిలమైన యీ రాజమందిరమును బవిత్రీభూత మొనర్చిన తా మెవ్వరు?

వాల్మీ:— నేను వాల్మీకి యను తాపసిని. శ్రీ రామాయణ కావ్యకర్తను! ఈ వాస్తవిక ప్రపంచమునకు బహుదూరమున, ఊహానిర్మితమైయున్న కావ్య జగతియందు, కల్పనారాజ్యమున నా నివాసము! అందే నేను నిన్ను సృజించితిని! రఘురామా! నీవు నాకుఁ బుత్త్రితుల్యుఁడవు!

శ్రీరా:— ధన్యోస్మి! ధన్యోస్మి! (నమస్కరించును.)

భరత
లక్ష్మణు } — (నమస్కరింతురు.)

వాల్మీ:— (అందఱను ఆశీర్వదించును.)

శ్రీరా:— మునీంద్రా! తమ దివ్యదర్శనమున నేను కృతార్థుఁడనైతిని. మహాత్మా! రామాయణ కావ్యకర్త లగు తమకు నా బహిరంతర సర్వస్వమును దెలియును కదా!

వాల్మీ:— తెలియును, వత్సా! అంతయును నాకుఁ దెలియును. ఈ ద్వాదశవర్షములును సీతా విరహవ్యధాభారమున సాగిన నీ జీవనక్రమ మంతయు నాకుఁ దెలియును. రామచంద్రా! దుఃఖింపకుము. నీ ధర్మపత్ని జానకీదేవి పుత్త్రిద్వయ సమేతముగ నా యాశ్రమమునందుఁ గుశలముగ నున్నది! సందేహింపవలదు. వంశవర్ధనులగు నీ వీరపుత్రుల పరిచయభాగ్యము నీకుఁ ద్వరలోనే లభింపఁగలదు.

తే. గీ. భాగ్యరాశి, రామాంశ సంభవుఁడు - కుశుఁడు,
వసుమతీశ్వర! నీ జ్యేష్ఠబాలకుండు!
యామమాత్ర విలంబానుగామి - లవుఁడు,
అఖిల శుభలక్షణుండు, సీతాంశభవుఁడు!

శ్రీరా:— ధన్యోస్మి! ధన్యోస్మి! ఋషిపుంగవా! నా సవనాశ్వమును బంధించి, రక్షక సైన్యమును బరాజితమొనర్చి, పితృపరిచయార్థము అయోధ్యకువచ్చిన నా వీరపుత్త్రు నొకనింగాంచి మహానంద మందితిని. కాని, నా యానందము క్షణమాత్రపరిమితమై నశించినది. అభిమానభరమున శోకాకులుండై యా బాలుండు నా ముఖముం జూడనొల్లక వెడలిపోయెను.

వాల్మీ:— అగును. ఆశ్రమాభిముఖుండై వాయువేగమున మఱలిపోవుచున్న యా లవకుమారుని నేను సరయూతీరమునందుం జూచితిని. బాలుండు తీవ్ర శోకముచే వగర్చుచుండెను.

శ్రీరా:— తాపసోత్తమా! నాకు సత్యపథమును జూపుండు. తుచ్ఛ రాజధర్మము సముద్రగర్భమునం గూలిపోవుంగాక! మానవ హృదయ ధర్మమునకు వ్యతిరిక్తమైన రాజధర్మము రసాతలగతమై నశించుగాక! ఈ హృదయాంతరాళము నదలించుచున్న భయంకర హాహాకార విజృంభణమును నే నింక సహింపంజాలను—సహింపంజాలను. ఈతుచ్ఛరాజ్యపదవి నాకు వలదు. మునీంద్రా! తమ పవిత్ర పదసాన్నిధ్యమున నీ సమస్తమును బరిత్యజించి సీతాశరణ్యమైన మహారణ్యమును జొచ్చెదను. అనుగ్రహింపుండు.

(మోకరించును)

[ప్రవేశము - వశిష్ఠుండు]

వాల్మీ:— వశిష్ఠమునీంద్రా! నమస్కారము.

వశి:— ఓహో, వాల్మీకిమహర్షి! (కౌంగిలించుకొని) మునీంద్రా! మీపాదస్పర్శచే యజ్ఞవాటిక పవిత్రము కాంగలదు. రామచంద్రా! యజ్ఞక్షేత్రమునందుం దపోధను లనేకులు వచ్చి నిరీక్షించుచున్నారు. నానాదేశాగతులైన రాజపుంగవులు వేచుకొని యున్నారు. యావద్భారత వర్షమును వేయి కన్నులతో వీక్షించుచున్నది. సత్వరము యజ్ఞవాటికకురమ్ము.

శ్రీరా:— గురుదేవా! యజ్ఞసన్నాహ మంతయు నిల్పివేయుఁడు. సమాగతమైన సమస్త ప్రజానివహమునకును నా క్షమాభిక్షను దెల్పుఁడు. అచిరకాలమునందే యశేష రాజమండలమును, తపోధనగణమును ఆహ్వానించి, వారి సమక్షమున నీ యయోధ్యా సింహపీఠిపై భరతు నభిషిక్తునిఁ జేసి నేను వాన ప్రస్థమును స్వీకరించి యరణ్యగామి నయ్యెదను.

భర:— (చకితుఁడగును)

వశి:— రామచంద్రా! నీ యభిప్రాయము నాకుఁ దెలియుటలేదు.

శ్రీరా:— గురూత్తమా! రాజధర్మ నిర్వహణము నాకింక నసాధ్యము! హృదయధర్మమును దప్ప అన్యధర్మమును నేనింక స్వీకరింపఁజాలను. స్వతంత్ర విచారణాధికారము లేని రాజత్వము, కేవలము శాస్త్రనియుక్త శాసనాధీనమైన తుచ్ఛ యంత్రభ్రమణమును నేను విసర్జించుచున్నాను. మునీంద్రా!

తే. గీ. నా నిమిత్తము నా బహిఃప్రాణమైన
జానకీదేవి సర్వంబు సన్యసించె!
ఆమెకై తుచ్ఛ రాజ్య సింహాసనంబు
వదలకుంటిని జీవచ్ఛవంబ నేను!

నా జ్ఞానదృష్టి నింతకాలమును గప్పివైచిన మాయాధూమ పటల మిప్పుడు విచ్ఛిన్నమైనది. ఇంక నొక్కక్షణమైన నే నీ రాజ్యపదవి నుండఁజాలను.

వశి:— యజ్ఞానుష్ఠానమునకై నీవే స్వయముగ స్వర్ణసీతా నిర్మాణముఁ గావించితివి! తిరిగి యిప్పు డీ పరివర్తన మేమి?

శ్రీరా:— స్వర్ణ సీత! స్వర్ణవిగ్రహము! ఆ నిర్జీవ ప్రతిమను గొనిపోయి సరయూతరంగ మధ్యమునఁ బాఱవేయుఁడు. భరతుని రాజ్యాభిషిక్తునిఁ జేసి నేను వానప్రస్థుఁడ నయ్యెదను.

భర:— (చెవులు మూసికొని) పాపము శమించుగాక! శ్రీరామ పరిత్యక్తమైన సింహాసనముపై భరతుఁ డభిషిక్తుఁ డగుటకుఁ బూర్వము జగత్ప్రళయము సంభవించుఁగాక!

వశి:— శ్రీరామ పరిత్యక్తమైన సింహాసనముపై నధివసించుట కెవ్వరి కర్హత కలదు? వత్సా! నీవు వానప్రస్థము స్వీకరించిన రాజ్యమున సర్వతోముఖ విప్లవము సంభవించును.

శ్రీరా:— సంభవింపనిండు. రాజ్యము విప్లవాగ్నిలోఁబడి భస్మము కానిండు. ఇట్టి సహస్రకోటి సామ్రాజ్యములకన్న సీతా ప్రేమామృత బిందు వొక్కటి నాకు వాంఛనీయము! ఆ ప్రేమ స్మరణ మొనర్చుకొనుచు నే నరణ్యవీథుల సంచరించెదను.

వశి:— (వాల్మీకితో) మునిచంద్రమా! ఇంకఁ గర్తవ్యమేమి? మీకు గోచరముకాని విషయము బ్రహ్మాండమున లేదు. ఈ సమయమున మీరు తోడ్పడకున్న సూర్యవంశము విధ్వస్తము కాఁగలదు.

వాల్మీ:— ఋషీంద్రా! నా యంతర్నేత్రమునకుఁ గేవల మొక్కటి మాత్రమే సాధనము గోచర మగుచున్నది! అది జానకీ పునరాగమనము.

వశి:— అది యెట్లు సాధ్యము కాఁగలదు? అపవాదఘాతయై, యనమానితయై యా రాజ్యలక్ష్మి రాజ్యత్యాగ మొనర్చినది. ఆమె తిరిగి అయోధ్యకు వచ్చునా? మహాత్మా! ఈ మహా సమస్యా పరిష్కారముకూడ మీ వల్లనే కావలయును.

వాల్మీ:— (యోచించి) అయోధ్యయందలి ప్రజాసర్వస్వము, ఆబాల వనితా వృద్ధముగ, ప్రజానాయకులవెంటఁబోయి, ఆ మహాసతీ చరణ సాన్నిధ్యమున క్షమాభిక్ష మర్థించినచో సామ్రాజ్య మాంగళ్యము నిమిత్తము నా యాశ్రమలక్ష్మి తిరిగి మీ రాజ్యలక్ష్మి కాఁగలదు. సందేహము వలదు. ఆ భారము నాయది.

వశి:— మహానందము, మునీంద్రా! మీ యాదేశము నయోధ్యా ప్రజాకోటి తప్పక పాలించును.

భర:— మునీంద్రుల యాదేశ మవశ్యము పాలింపఁబడును. స్వయముగ నేను వాడవాడకును బోయి ఋషివాక్యము నుద్ఘోషించెదను.

తే. గీ. మన మహారాజ్యలక్ష్మి క్రమ్మఱ నయోధ్య
కైన రావలె జయ జయ ధ్వానములను!
దగ్ధపటలమై యీ యయోధ్యాపురంబు
కూలిపోనైన వలయుఁ బాతాళమునకు!

[ప్రవేశము - భద్రుఁడు]

భద్రు:— మహారాజా! మునీంద్రులారా! భరత లక్ష్మణ దేవులారా! తమ దివ్యసముఖమున పరమాద్భుతమగు నొక నివేదనమును జేయవచ్చితిని.

వశి :
భర :
లక్ష్మ: } ఏమది ?

భద్రు:— ప్రజానాయకులెల్ల సింహద్వారముకడ సమావేశమై యున్నారు. జానకీదేవి స్వర్ణమూర్తిని దర్శించి యీ మహాసతి శ్రీచరణసాన్నిధ్యమున క్షమాదాన మర్థింప వేగిర పడుచున్నారు.

భర:— (మహానందమున) భద్రా! ఇది సత్యమే యగునా ?

భద్రు:— మహాప్రభూ! సత్యము. మిన్నుముట్టుచున్న యీ ప్రజాఘోషము నాలింపుఁడు. మిథ్యాపవాదమును సహస్ర ముఖముల ఖండించుచున్నారు. సీతాశూన్యమైన శ్రీరామ రాజ్యము అసంపూర్ణమని ఘోషించుచున్నారు.

భర:— గురుదేవా! మహర్షి పుంగవా! ఇంత కాలమునకుఁ బ్రజాహృదయమున జ్ఞానోదయమైనది! ఇంక మనమందఱము యజ్ఞవాటికకుఁ బోవుదము రండు. వాల్మీకి మహర్షి పాదస్పర్శ మొనర్పించి ప్రజానాయకులచే నపరాధ స్వీకరణ

మొనర్పించి ప్రజాగణమును క్షమాయోగ్య మొనర్తము, రండు. లక్ష్మణా! పుణ్యభూమియైన వాల్మీకాశ్రమమునకుఁ బోవ రథము సిద్ధముఁ జేయుము. దేవిని తొల్లి యరణ్యమున విడచివచ్చినది నీవు! తిరిగి యామెను నీవే యరణ్యమునుండి యయోధ్యకుఁ దోడ్కొని రావలయును.

(వశిష్ఠ వాల్మీకులు, భరత లక్ష్మణులు నిష్క్రమింతురు.)

శ్రీరా:— భద్రా! ద్వాదశవర్ష పరిమితమైన యీ గాఢరాత్రి యింత కాలమున కంతము కానున్నదా? ఈ కాలరాత్రి కారంభము తొల్లి నీ ముఖముననే కదా! తిరిగి దాని యంతము సహితము నీ ముఖముననే వినవచ్చినది! భగవాన్! ప్రభాత రేఖా దర్శనమునకై యింక నెంత కాలము నేను వేచియుండవలెను!

(తెర వ్రాలును.)

పృథ్వీపుత్రి

పంచమాంకము

దృశ్యము 1

[తమసాతీరము — భూగర్భమునుండి . కరుణారసమయమగు సంగీతము వినవచ్చుచుండును. సీత యొక తిన్నెపైఁ గూర్చుండి తదేకధ్యానయై యా సంగీతమును వినుచుండును. ఆశ్రమవాసిని యైన ఆత్రేయి సీతముఖమును జూచుచుఁ గూర్చుండి యుండును.]

సీత:— ఆహా ! సర్వచింతాపహారమైన యా సుధామధుర సంగీతము నాలించుచుంటివా, ఆత్రేయీ ?

ఆత్రేయి:— అమ్మా ! ఆలించుచున్నాను. ఆ మధురనాదము నిర్జనమై యున్న యీ యేకాంత ప్రదేశమునం దెచ్చటినుండి వచ్చుచున్నది ?

సీత:— ప్రకృతి స్వరూపిణి, ధరిత్రి, నా ప్రియజనని హృదయాంతరాళమునుండి యా కరుణామయ సంగీతవాహిని యావిర్భూతమగుచున్నది ! సంసారమాయాబధిరు లగు నిర్భాగ్యు లా మహాసంగీతమును వినఁజాలరు. ఈ నా మాతృదేవత యాహ్వానము దివారాత్రములు నా కర్ణములఁ బడుచునే యుండును. ఆమె నన్నుఁ బిలుచుచున్నది ! సంసారశృంఖలముల భేదించుకొని నన్నుఁ దన వక్షఃపీఠమునకు రమ్మనుచున్నది. ఆత్రేయీ! ఈ శుష్కప్రపంచమును విడచి, తిరిగి యామెకడకుఁ బోవ నాకును మనసగుచున్నది !

ఆత్రేయి:— అమ్మా ! అట్లనవలదు.

సీత:— తొల్లి యరణ్యావాసమునఁ బంచవటియందు శ్రీరామసమేతనై సర్వసౌఖ్య సంపూర్ణనై జీవనయాత్రఁ గడపుచుండిన దినములయందు, గోదావరీతరంగఘోషమునందు లీనమై

యీ మాతృసంగీతము ప్రథమమున నాకు వినవచ్చినది. కాని, ఆ ధ్వని యప్పుడు కేవల మస్పష్టమై యుండెను. పిమ్మట, లంకా ప్రవాసమున, అశోకవనమందు, సముద్ర కల్లోల ఘోషమున సమ్మిళితమై యీ మాతృసంగీతము తిరిగి వినవచ్చినది! ఈసారి యది పూర్వమువలెఁగాక, ఇంచుక స్ఫుటముగ నుండెను. పిమ్మట అయోధ్యా సింహాసనాంతరాళమునుండి తిరిగి యీ సంగీతమే నాకు వినవచ్చినది! అది మఱింత విస్పష్టముగ నుండెను. ఇప్పుడు, సర్వసౌఖ్య విదూరనై, సర్వసన్యాసినినై యున్న నాకుఁ దిరిగి యా సంగీతమే వినవచ్చుచున్నది! ఆత్రేయీ! ఇప్పు డది యత్యంత విస్పష్టముగ నున్నది! ఇందలి యర్థము నా కిప్పుడు సంపూర్ణముగ గ్రాహ్యమగుచున్నది.

(తిరిగి నేపథ్యమున సంగీత ధ్వని)

సీత:— అదిగో, అదిగో, ఆలింపుము, ఆత్రేయీ! ఆ యమృతలహరి నీ కర్ణములఁ బడుచున్నదా? నా తల్లి నన్ను ఆహ్వానించుచున్నది—ఆత్రేయీ! ఆత్రేయీ! ఇటు చూడుము; ఇటు చూడుము. ఈ సైకతస్థలమందలి పాదచిహ్నములఁజూడుము.

తే. గీ. కలుష భంజనివైన నా కన్నతల్లి
శ్రీ చరణ పద్మరేఖలే చెలియ, యివ్వి!
ప్రేమ హృదయ కంపంబు భరింపలేక
నేగుదెంచె నన్నొకసారి కౌఁగిలింప!

అమ్మా! అమ్మా! రమ్ము. నీ బాహుబంధమున నన్నుఁ జేర్చుకొనుము. (కన్నీరు గార్చును.)

ఆత్రేయి:— అమ్మా! ఊరడిల్లుము. ఊరడిల్లుము. నీ నేత్రములు చెమ్మగిల్లిన-చోఁ గుమారులు నిస్తేజు లగుదురు.

సీత:— ఆత్రేయీ! ఆ విషయము నే నెఱుఁగుదును. కావుననే నేటివఱకును నే నీ శుష్క కంకాళమునందుఁ జీవములను భరించి యుంటిని.

(మహాదుఃఖమున వగర్చుచు లవుఁడు ప్రవేశించి తల్లి వక్షమున శిరముంచి కౌఁగిలించుకొనును.)

లవు:— (ఏడ్చుచు) అమ్మా! .... అమ్మా! .... అభాగినీ!
(మాటరాక ఏడ్చును.)

సీత:— (ఆత్రముతో) నాయనా! నాయనా! ఏమైనది? ఏల యేడ్చుచుంటివి. తండ్రీ! నీ కేమి వాటిల్లినది?

లవు:— (ఏడ్చుచు) లక్షసార్లు నేను ప్రశ్నించినను నాకుఁ జెప్పవైతివి. నాయెడ నీ కింత యవిశ్వాస మేలనమ్మా? (ఏడ్చుచుండును.)

సీత:— ఏమైనది నాయనా? ఏమైనది?

లవు:— (ఏడ్చుచు గద్గదికతో) హా! హా! నిరపరాధిని! శుష్కాపవాద తిరస్కృత! రాజ్య బహిష్కృత! నిర్వాసిత! సన్యాసినియా నా తల్లి!! (ఏడ్చును).

సీత:— (కన్నుల నీరునించి) కుమారా! దుఃఖింపకుము. దుఃఖింపకుము తండ్రీ! నా గర్భమునఁ జిచ్చు రగుల్పకుము, తండ్రీ!

లవు:— (ఏడ్చుచు) ఎంత యభాగినివమ్మా! ఎన్ని కష్టముల భరించితి వమ్మా!

సీ॥ భర్తృసేవాదీక్షఁ బదునాల్గు వర్షముల్
కానపాలయితమ్మ కన్నతల్లి!
అడవులయందు నిద్రాహారములు లేక
జీర్ణించితమ్మ, రాజీవనయన!
అవిరామ శీతవర్షాతప వ్యథలకున్
తలయొగ్గితమ్మ, కాంతామతల్లి!
దశకంఠ భుజంగ సందష్టవై వివశవై
మూర్ఛ నొందితివమ్మ పుణ్యచరిత!

ఆ. వె. రాక్షసేంద్రు పేట, రాకాసి మూకల
నడుమ, నొంటి బ్రతుకుఁ గడపితమ్మ
సంశయాపవాద సమ్మార్జనమునకై
చిచ్చునందు నీవు చొచ్చితమ్మ!

(వెక్కి వెక్కి యేడ్చుచు) అదిచాలక .... మిథ్యాపవాదమునకుఁ దలయొగ్గి, రాజ్యబహిష్కృతవై, తిరిగి యరణ్యాగామినివై, యిప్పుడు సన్యాసినివై యుంటివా, తల్లీ! (ఏడ్చును.)

సీత:— తండ్రీ! ఊరడిల్లుము. నేనిప్పు డెట్టి దుఃఖము ననుభవించుట లేదు. మీ జన్మముచే నా సమస్త క్లేశములను నేను సంపూర్ణముగ మఱచిపోయితిని. పూర్ణానందమయమై యున్న నా హృదయమున కిప్పు డా పూర్వ సంఘటనములెల్ల స్వప్నప్రాయము లైనవి! నాయనా! విధి విధానము నెవ్వ రతిక్రమింపఁగలరు? (కుమారుని బుజ్జగించును.)

[ప్రవేశము - వాల్మీకి]

వాల్మీ:— కుమారీ!

సీత:— తండ్రీ! ఇదేమి, ఇంత శీఘ్రముగఁ దిరిగి వచ్చితివి? అశ్వమేధము సంపూర్ణమైనదా?

వాల్మీ:— (మందహాసముఁ జేయుచు) అమ్మా! సంపూర్ణ మెట్లు కాఁగలదు?

ఆ. వె. అశ్వ మిచటనుండ, నశ్వరక్షకసైన్య
మవల చావుబ్రతుకులందునుండ,
సీత యిచటనుండ, శ్రీరాముఁ డటనుండ,
నశ్వమేధ మెట్టు లగును తల్లి?

అమ్మా! నా అయోధ్యాయాత్రకు ఫలితముగ నీవిప్పు డయోధ్యకుఁ బోవలసి యున్నది.

లవు:— (తీవ్రముగ) అసంభవము .... అసంభవము. అది యెన్నఁటి కిని కానేరదు.

వాల్మీ:— నాయనా!

లవు:— అయోధ్యానగరమునకా? ఏ పాపధామమునందలి ప్రజా గణము నా తల్లి నవమానపఱచెనో, ఆ యభిశప్త భూమిపై నా తల్లి పదక్షేపముఁ గావింపదు. ధనాధికార గర్వాంధమై, పతివ్రతా గౌరవమును పదఘట్టిత మొనర్చియున్న యా పాప రాజ్యమునందు నా తల్లి తిరిగి యడుగుపెట్టుట కల్ల, కల్ల.

వాల్మీ:— నాయనా! రాజధర్మము పాలింపఁబడవలయునుగదా! సంఘ నియమంబులు అనతిక్రమణీయములు. శ్రీరాముని దేమిదోషము? ఆతఁడు కేవలము రాజధర్మమును పాలించెను. ఆ ధర్మపరిపాలనమునందు ఆ మహాపురుషుఁడు కావించిన యాత్మత్యాగము ప్రపంచాతీతము, నాయనా! అయోధ్యా ప్రజాకోటి యిప్పుడు పశ్చాత్తప్త మగుచున్నది! నా పదము లంటి నీ తల్లిని క్షమాభిక్ష నర్థించుచున్నది! యావద్భారత వర్షము సాక్షిగ శ్రీరాముఁడు జానకీదేవిని తిరిగి పరిగ్రహించును.

లవు:— తాతా!

తే. గీ. సకల తార్కిక ధూళి ధూసరితమైన
ఆ మహారాజ శుద్ధాంత సీమకన్న
భువనపావనమైన యీ పుణ్యభూమి
తాపసోత్తమ! యుత్తమోత్తమము కాదె?

వాల్మీ:— సత్యమే నాయనా! కాని, శ్రీరాముని యంతరంగమును బరీక్షించి, ప్రజాకోటి పశ్చాత్తాపమును స్వీకరించి, నేను సీతను దిరిగి యయోధ్యకుఁ దెచ్చి యప్పగించెద నని యజ్ఞ వాటికయందు సమాగతమై యుండిన రాజఋషి బృందము

సముక్షమున వాగ్దాన మొనర్చితిని. నా యాశ్రమ లక్ష్మి, నా యాశ్రమ దీప్తి, సీత, యీ ప్రదేశమును విడిచినంతనే యీ తపోవన మంధకార బంధురమైపోవునని నాకుఁ దెలియును. కాని, గత్యంతరము లేదు. నా మానసిక వ్యథను బరమాత్ముఁ డెఱుఁగును.

సీత:— కాని, తండ్రీ! అయోధ్యయందలి ప్రజాగణములు—

వాల్మీ:— అమ్మా! రాజ్యమందలి ప్రజానాయకు లెల్ల వచ్చి యాశ్రమోపాంతమున నీ శ్రీచరణ దర్శనమునకై వేచుకొని యున్నారు. అపరాధ స్వీకరణ మొనర్చి, క్షమాభిక్ష మర్థించి, నిన్నయోధ్యకుఁ దోడ్కొనిపోవ సంకల్పించుకొని యున్నారు. వారితో లక్ష్మణుఁడుకూడ వచ్చియున్నాఁడు.

(తొందరగా లవుని వెంటనుండిన బాలకుఁడు ప్రవేశించును.)

బాల:— లవకుమారా! లవకుమారా! కొంప మునిఁగినది. నీచేఁ బడఁగొట్టబడిన సైన్య మంతయుఁ జెదపుట్టవలె గొలగొలమని లేచి నిలువబడినది! ఏమి దండు! ఏమి దండు! ఏమి కోలాహలము! తమసాతీర మంతయు మహా అల్లకల్లోలముగా నున్నది!

లవు:— (సీతతో) నాచేఁ బ్రయోగింపఁబడిన సమ్మోహనాస్త్ర ప్రభావముచే ఆ సైన్య మంతయు మూర్ఛాగతమైన దమ్మా! మూఁడు రాత్రులు గడచిపోవుటచేఁ, దిరిగి యా సైన్యమంతయు సచేతనమై యుండును.

బాల:— ఇంతలో, ఆ వైపునుండి మఱొక పెద్ద దండువచ్చి, వారితోఁ గలసినది! నాకుఁ జాల భయముకలిగి, పరుగెత్తుకొనివచ్చి మన పెద్దమఱ్ఱిమాటున డాగియుండి, వారి చర్యలను గనిపెట్టితిని. ఆ క్రొత్తదండుతో మఱొక సేనాపతి వచ్చి ప్రాత సేనాపతిని గలసికొని యేమేమో కొంతసేపు మాటాడినాడు.

వాల్మీ:— ప్రజాగణసమేతుఁడైన లక్ష్మణుఁడు యాగాశ్వమున కంగరక్షకుఁడై వచ్చియుండిన శత్రుఘ్నునిఁ గలసియుండును.

బాల:— ఇప్పుడు వారిద్దఱును ఆ సైన్యము నంతయు వెంటబెట్టుకొని, యీ వైపే వడివడిగా వచ్చుచున్నారు. ఒక్కటే పరుగున నేనాశ్రమములోనికి వచ్చిపడితిని. సైన్య మంతయు వచ్చి ద్వారముకడ నాగినది. మన కుశకుమారుఁడు ఆ సేనాపతుల నిద్దఱ నెదుర్కొని, వారితో నేమేమో కొంత మాటాడి, వారితోఁ గలసి, అదే, యిటు వచ్చుచున్నాఁడు.

[ప్రవేశము - లక్ష్మణ శత్రుఘ్నులతో కుశుఁడు]

కుశు:— అమ్మా! ఎవ్వరిని బట్టి మన ద్వారముకడకుఁ దెచ్చితినో చూచితివా? (లక్ష్మణునిఁ జూపుచు)

తే. గీ. కడఁగి లంకామహోగ్ర సంగ్రామ మందు
మేఘనాథునిఁ గూల్చిన మేటి యితఁడు!
ఈ మహావీరు ముకుఁబట్టి యీడ్చి యిటకుఁ
దెచ్చియున్నట్టి నే నెట్టి దిట్టనమ్మ!

(అందఱును నవ్వుదురు)

(శత్రుఘ్నునిఁ జూపుచు) అమ్మా! ఈతఁ డెవ్వరో నీకుఁ దెలియునా?

తే. గీ. సార్థకాహ్వాయుఁ డుగ్ర పరాక్రముండు,
యజ్ఞ హయరాజమున కీతఁ డంగరక్ష!
ఇతని మూర్ఛాగతు నొనర్చి యీ లవుండు
చేయఁగారాని దోషంబుఁ జేసెనమ్మ!

లవు:— (లక్ష్మణ శత్రుఘ్నులకు నమస్కరించుచు) తండ్రులారా! అపరాధియైన యీ లవకుమారుని క్షమింపుఁడు.

లక్ష్మ:-
శత్రు:- } — (లవకుశులను కౌఁగిలించుకొందురు.)

సీత:— సుమిత్రా సుతులారా! ఎంతకాలమునకుఁ దిరిగి మిమ్ముఁ జూచు భాగ్యము సంప్రాప్తమైనది!

లక్ష్మ:— దేవీ!

చం. నడివడి రాజమార్గములపై రథచోదకశక్తిఁ జూపి, ని
న్నడవుల డించి క్రమ్మఱిన యా నరరూపపిశాచి యీతఁ డి
య్యెడ కడదెంచె డిన్ బిడియమింతయు లేక సతీమతల్లి! నిన్
గడుప నయోధ్యకున్ మఱల, కర్మఫలానుభవంబు తప్పునే!

దేవీ! అయోధ్యయందలి యావత్ ప్రజానివహమును నా ముఖంబునఁ దమ మహాపరాధమునకు నిన్ను క్షమాభిక్ష నర్థించుచున్నది. ప్రజానాయకు లెల్లరును నా వెనువెంట నేతెంచి, నీ శ్రీచరణ దర్శనమునకై యాశ్రమద్వారముకడ వేచుకొని యున్నారు. తల్లీ! వారి ప్రార్థన మంగీకరించి, తిరిగి రాజధానికి విజయముచేసి సామ్రాజ్యము నుద్ధరింపవా?

సీత:— సౌమిత్రీ! ముందు కుశలవార్త లెఱిఁగింపుము. అయోధ్యా పతికి క్షేమమే కదా? అయోధ్యా ప్రజాకోటికి మంగళమా?

లక్ష్మ:— తల్లీ!

తే. గీ. చంద్రకళలేని జలధరాచ్ఛన్నరాత్రి,
దీపశిఖలేని రాజమందిరము కాదె,
జానకీదేవి లేని రాజ్యంబు! దేవి!
క్షేమ మెటుకల్గు నా దుద్రభూమియందు?

వాల్మీ:— అమ్మా! విలంబమేల? ఇంకపై క్షణ మొక మహాయుగము కాఁగలదు. బాలకులారా! ప్రయాణ సన్నద్ధులు కండు.

సీత:— తండ్రీ! ఇది రాఘవులకు సమ్మతమా?

వాల్మీ:- }
లక్ష్మ:- } తల్లీ! సందేహ మేమి?

సీత:— ఆ మహాప్రభుని సమ్మతము నా కవశ్యాచరణీయము! ఇంక నే నిచ్చట నుండఁదగదు. కుమారులారా! నడువుఁడు. లవ కుమారా! జనకులపట్ల స్వాభిమానమును విడువుము తండ్రీ!

శ్రీరామాజ్ఞ మన కనుల్లంఘనీయము! నడువుఁడు. మనకు సన్నాహమున కేమున్నది ?

తే. గీ. ఒక్క ప్రాణిగ నిటు వచ్చి యున్న నేను
మూఁడు ప్రాణులమై నేఁడు పోదు మటకు!
ఆశ్రమ వనీ విహార విహంగములము,
ఇతర సన్నాహములు మన కేమి కల్గు ?

సౌమిత్రీ! శత్రుఘ్నా! నడువుఁడు. ప్రజానాయకుల దర్శించి పోవుదము.

(వాల్మీకి తప్ప తక్కినవా రందఱు నిష్క్రమింతురు.)

[నేపథ్యమున గీతము]

కుమారీ! కుమారీ! తిరిగి సంసార మాయాగోళమునం దేలఁ బ్రవేశించుచుంటివి? మాయ! మాయ! అంతయును మాయ!

వాల్మీ:— (ఆలించి) భూతధాత్రి, ధరిత్రీదేవి కుమారిక నుద్దేశించి ఘోషించుచున్నది! హే! సర్వంసహా! వసుంధరా! ఈశ్వర సంకల్ప మమోఘము!

(శ్రీరామ కీర్తన మొనర్చుచు నిష్క్రమించును.)

దృశ్యము 2

[అయోధ్యా రాజసభ - శ్రీరాముఁడు సింహాసనస్థుఁడై యుండును. ఋషీశ్వరులు, సామంతులు, ప్రజానాయకులు, ఉచితాసనస్థులై యుందురు.]

వశి:— లోకారాధ్యులగు నో తపోధనులారా! సామంత ప్రభు సత్తములారా! ప్రజానాయకులారా! నేఁడు మనకు మహాశుభ దినము. రాజ్యత్యాగినియైన రాజ్యలక్ష్మి తిరిగి నేఁడు రాజధానికి రానున్నది. ఆ మహాదేవి శుభాగమనమున అరిష్టాకులమై

యుండిన సామ్రాజ్య మంతయుఁ దిరిగి సర్వమంగళధామమై భూతలస్వర్గము కాఁగలదు.

[ప్రవేశము - రాజభటుఁడు]

భటు:— మహాప్రభూ! లక్ష్మణదేవుల రథము సరయూ సైకతములపై గోచరించుచున్నది !

భరతుఁడు:— ఓయీ ! శీఘ్రముగఁ బోయి నగర మంతయుఁ బుష్ప తోరణాలంకృత మగునట్లు చేయుము. నగరమునం దంతటను మంగళవాద్యములు మ్రోగవలయును. పురసౌధములపై బహువర్ణ పతాకము లెగురవలయును. పొమ్ము.

(భటుఁడు నిష్క్రమించును)

శ్రీరా:— (స్వగ) ఆహా! ఎంతకాలమునకుఁ దిరిగి నాకు సీతా దర్శనము! పుత్రద్వయీ సహితయైన సీత ! ఇట్టి మహానంద సమయమున నా హృదయ మేల చలించుచున్నది? నా ప్రాణము లేల సమ్మూర్ఛితము లగుచున్నవి? నా చిత్త మేల యమంగళమును శంకించుచున్నది ?

[ప్రవేశము - మఱొక భటుఁడు]

భటు:— (అభివాదముఁ జేసి) మహాప్రభూ! యజ్ఞాశ్వము వెంటఁబోయిన సమస్త సైన్యమును, లక్ష్మణదేవుల వెంటఁబోయిన పురజన సమూహ మంతయును వెంటనడువ, రథమువచ్చి యజ్ఞశాల కడ నాగినది. వాల్మీకిమహర్షి వెంట మహాదేవి పుత్రద్వయముతో, లక్ష్మణ శత్రుఘ్న దేవులు వెంటనడువ నదే యిటు వచ్చుచున్నారు.

[తెరలో మంగళవాద్యములు - శంఖధ్వనులు - జయజయ ధ్వానములు - క్రమముగ వాల్మీకి, సీత, లవకుశులు, లక్ష్మణ శత్రుఘ్నులు ప్రవేశింతురు.]

సీత
కుశలవులు } :— (శ్రీరామునకును సభకును నమస్కరింతురు.)

శ్రీరా:— (అతి సంభ్రమమున) సీతా! సీతా! ప్రాణేశ్వరీ! ఈ యధమాధముని బునరుద్ధరింపఁ దిరిగి వచ్చితివా ?

(బాష్పములు రాల్చును)

వశి:— అమ్మా! ఇటురమ్ము. ఎంతకాలమునకుఁ దిరిగి నీ దర్శన భాగ్యము లభించినది తల్లీ! ఇటురమ్ము. ఈ రాజసభా సమాగతులై యున్న మహర్షి సామంత ప్రజాగణము సమక్షమునం దొక్కసారి నీ నిష్కళంకత్వము నుద్ఘోషించుముతల్లీ !

సీత:— (ఇంచుక నిస్తబ్ధయై, ముఖమెత్తి) నా నిష్కళంకత్వమును దిరిగి యిచ్చట నుద్ఘోషింపవలయునా ?

వాల్మీ:— వశిష్ఠమునీంద్రా! తిరిగి యట్టి యుద్ఘోషణమున కావశ్యకత యేమున్నది ?

వశి:— ఋషిపుంగవా! సూర్యవంశ కళంకక్షాళనమున కది యావశ్యకము.

వాల్మీ:— (ఇంచుక తీవ్రముగ) ఏమీ! కళంకక్షాళనమా! ఈ జగదేకపావని యీ సభాముఖమునఁ దన నిష్కళంకత్వము నుద్ఘోషించుకొనవలయునా? వశిష్ఠమునీంద్రా! ఇంతకంటె హాస్యాస్పదమగు విషయ ముండునా ?

సీ. ఏ మహాలక్ష్మిని హృత్సీమదాల్చి భూ
దేవి వసుంధరాదేవి యయ్యె!
ఏ పుణ్యనిధి పదక్షేప భాగ్యమున మా
ర్తాండ వంశము జగన్మాన్యమయ్యె!

ఏ మహాసతి దివ్యనామఘోష మొనర్చి
దండకాటవి ముక్తిధామమయ్యె!
ఏ పాపభంజని శ్రీపాదధారియై
పితృహోత్రుండు పవిత్రుఁడయ్యె!
గీ. అట్టి జగదేకపావని యఖిలలోక
పాప కల్మష మేఘ ప్రభంజని, యగు
ఈ మహాలక్ష్మి నేమని యెంచి తార్య,
కల్మష క్షాళనక్రియా కాండమునకు?

ఓ పౌరగణములారా! ఓ ప్రజానాయకులారా! మీ యపరాధ సమ్మార్జనమున కింకను సమయము మించలేదు. ఈ త్రిలోకపావని క్షమాదానము నిప్పుడైన నర్థింపుఁడు. లేదేని, అయోధ్యకు భూచక్రమునందు మరి తావుండదు.

పౌరులు:— (ఏకకంఠమున) వశిష్ఠ మునీంద్రా! ఏమియు వలదు. ఓ జగన్మాతా! మా యపరాధమును క్షమింపుము.

వశి:— (వాల్మీకితో) మహర్షిపుంగవా! క్షమింపుము. అట్టి సత్యోద్ఘాటనమువలనఁ బ్రయోజనము కలదు. మూర్ఖులగు పౌరజను లిక ముం దెన్నఁడును అట్టి నైచ్యమునకుఁ బాల్పడరు. మఱియు, రాజధర్మ నిర్వహణమునకు ఈ సత్యోద్ఘాటన మావశ్యకము.

పౌరులు:— వలదు. వలదు. ఏమియు వలదు. వశిష్ఠమునీంద్రా! చాలింపుము.

వాల్మీ:— (సీత నుద్దేశించి) అమ్మా! కేవలము శ్రీరాముని యంతరంగమును బరీక్షించి, ప్రజాహృదయమునందలి సంపూర్ణ పరివర్తనమును గుర్తించి, నేను నిన్ను నిర్బంధించి యిచ్చటకుఁ దోడ్కొని వచ్చితిని! నన్ను క్షమింపుము తల్లీ!

ఆ. వె. రాజధర్మ మింత రాక్షసంబని సుంతఁ
దెలియనైతి నోసతీలలామ!
అమ్మ! రమ్ము పోద మాశ్రమంబునకు నీ
పాపరాజ్య భూమి వదలి యిపుడె!

లవు:— అమ్మా! ఇంక నొక్క క్షణమైన నిచ్చట నిలువఁదగదు. రమ్మ, ఆశ్రమమునకు మఱలి పోవుదము. ఇచ్చటకుఁ బోవల దని నేను ముందే చెప్పియుండలేదా?

సీత:— కుమారా! శాంతింపుము. తండ్రీ! శాంతింపుము. లంకా సంగ్రామ విజయానంతరము అగ్నిజ్వాలామధ్యమునందు నిలచి సమస్తభూతకోటి సాక్షిగ ఈవఱ కొకసారి నా నిష్కళంకత్వ మును నిరూపించియుంటిని. మఱల నీ మహాసభా మధ్యము నందు నిలచి యా సత్యమునే యుద్ఘోషించెదను. ప్రజాహృదయ మున సందేహ భంజన మగుఁగాక!

పౌరులు:— వలదు. మా కెట్టి సందేహమును లేదు తల్లీ! మమ్ము క్షమింపుము.

సీత:— సభాసీనులై యున్న యో మహర్షి గణములారా! నరేంద్ర సంఘములారా! ప్రజా సంతతులారా! అంతరిక్షమునందలి సూర్య చంద్ర గ్రహ తారాకోటులారా! ఆకాశసంచారులై యున్న దేవతా నివహములారా! మీ రెల్లరును సాక్షులు! ఓ రఘువంశమణీ! శ్రీరామ ప్రభూ! తాము సాక్షి!

శ్రీరా:— (వ్యాకుల హృదయముతో) ఆగుము. ఆగుము. సీతా! ప్రాణప్రియా! ఏమియు వలదు. ఈ రాజత్వమును రసాతల గతమై నశింపనిమ్ము. ఈ సింహాసనము పాతాళగర్భమున గూలిపోనిమ్ము. నడువుము. నేను సహితము నీవెంట నరణ్యా గామినై వచ్చెదను.

(సింహాసనము డిగ్గి సీతకడకు నడచును.)

సీత:— శాంతింపుఁడు, ప్రభూ! శాంతింపుఁడు! — ఓ చరాచర భూతధాత్రీ! నీవు సాక్షి! నా హృదయాధిష్ఠాన దేవత

శ్రీరామప్రభువు! నా యహోరాత్ర ధ్యానమూర్తి శ్రీరామదివ్యమూర్తి! నా సర్వాంగజీవనశక్తి శ్రీరామశక్తి! నా జీవన తారకమంత్రము శ్రీరామ మంత్రము! సీతా రక్త మాంసాస్థిసర్వస్వమును శ్రీరామమయము! సత్యము! సత్యము! సత్యము!

(ఆకసమునుండి పుష్పవర్షము కురియును.)

పౌరులు:— జై జగత్పావనీ! జై జగన్మాతా! జై!

(పుష్పవృష్టి కురియుచునే యుండును.)

సీత:— (నిమీలితలోచనయై చేతులు జోడించి) హే వసుంధరా! సర్వంసహా! జననీ! మహాతాప భయంకరమై యున్న యీ బాహ్యజగతిని నే నింక వసింపఁజాలను. అవమానలజ్జాశోక మయమైన యీ యైహిక జీవన మింక నాకు దుర్భరము! నిరా శాంధకార దుర్గమంబైన యీ ప్రపంచయాత్ర నా కింక నసాధ్యము! ఈ జన్మమునందు నే నింక చేయఁదగు కార్య మేమియును లేదు. ఈ దుస్సహ యాతనను నే నింక భరింపఁ జాలను, భరింపఁజాలను. అమ్మా! అమ్మా!

తే. గీ. సకల చింతా విదూరమై, సర్వతాప
దళనమై, శాశ్వతానంద ధామమైన
నీ ప్రశాంత గర్భమున నన్ జేర్చుకొనవె,
జనని! లోకైక జనని! నీ తనయ నేను!

(భయంకరమగు ధ్వని వినవచ్చును).

శ్రీరా:— దేవీ! దేవీ! నన్ను నిరాధారునిఁ జేసివైచి నీ వెచ్చటికిఁ బోయెదవు? ఈ యభాగ్యప్రాణి కింక దిక్కెవ్వరు? నా యపరాధమును క్షమించి నాకు నీ సహవాసభాగ్య మీయవా? సీతా! సీతా!

(ఆకసము ప్రళయమేఘావృత మగును. సభాస్థాన మంధకార మయ మగును. భయంకర పవనములు వీచును. సభయందు హాహా కారము లుద్భవిల్లును. భయంకర శబ్దముతో భూమి బ్రద్దలగును. ఆ భూగర్భమునందు సీత ప్రవేశించును.)

శ్రీరా:— (ఉన్మత్తునివలె) ఏమిది! ఈ యాకస్మిక ప్రళయమేఘా ర్భటులేమి! ఈ యంధకారచ్ఛాయ లేమి! ఈ ప్రచండ వాయువు లేమి! ఈ భయంకరశబ్ద మేమి! ప్రళయము! ప్రళయము సంభవించుచున్నది. చేతనాచేతన సమస్త వస్తు సమేతముగ భూమండలము కంపించుచున్నది! అదే! అదే! భూగర్భగోళము! సీతా! సీతా! ఎచ్చట నున్నావు? ఎచ్చట నున్నావు?

సీత:— (అర్ధభాగము భూగర్భమునం దుండి) మహాప్రభూ! రఘు వంశభూషణా! సీతాపతీ! సీతాహృదయాంతర్వర్తీ! నాకింక సెలవిండు. సెలవిండు. నేను నా మాతృగృహమునకుఁ బోవు చున్నాను. నా జనయిత్రి ధరిత్రీదేవి నన్ను స్వయముగఁ దోడ్కొని పోవుచున్నది! నన్నాశీర్వదించి సెలవిండు ప్రభూ!

శ్రీరా:— (మహాదుఃఖమున) దేవీ! దేవీ! నన్నుఁ బరిత్యజించు చుంటివా? నన్ను బహిష్కరించుచుంటివా? ఈ భయంకర జగతియందు న న్నేకాకినిఁ జేసి పోవుచుంటివా?

లవ:—, కుశ:— (ఏడ్చుచు) అమ్మా! అమ్మా! మమ్ము మాతృవిహీనులఁ జేసి పోవుచుంటివా? అమ్మా! అమ్మా!

సీత:— ప్రభూ! దేవాధిదేవా! రాజరాజేశ్వరా! న న్ననుగ్ర హింపుడు! నా యపరాధములను క్షమింపుడు! జన్మాంతరము నందుఁ దిరిగి తమ సేవాభాగ్యమునకై కాలగర్భమునందు వేచుకొని యుండెదను. ప్రియకుమారులారా! మీ తల్లి కౌటిల్యమును క్షమింపుడు. సర్వాంతర్యామి సర్వేశ్వరుఁడు నా హృదయఘోషము నెఱుంగును. కులభూషణులు కండు! వంశవర్ధనులు కండు! ఓ రాజర్షి నరేంద్ర సంఘములారా! ఓ ప్రజాగణములారా! తండ్రీ, వాల్మీకి మహర్షి చంద్రమా! గురుదేవా! వశిష్ఠమునీంద్రా! నా యంతిమ నమస్కార మందుకొనుడు.

(గొప్ప ధ్వని పుట్టును. సీత భూగర్భమున నదృశ్య యగును. ఎప్పటియట్లు ప్రకృతి శాంతించును.)

శ్రీరా:— (దిగ్భ్రమఁజెంది) ఏది ? ఏది ? నా జీవనజ్యోతి యేదీ ? ఏదీ నా సహస్రజన్మ తపఃఫలము ? నా యర్ధాంగలక్ష్మి యేదీ ? — లక్ష్మణా ! ధనుస్సు ! ధనుస్సు ! నా ధనుర్బాణముల నిమ్ము. నా మనఃప్రాణ సర్వస్వాపహారిణియైన యీ భూగర్భమును భేదించెదను. సప్త పాథోరాసుల నింకించి తలాతల రసాతల గర్భకుహరంబులను బహిర్గత మొనర్చెదను. గర్వోన్నత్తమై యున్న యీ పంచభూతాత్మక ప్రపంచమును నిశ్శేష మొనర్చెదను. చతుర్దశ భువనములను భస్మీభూత మొనర్చి యా నిస్తేజ భస్మరాసినుండి నా జీవనరత్నమును వెల్లగించెదను. సీతా శూన్యమైన విశ్వగోళమును శ్రీరామాస్త్రప్రహుతాశనార్చి క్షణమాత్రము సహింపఁజాలదు. సూర్య చంద్ర నక్షత్రకోటి చిద్రుప చిద్రుపములై యంతరిక్షమునుండి రాలి పడవలెను. చరాచర బ్రహ్మాండము ప్రాణిశూన్యమై యంధకార గర్భమునందు లీనము కావలెను. తెమ్ము, నా యపరాజిత కోదండము నిటు తెమ్ము.

(ఉన్మాదించును.)

వాల్మీ:— (శ్రీరాముని చేతులు పట్టుకొని) వత్సా ! రఘువంశ వర్ధనా ! శాంతింపుము. శాంతింపుము.

శా. మాయామానుష మూర్తివై జగతి జన్మంబంది సంసార మా
ర్గాయాసంబున విస్మరించితివె, యా దివ్యజ్ఞాన సర్వస్వమున్ !
స్థాయింజెందునె దుర్నివారఘటనా చక్రంబు ! సర్వేశ్వర
శ్రేయస్సాంద్ర పథంబు మీరవశమే శ్రీరామచంద్రప్రభూ !

శ్రీరా:— (మహాదుఃఖమున) హా ! సీతా ! సీతా ! సీతా !

(మూర్ఛిల్లును ; తెరవ్రాలును.)

సంపూర్ణము.

కవిభూషణ

శ్రీ గుండిమెడ వేంకట సుబ్బారావుగారి రచనములు

రాణాప్రతాప్	— చరిత్రాత్మక నాటకము	— 1-50
మేవార్ పతనము	— చరిత్రాత్మక నాటకము — (పునర్ముద్రణములో నున్నది)	
ఖిల్జీ రాజ్య పతనము	— చరిత్రాత్మక నాటకము	— 1-75
దుర్గాదాస్	— చరిత్రాత్మక నాటకము	— 1-50
పృథ్వీపుత్రి	— పౌరాణిక నాటకము	— 1-50
సువర్ణదుర్గము	— నవల	— 2-00
హంసద్వీపము	— నవల	— 2-00
మట్టి మహిమ	— ఖండకావ్యము (పునర్ముద్రణములో నున్నది)	
పుష్పాంజలి	— ఖండకావ్య సంపుటి (పునర్ముద్రణములో నున్నది)	
భావతరంగిణి	— ఖండకావ్య సంపుటి (అచ్చులో నున్నది)	

ACC No - 5820
894.8132
VEN
రు- 1.50